సంపుటి: 40
సంచిక: 4

ఫోన్ నెం:
64843

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 72 రూపాయలు.
హోమ్ డెలివరీ (పత్రిక మరియు సప్లిమెంట్) 10 రూపాయలు.

మే, 1985

మేనేజింగ్ ఎడిటర్:
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్:
డి. రవికుమార్

సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
ఏ. వీ. మోహన్రావ్
ఆర్. ప్రభాకర్
బొమ్మిడి అచ్చారావు

అపరాధ పరిశోధన పోటీ-200

[ఫలితాలు]

మార్చి '85 నెల "అపరాధ పరిశోధన పోటీ - 200" కి సరియైన సమాధానాలు:

1. కుమార్ నారాయణ్.
2. తెలుగు దేశం.
3. అలుక.
4. దోమలు.
5. సర్కస్.

పై జవాబుల ప్రకారం నలుగురు పాఠకులు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి జూన్ '85 నెలనుండి ఒక ఏడాదిపాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్) బహుమతిగా పంపబడుతుంది.

(1) శ్రీ పి. రామచందర్, రూం నెం. 78 ఎఫ్, వాడచి చావల్, నియర్ దీపక్ సినిమా, ఎన్. ఎమ్. జోషి మార్గ్ బొంబాయి—400 013.

(2) శ్రీ వి. జగదీష్, 8-4-32, శ్రీ కిషన్ కాలనీ, వరంగల్—506 002.

(3) శ్రీమతి మాలతి శ్రీరామ్, ఎమ్.కాం., సలీం నగర్ కాలనీ, మలక్ పేట, హైద్రాబాదు—500 036.

(4) శ్రీమతి బి. సంధ్యారాణి, D/O బి. పరమేశ్వర్, ఇండియన్ ఆయిల్ డీలర్, నాగర్ కర్నూల్-509 209 (మహబూబ్ నగర్ జిల్లా)

ఈ నెలలో...

కథలు (మాస పత్రిక)

4. క్షమ ఖరీదు—వసుంధర

24. రూనీరాయబారం—స్వరూప్

46. స్లీపింగ్ పార్టనర్—బొమ్మిడి అచ్చారావు

70. తప్పు ఒప్పుకో—సరసి

91. మృత్యు ఘడియలు—చంద్రశేఖర అజాద్

117. కదిలించే కథ—జొన్నలగడ్డ రామలక్ష్మి

137. దగాచంద్ పేచీలాల్—బి. రాజేశ్వరి

155. చావుకు సాక్ష్యం—'విపంచి'

180. కాంచన శిఖరం (సీరియల్)—ఏ. వీ. మోహన్రావ్

నవలలు (సప్లిమెంట్)

3. మతిలేని యువతులు—బొమ్మిడి అచ్చారావు

46. సముద్రపు దొంగల ముఠా—కె. వి. రమణ

98. తోడుదొంగలు—టెంపోరావ్

137. ఒక ఇంటర్వ్యూ కథ—వసుంధర

181. అగ్ని కిరీటం (సీరియల్)—ప్రతాప రవిశంకర్

ఇంకా—ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, అపరాధ పరిశోధన పోటీ, కార్టూన్లు, మరెన్నో ఆకర్షణలు !!!

ప్రేమ ఖరీదు

వసుంధర

గోకుల్‌ని ఆఫీసులో బాస్ తిట్టారు. షాపు దగ్గర బాకీ తీర్చనందుకు—కొట్టువాడు తిట్టాడు. దారిలో తనకు సరిగ్గా సాయపడలేదని—ఎదురైన స్నేహితుడు తిట్టాడు. అందరి తిట్లకూ ఏవో కారణాలున్నాయి. అయితే గోకుల్ అవన్నీ సహించడానికి కారణం మాత్రం అతడి అసహా

యత, అసమర్థత!

ఇంటికి వచ్చీ రాగానే గోకుల్ భార్యమీద విరుచుకు పడ్డాడు.

ఆ సమయంలో అతడి భార్య ఉమ లేతాకు పచ్చ చీరలో, అదే రంగు బ్లవుజులో, జడలో తెల్లని మల్లెలతో, ముఖాన స్వచ్ఛమైన చిరునవ్వుతో—భర్తతో కలిపి బయటకు వెళ్ళాలన్న ఆశతో గుమ్మంలో నిలబడి ఎదురు చూస్తోంది. భర్తకోసమని అతడి కిష్టమైన ఇడ్లీ, చట్నీ, కారప్పొడి చేసి సిద్ధంగా వుంచింది.

అయినా అతడామెపై విరుచుకుపడ్డాడు. అందుకు కారణమేమీ లేదు. అదే అతడి సమర్థత! ఉమ అతడి తిట్లన్నీ సహించిందంటే ఆమె సహనశీలి అనీ, అసహాయురాలనీ అనలేము. ఆమె తండ్రికి ఒక్కగా నొక్క కూతురు. యాభై వేల కట్నంతో గోకుల్‌కు భార్య అయిందామె. ఇప్పటికీ తండ్రి ఆమెకు ఎప్పుడు కావాలంటే అప్పుడు—ఆమెకోసం తన శక్తి కొద్దీ డబ్బివ్వగలడు. కూతురంటే అభిమాన మాయనకు.

ఉమకు గోకుల్‌కంటే మంచి సంబంధాలే వచ్చాయి. కానీ గోకుల్ బుద్ధిమంతుడనీ, మంచివాడనీ—అతడిని పెళ్ళిచేసుకుంటే ఉమ ఎంతో సుఖపడుతుందనీ ఉమ తండ్రి భావించాడు. కానీ గోకుల్ మంచితనం బయటి సమాజానికి మాత్రమే పరిమితమయింది. సమాజంలో తన చేతకాని తనాన్నంతా అతడు భార్యమీద ప్రదర్శిస్తాడు.

గోకుల్ ఇంట్లో ఖరీదైన డబల్‌కాట్ మంచముంది. ఫోం బెడ్సున్నాయి, ఫ్రిజ్ ఉంది, కలర్ టీవీ ఉంది. అతడింటి డ్రాయింగ్ రూం—సినిమాల్లో డ్రాయింగు రూం లాగే ఉంటుంది. ఇవన్నీ మామగారి ద్వారా అమిరాయత

డికి. లేకుంటే నెలకు పదిహేను వందలు మాత్రం తెచ్చుకునే గోకుల్ ఇవన్నీ అమర్చుకోవడం ఇంత త్వరగా జరుగదు.

బయటి స్నేహితులు గోకుల్ అదృష్టానికి అసూయ పడతారు. ఆ అసూయను వేళంకోళంగా మార్చుతారు. భార్య ద్వారా అన్నీ పొందడంవల్ల భార్య అతడిని మన్నించదని తీర్మానిస్తారు. గోకుల్ యింట్లో సంసారమెలా కొనసాగుతుందో అభినయించి చూపిస్తారు.

వాళ్ళు చెప్పిన ప్రకారం—గోకుల్ ఉదయం లేచింది మొదలు భార్యకు సేవలు చేసుకుంటూనే బ్రతుకుతాడు. ఇంట్లో వంట అతడిది. బట్ట లుతికేపని అతడది. ఇల్లూడ్చే పని అతడిది.

భార్య అనుమతి లేనిదే అతడు బయట కూడా ఏ పనీ చేయలేడు. స్నేహితులకు అప్పివ్వలేడు. స్నేహితులతో పేకాడలేడు. బార్లకు రాలేడు. షికార్లకు పోలేడు.

ఇలాంటి మాటలకు పౌరుషం తెచ్చుకుని గోకుల్ పూర్తిగా స్నేహితుల చేతుల్లోకి వెళ్ళిపోయి వాళ్ళు చెప్పినట్లే వినడం, ఖర్చు పెట్టడం, మొదలుపెట్టాడు. అందువల్ల స్నేహితులకు బాగానే ఉందికానీ గోకుల్ ఆర్థికపరిస్థితి దెబ్బతింది. అది గోకుల్ ఇంట్లో చెప్పుకోలేడు. అయితే భార్యమీద విరుచుకుని పడతాడు.

ఉమ సహిస్తుంది. కేవలం అతడి భార్య కావడం వలన ఆమె అతడి మాటలన్నీ సహిస్తుంది. అయితే అలా ఎంత కాలమో ఆమెకు తెలియడం లేదు.

ఈరోజామె ఎప్పటిలాగే అతడి తిట్లన్నీ సహించి—
"మీకే యిబ్బంది వచ్చినా నన్నడగండి. ఏ సమస్య వచ్చినా నాకు చెప్పండి. నేను మీకు సాయపడతాను. ఎందు కూరికే

అలా విరుచుకు పడతారు? అందువల్ల ప్రయోజన మేమిటి?"
అని నెమ్మదిగా అడిగింది.

దానికి గోకుల్ కోపంగా— "నేను నీకు మొగుణ్ణా? నువ్వు నాకు మొగుడివా?" అన్నాడు.

"ప్రస్తుతానికి మొదటిదే కొనసాగుతోంది. కావాలంటే రెండోదీ జరుగుతుంది .. " అంది ఉమ.

"అంటే?" అన్నాడు గోకుల్ కోపంగానే.

"నేను కావాలనుకుంటే మీచేత వంట చేయించగలను. ఇంటి పనంతా చేయించగలను—" అంది ఉమ.

"చేయించు చూద్దాం!" అన్నాడు గోకుల్ కోపం స్థాయి ఇంకా పెరిగిపోగా.

"మీరు నన్ను మనిషిగా ఆదరించి, మగాడిగా అర్థం చేసుకున్నారా సరేసరి లేదా ఈ రోజునుంచీ నేను వంట చేయను ప్రస్తుతానికిడ్లీ టిఫినుంది. తినండి....రాత్రికి వంట లేదు. మీరు చేశారా—ఉంటుంది లేమా - పస్తే!"

"పస్తు నాకేం కర్మ—హోటలుకు పోతాను...."

"హోటలుకు నేనూ వెళ్ళగలను...." అంది ఉమ.

గోకుల్ నివ్వెరబోయాడు. ఆ రాత్రి నిజంగానే ఇద్దరూ వేర్వేరు హోటల్స్‌కు వెళ్ళి భోంచేసి వచ్చారు.

2

ఆ రాత్రి గోకుల్‌కు నిద్రపట్టలేదు. ఎప్పుడూ మన్ను తిన్న పాములా పడి ఉండే భార్య తనకు ఎదురు తిరిగింది. నిజంగా ఎదురు తిరిగితే తనామె నేమీ చేయలేడు. ఆ విషయం కనిపెట్టేసిందంటే చాలా ప్రమాదం. స్నేహితుల్లో తన పరువు పూర్తిగా పోతుంది.

గోకుల్ కేం చేయాలో తోచలేదు.

మర్నాడుదయం ఉమ కాఫీ కూడా పెట్టలేదు. పని

మనిషిచేత తనకు మాత్రం కాఫీ, టిఫిన్లు తెప్పించుకుంది. గోకుల్‌కి ఉక్రోషంగావుంది కానీ ఏమీ చేయలేకపోయాడు. త్వరగా స్నానంచేసి ఏమీ తినకుండానే ఇంట్లోంచి బైట పడి ముందుగా ఓ స్నేహితుడింటికి వెళ్ళాడు.

ఆ స్నేహితుడి పేరు లక్ష్మణరావు. ప్రస్తుతం భార్య అతడింట్లో లేదు. గోకుల్ నతడు ఆప్యాయంగా ఆదరించాడు. గోకుల్ కతడు దోసెలు కూడా వేసి పెట్టాడు.

"అరే—నీకు దోసెలు వేయడం కూడా వచ్చా?" అన్నాడు గోకుల్ ఆశ్చర్యపడుతూ.

"పెళ్ళయినవాడి కివన్నీ నేర్చుకోక తప్పదు కదా—" అన్నాడు లక్ష్మణరావు.

"మరి ఆఫీసులో అంతా అలా మాట్లాడతారు।"

"అదంతా సరదాకి. కొంపదీసి నిజమనుకున్నావేమిటి?"

"నువ్వు నమ్ము నమ్మకపో—నే నెప్పుడూ నా భార్య మీద అధార్టీ చేయడం తప్ప ఒక్క పనికూడా చేయ లేదు...." అన్నాడు గోకుల్.

లక్ష్మణరావాశ్చర్యపడి — "నువ్వు చాలా అమాయకుడిలాగున్నావు. భార్యంటే ఎవరు? తనవాళ్ళందర్నీ వదులుకొని పూర్తిగా నీతో వుండిపోవడాని కొచ్చిన అమ్మాయి. అలాంటి ఆమెను ఆత్మీయురాలిగా ఆదరించాలి...." అన్నాడు.

"ఈ సంగతి నా కెవరూ చెప్పలేదే—" అన్నాడు గోకుల్.

"ఇలాంటి దెవరైనా చెబితేగాని తెలుసుకోలేని అమాయకుడివా నువ్వు." అన్నాడు లక్ష్మణరావు.

గోకుల్ తెల్లబోయాడు. లక్ష్మణరావు మాటలనుబట్టి

తను భార్యకు తీరని ద్రోహం చేస్తున్నానని అతడి కర్థమైంది.

లక్ష్మణరావు ఆఖరికి—"నువ్వు నిజంగానే మా అందరి మాటలూ విని—మమ్మల్ని సంతోషపెట్టేలా ప్రవర్తించాలనుకునివుంటే-ఏదో ఓ రోజున నీ భార్య తిరగబడుతుంది. ఆడది శక్తి స్వరూపిణి. ఆమె ధాటికి మగవాడు తట్టుకోలేడు. అసహాయురాలైన ఆడదే—ఈ సమాజాన్నెదిరించి ఓ ఊపు ఊపగలదు. అలాంటప్పుడు ఆర్థికంగా అన్ని అండదండలూ వున్న నీ భార్య సంగతి వేరే చెప్పనక్కర్లేదు. అయినా ఇంతకాలం నీ ప్రవర్తన సహించిందంటే ఆమె ఉత్తమ యిల్లాలై ఉండాలి—" అన్నాడు.

గోకుల్ భయపడ్డాడు. గత సాయంత్రం తన భార్య తిరగబడిన విశేషం చెప్పాలా మానాలా అని కాసేపు తటపటాయించి చివరికి చెప్పేసి—"ఇప్పుడు నేనేం చేయాలో చెప్పు—" అన్నాడు.

"అయితే నే ననుకున్నంతా జరిగిందన్న మాట. ఇప్పుడు నువ్వామెను క్షమించమనడం మినహా ఏమీ చేయలేవు. ఆమె నిన్ను తప్పక క్షమిస్తుంది. అయితే ఆమె కోసం ఓ అద్భుతమైన సాహసం చేశావా — ఆమె నిన్నారాధిస్తుంది కూడా" అన్నాడు లక్ష్మణరావు.

"సాహసమంటే?" అన్నాడు గోకుల్.

"నువ్వామెపట్ల తప్పుగా ప్రవర్తించావు. నువ్వంటే ఆమెకు దురభిప్రాయం ఏర్పడుతుంది. నువ్వామెను క్షమార్పణ అడుగుతావు. ఆమె నిన్ను క్షమిస్తుంది. ఆమెకు నీ పట్ల దురభిప్రాయం తొలగిపోతుంది. కానీ తేలిక భావం

ఏర్పడుతుంది. దానికితోడు నీ యింట్లో వున్న ప్రతి వస్తువూ ఆమె తెచ్చుకున్నదే! అందువల్ల ఆమెకు నీపై తేలిక భావం మరీ ఎక్కువుండి వుండాలి. అది పోవడానికే సాహసకార్యం చేయాలి మగాడు మగాడిలా తన శక్తి చూపించుకుంటే ఆడది అతణ్ణి ఆరాధిస్తుంది. అడక్కుండానే అతడి తప్పుల్ని క్షమిస్తుంది...."

"నన్నేం చేయమంటావ్?"

"రౌడీ నెవరినైనా పురమాయించు. వాడికి ముందుగానే డబ్బిచ్చుకో—ఏ పార్కులోనో మీ రిద్దరూ జంటగా కలిసుండగా వాడిని నీ భార్యపట్ల దురుసుగా ప్రవర్తించమను. అప్పుడు నువ్వు వాడిని తరిమేయ్..."

"ఇదీ ఓ సాహసకార్యమేనా?"

"ఆ రౌడీ—నాగరాజే అయితే—అది సాహసకార్యమేగా!"

"నాగరాజా!" ఉలిక్కిపడ్డాడు గోకుల్.

నాగరాజుకు ముప్పైఏళ్ళు అన్ని వయసులవారూ అతడి పేరు చెబితే హడలిపోతారు. సామాన్యులతడి జోలికి వెళ్ళే ప్రసక్తి లేదు. మొదటిరోజు మొదటి ఆటకు నాగరాజు సినిమా హాలుకు వెళ్ళాడంటే క్యూలోని జనం కొట్లాటలు కూడా మాని తప్పుకుని ముందతణ్ణి టికెట్ తీసుకోనివ్వాల్సిందే! ఇంతకంటే అతడి గురించి చెప్పక్కర్లేదు.

"నాగరాజుకు ప్రిస్టేజుంది. ఇలాంటి వాటికి సాధారణంగా ఒప్పుకోడు కానీ భార్యాభర్తల్ని కలపడానికి తప్పక ఒప్పుకుంటాడు. ఎందుకంటే ప్రతి రౌడీకీ, గూండాకూ—తనూ ఏదైనా ఓ మంచిపని చేయాలనుంటుంది...."

లక్ష్మణరావు చెప్పింది నిజమే. నాగరాజతడికి తెలుసు. గోకుల్‌ని పరిచయంచేసి కథ చెప్పగానే అతడు వెంటనే అంగీకరించడమే కాక—అందుకు డబ్బు తీసుకోనని కూడా చెప్పాడు.

ఆ మర్నాడు గోకుల్ భార్యకు మనసారా క్షమార్పణలు చెప్పుకుని బ్రతిమాలి పార్కుకు తీసుకుని వెళ్ళాడు. అక్కడ నాగరాజామెను చూసి అసభ్యంగా మాట్లాడి చేయి పట్టుకోబోయాడు. గోకుల్ ఆవేశపడి అతణ్ణి కొట్టినంత పనిచేసి లొంగదీసి అతడిచేత భార్యకు క్షమార్పణలు చెప్పించాడు.

ఆ దృశ్యం చూసి ఉమ ప్రథిల్లిపోయింది. గోకుల్ కాపురం బాగుపడింది. అతడి జీవితంలోకి కొత్త వెలుగు వచ్చింది.

3

గోకుల్ ఆఫీసులో ఉండగా అతడికోసం టెలిఫోన్ వచ్చింది.

"హలో!" అన్నా డతడు.

"గోకుల్ గారేనా?" అంది అవతలి కంఠం వినయంగా.

"నేను గోకుల్‌నే—మీ రెవరు?"

"నేను సత్యానందాన్నండి. మీకోసం కారు పంపుతున్నాను. అర్జంటుగా మా యింటికి రావాలి...."

"మీ రెవరో నాకు తెలియలేదు...."

"అవన్నీ ఫోన్లో చెప్పే మాటలు కావు. కార్లో సరాసరి మా యింటికే వచ్చేయండి. గంటలో వెనక్కి పంపించేస్తాను...." అన్నాడు అవతలి వ్యక్తి.

గోకుల్ ఆఫీసులో అనుమతి తీసుకున్నాడు. అతడికోసం నల్లరంగు అంబాసిడర్ కారొకటి వచ్చింది. అత

దందులో ఎక్కాడు. కారతణ్ణి—హోటల్ చేతనకు తీసుకు వెళ్ళింది.

డ్రైవర్ కారుదిగి—"రూం నంబరు యాభై ఎనిమిది—" అని చెప్పాడు.

ఆ గది మూడో ఫ్లోరులో వుంది. లిఫ్టులో పైకి వెళ్ళాడు గోకుల్. ఆ వ్యక్తిని చూడాలని అతడి కాత్రుతగా ఉంది.

తలుపులు దగ్గరగా వేసి వున్నాయి.

గోకుల్ కాలింగ్ బెల్ మోగించాడు.

"కమిన్!" అంది లోపల్నుంచో కంఠస్వరం.

గోకుల్ లోపల అడుగుపెట్టాడు.

అక్కడ రెండు సోఫాలు ఒకదాని కొకటి ఎదురుగా వున్నాయి. సుమారు ఏభై ఏళ్ళ బుర్ర మీసాల వ్యక్తి ఓ సోఫాలో కూర్చుని వున్నాడు. అతడు గోకుల్‌తో—"రండి—కూర్చోండి—" అన్నాడు. అదే ఆఖరుసారా యన గోకుల్ని మన్నించడం.

గోకుల్ వెళ్ళి ఆయన కెదురుగా కూర్చున్నాడు.

ఆయన గోకుల్ ముందో వంద రూపాయల నోట్లకట్ట పడేసి—"ఇది పదివేలు. అడ్వాన్సు మాత్రమే. మిగతా పదివేలూ పని పూర్తయ్యాక ఇస్తాను—" అన్నాడు.

గోకుల్ తెల్లబోయి—"పనేమిటి? ఈ డబ్బేమిటి?" అన్నాడు.

"నాకు డబ్బుకి లక్ష్యం లేదు...." అన్నా డాయన—"నా కూతురు సుగుణ కాలేజీలో చదువుకుంటోంది. ఒక రోజున నాగరాజు దాన్ని చేయిపట్టుకుని లాగి బుగ్గమీద చిటికెవేసి—చాలా అందంగా వున్నావు, ఈ అందమిలాగే మెయింటైన్ చేయి అని వెళ్ళిపోయాడు. ఆ

రోజది ఎంత ఏడ్చిందో చెప్పలేను. నేను నాగరాజును కలుసుకుని మాట్లాడాను. అప్పుడప్పుడు నాకు సరదా పుట్టి అలా చేస్తూంటానని చెప్పాడు వాడు. బుద్ధిగా ఊరుకుంటే వా డింకేమీ చేయట్ట. ఊరుకోకపోతే మాత్రం దాని శీలం హరిస్తాట్ట ...."

సత్యానందం ఒక్క క్షణం ఆగి—"నా కెంత డబ్బుందో చెప్పలేను. కానీ ఆ డబ్బుకి అర్థం లేదు. నాగ రాజుని నేనేమీ చేయలేనని తెలిసిపోయింది. ఏ రౌడీలు వాడి జోలికి వెళ్ళరు. వాడు రౌడీలకు రౌడీ. రాక్షసులకు శుక్రాచార్యుడు ..." అన్నాడు.

గోకుల్ భయంగా—"అయితే నేనేం చేయాలి?" అన్నాడు.

"నువ్వు నాగరాజుచేత సుగుణకు క్షమార్పణ చెప్పించాలి ...."

"అది నావల్లకాదు ...." అన్నాడు గోకుల్ అప్రయత్నంగా.

"నీ ప్రతాపం నేను స్వయంగా చూశాను. ఆ రోజు పార్కులో వాడిని నువ్వదర గొట్టేశావు. నీ కళ్ళలో ఏదో శక్తి వాణ్ని లొంగదీసింది. నా కోసం నువ్వింకొక్కసారి ఆ నాగరాజుని లొంగదీయాలి ...." అన్నాడు సత్యానందం.

"ఏదో వాడు నా భార్య జోలికి వచ్చాడని-నేను తిరగబడ్డాను కానీ స్వతహాగా నేను మెత్తని మనిషిని. డబ్బు తీసుకుని రౌడీలను కొట్టడం నాకు వృత్తికాదు." అన్నాడు గోకుల్ తనకు రాని కోపాన్ని నటిస్తూ.

"శక్తి ఉన్నంతలో అందరికీ సాయపడ్డం మంచి మనిషి బాధ్యత. నువ్వు కేవలం నీ భార్య గురించే ఆలోచిస్తావని ఆ నాగరాజనుకోకూడదు. నీ చుట్టుపక్కల ఏ

ఆడదాని కన్యాయం జరిగినా నువ్వు సహించవని ఆ నాగ రాజుకు తెలియాలి. అప్పుడు వాడెప్పుడే ఆడదాని కన్యాయం తలపెట్టినా—నిన్ను గుర్తుంచుకుంటాడు. నువ్వు వాడిని కాదు—వాడిలోని నేరస్థుణ్ణి శిక్షించాలి...." అన్నాడు సత్యానందం.

గోకుల్ ఎన్నో విధాల ఆయనకు చెప్పిచూశాడు చివరకాయన— "నువ్వింత స్వార్థపరుడివని నేననుకోలేదు నీ విషయంలో తప్ప—ఇంకెవరికే అన్యాయం జరిగినా పట్టించుకోవన్నమాట—మా అమ్మాయిని మీ యింటికి పంపుతాను. ఏం. చేయాలో మీ ఆవిడే నిర్ణయిస్తుంది. ఇలాంటి విషయాల్లో ఆడవాళ్ళే మెరుగు...." అన్నాడు.

భార్యపేరు చెప్పేసరికి గోకుల్‌కి భయంవేసింది. తను నాగరాజుని కొట్టాడని ఉమ నమ్మి ఆరాధించింది. అసలు విషయం బయటపడితే తన కథ మళ్ళీ మొదటికొస్తుంది.

గోకుల్ బుర్ర చురుగ్గానే పనిచేసింది. అతడు పదివేలూ తీసుకుని—"సరే - రేపు సాయంత్రం మీ అమ్మాయిని గాంధీ పార్కుకు పంపించండి—సరిగ్గా అయిదున్నరకు" అన్నాడు.

"ఒప్పుకున్నందుకు చాలా థాంక్స్! మనమిలా కలుసుకున్న విషయం మాత్రం రహస్యంగా ఉంచాలి. అందుకే నిన్నిక్కడ హోటల్లో కలుసుకున్నాను...."

"మీ అమ్మాయికి తెలుసా ఈ విషయం?"

"దానికి తెలీకుండా ఎలా?" అన్నాడు సత్యానందం.

"అయితే ఇంక రహస్యమెందుకు?"

"ఇది రహస్యంగా చేయవలసిన వ్యవహారమని నా కూతురు నమ్మాలి. అదేమో అన్నీ డబ్బుతోనే అయిపోతా యనుకుంటుంది...."

4

"మిస్టర్ నాగరాజూ! మరోసారి నీతో అవసరపడింది." అన్నాడు గోకుల్. అతడు లేని దిగులును తన ముఖంలో ప్రదర్శించాడు.

"ఏమిటది?" అన్నాడు నాగరాజు — ఏమాత్రమూ ఆసక్తి చూపకుండా.

"నువ్వింకోసారి ఇంకో అమ్మాయిని అల్లరిపెట్టి క్షమార్పణ అడగాలి ..." అన్నాడు గోకుల్ భయంగా.

నాగరాజు కళ్ళు ఎర్రబడ్డాయి- "వేళాకోళంగా ఉందా?"

"వేళాకోళంకాదు...." అంటూ నసిగాడు గోకుల్.

"చూడూ—ఏదో నీ కాపురం నిలబెట్టాలని సాయ పడ్డాను తప్పితే నీలాంటివాడికి లొంగాననిపించుకోవడం పెద్ద అవమానం నాకు...."

"కానీ నా కాపురం నిలబడలేదుగా...."

"ఏం—ఏమయింది?"

"నా భార్యకు అనుమానం వచ్చింది...."

"ఏమని?"

"డబ్బిచ్చి నిన్ను అరేంజ్ చేసుకున్నానని!"

నాగరాజు తన కోర మీసాన్ని మెలిపెట్టి - "అందులో ఆశ్చర్యమేముంది? నీ పెళ్లాం నిన్నూ చూసింది, నన్నూ చూసింది. ఇద్దరిలో ఎవరు ప్రతాపవంతులో - ఆడది కదా- వెంటనే పట్టేసింది" అన్నాడు.

గోకుల్‌కి మనసు చురుక్కుమంది. కానీ సమాధాన పర్చుకుని "నిజమే చెప్పావు. కానీ నువ్వీ నిజం మా ఆవిడకి తెలిపిందని సంతోషిస్తావా? నాకు సాయపడి నా కాపురం నిలబెడతావా?" అన్నాడు దిగులుగా.

"ఏంటయ్యా - అలా ఆడపిల్లలా కాపురం నిలబెట్టమని

ఏడుస్తావు? ఏంచేయాలో చెప్పు...."

"మా ఆవిడకో స్నేహితురాలుంది...."

"ఊఁ."

"ఆ అమ్మాయి నా భార్యకంటే చిన్నది...."

"అయితే?"

"ఆమె పేరు సుగుణ...."

"అసలు విషయం త్వరగా చెప్పవయ్యా బాబూ!" విసుగ్గా అన్నాడు నాగరాజు.

"చెబుతున్నాను. నువ్వేమో ఆ అమ్మాయినోసారి కాలేజీకి వెడుతున్నప్పుడల్లరి పెట్టావుట...." అన్నాడు గోకుల్ భయం భయంగా నాగరాజు ముఖ భావాలు చదవడానికి ప్రయత్నిస్తూ.

నాగరాజు సాలోచనగా - "అమ్మాయిల నేడిపించడం నాకు సరదా. అయితే తిరగబడ్డవాళ్ళ అంతు చూస్తాను తప్పితే - వాళ్ళ విషయంలో నేను సీరియస్‌కాదు...." అన్నాడు.

"ఈ అమ్మాయీ తిరగబడలేదు. ఇటీవల నా భార్య నా ప్రతాపం గురించి చెబితే ఆ అమ్మాయందిట - అదేదో డబ్బిచ్చి ఏర్పాటుచేసుకున్న వ్యవహారం తప్పితే ఆ నాగరాజు నెవరూ బెదిరించలేరు. మీ ఆయన నిజంగా అంతటి మగధీరుడైతే ఆ నాగరాజుచేత నాకు క్షమార్పణ చెప్పించమను అందిట...."

"అప్పుడు నీ భార్యేంచేసింది?"

"ఆ సుగుణకు మాటిచ్చి రావడమేకాక రేపు సాయంత్రం అయిదున్నరకు గాంధీ పార్కులో ముహూర్తం కూడా పెట్టింది...."

"అన్నీ తనిష్టమేనా?"

"ఆమె నేనో హీరోననుకుంటోంది...."

"అది భ్రమ అని రేపు తేల్చేస్తాను. ఆ ఆడాళ్ళెదురుగుండా నీ తుప్పు రేగ్గొట్టేస్తాను...." అన్నాడు నాగరాజు.

అప్పుడతడి కళ్ళలోని ఎరుపుచూసి గోకుల్ భయపడ్డాడు. అయినా ధైర్యంతెచ్చుకుని "ఎవరో కొందరాడాళ్ళు భ్రమపడినంత మాత్రాన నువ్వు హీరోవు కాకుండా పోతావా? ఏదో నా కాపురం నిలబెడతావని నిన్ను కోరాను. నీవు నిలబెట్టిన కాపురం నీ చేతులతోనే కూలదోస్తావా?" అన్నాడు.

నాగరాజుకు కోపం తగ్గింది - "సరేలేకానీ - నీ కిదో ఆటగా తయారయింది. ఈసారికి ఖర్చవుతుంది...."

"నువ్వడిగినంతా యిస్తాను...."

"ఎంతడగినా ఇస్తావా?"

"న్యాయమని నీ కనిపించింది-అడుగు—ఇస్తాను...."

"న్యాయం నాకేం తెలుస్తుంది? నీ కెంతన్యాయ మనిపిస్తుందో చెప్పు" అన్నాడు నాగరాజు.

"పదివేలు...."

"ఏమన్నావ్?" అన్నాడు నాగరాజులిక్కిపడి.

"పదివేలిస్తాను. నువ్వు నాకు చేస్తున్న ఉపకారం పదిలక్షల విలువైనపుడు నిజానికీ పదివేలూ ఓ లెక్కకాదు. అయితే ఈ న్యాయం నా శక్తినిబట్టి ఏర్పడినది...."

"పదివేలంటే కాస్త ఎక్కువే!" అన్నాడు నాగరాజు జాలిగా.

"అవును - ఇవ్వడం నాకూ కష్టమే! కానీ నువ్వు జాలిపడి కన్సెషనివ్వకు. ఎందుకంటే ఊరికే నీ సాయమ్నుపయోగించుకోవడం జరిగితే ఇలా మళ్ళీ మళ్ళీ అమ్మాయిల్ని

తీసుకురావడం జరుగుతుంది. పదివేల రేటంటే నేనూ జంకుతాను. ఆ స్తమానూ అంతడబ్బు నేను మాత్రం ఎక్కణ్ణించి తేగలను?"

నాగరాజు ఆలోచనలో పడ్డాడు.

"మిస్టర్ నాగరాజూ! నువ్వు ఖూనీలుచేసీ, మనుషుల్ని చావగొట్టీ డబ్బు సంపాదించుకుంటున్నావు. అవన్నీ ప్రమాదకరమైన పనులు. నేను చెబుతున్నది తేలికైన పని. కాదనకు...." వేడుకుంటూ అన్నాడు గోకుల్.

"నా ప్రిస్టేజి గురించి ఆలోచిస్తున్నాను. కానీ నీ కాపురం నిలబెట్టాలనీవుంది. సరేలే ఈసారి కొప్పుకుంటు న్నాను...." అన్నాడు నాగరాజు.

5

భార్యతో మళ్ళీ అనవసరపు తగాదాలు రావచ్చునని భయపడి గోకుల్ ముందుగానే ఆమెతో. "నిన్నవమా నించిన నాగరాజే సుగుణ అనే అమ్మాయి నవమానించాట్ట. ఆ అమ్మాయికి నాగరాజుచేత క్షమార్పణలు చెప్పించమని వాళ్ళ నాన్న బతిమాలాడు. అందుకు రేపు సాయంత్రం అయిదున్నరకి ముహూర్తం పెట్టాను. గాంధీపార్కు వెన్యూ. నేనక్కడ ఆ అమ్మాయితో ఎందుకున్నానని తర్వాత నన్ను సాధించకుండా ముందే చెబుతున్నాను. కావాలంటే నువ్వూ ఆ సమయాని కక్కడకు రావచ్చు. నేను మాత్రం ఆఫీసునుంచి తిన్నగా పార్కుకే వెడు తున్నాను...." అన్నాడు.

"జరిగిందేదో జరిగిపోయింది — గూండాగాళ్ళతో మనకు గొడవెందుకండీ — వాడు మనమీద పగబడితే కష్టం...." అంది ఉమ.

"అలాగని ఊరుకుంటే ఎలా? చేతిలో శక్తి వున్నవా

దైనా సరే ముందుకొచ్చి ఇలాంటివాళ్ళకు బుద్ధి చెప్పక పోతే ఎలా?"

ఉమ కళ్ళలో గర్వం కనబడింది. భర్తపట్ల ఆరాధనా కనబడింది—"మీరు చాలా గొప్పవారండీ—సాయంత్రం తప్పకుండా పార్కులో మీ ప్రతాపం చూస్తాను—" అంది.

తర్వాత ఈ విషయం గోకుల్ ఆఫీసులో కూడా చెప్పు కున్నాడు.

గోకుల్ నాగరాజుని బెదరగొట్టాడన్న విషయానికి ఆఫీసులో ప్రాముఖ్యత లభించింది. అతడంటే కొందరు స్నేహితులే భయపడుతున్నారు. అయితే లక్ష్మణరావు మాత్రం గోకుల్ డబ్బిచ్చి ఈ ఏర్పాటు చేసుకుని వుండ వచ్చునని అక్కడా యిక్కడా అన్నాడు. గోకుల్‌కి వచ్చిన పేరు చూసి అతడి కసూయగా ఉంది.

ఈరోజు గోకుల్ నాగరాజుతో మళ్ళీ భేటీ పడుతున్నాడనీ— అందులోనూ ఓ అమ్మాయి మానమర్యాదల కోసమనీ— తెలియగానే ఆఫీసంతా అదిరిపోయింది. ఆఫీసులో పనిచేస్తున్న నలుగురు అందమైన యువతులు ఆ రోజంతా గోకుల్ చుట్టూ తిరిగి అతడు నాగరాజు నెలా లొంగదీయా లనుకుంటున్నాడో—పదేపదే ప్రశ్నలడిగి వేధించారు.

చెప్పాలంటే ఆ రోజు సాయంత్రం గాంధీ పార్కుకి తీర్థప్రజలా వచ్చారు. తన కూతురికి జరిగిన అవమానానికి ప్రతీకారం చూడ్డానికి సత్యానందం కూడా భారీగా జనాలను పంపాడు.

అంత జనాన్ని చూడగానే గోకుల్‌కి భయం కూడా వేసింది. ఇంతమంది జనాలముందు నాగరాజు తనకు

లొంగుతాడా అన్న అనుమానమూ కలిగింది.

సరిగ్గా అయిదున్నరయ్యేసరికి పార్కులోకి సుగుణ, నాగరాజు కూడా వచ్చారు. గోకుల్ నాగరాజుతో—"సమాజంలో అసభ్యంగా ప్రవర్తించినవారిని సమాజమే భరించవచ్చు కానీ నేను భరించలేను. ఈ అమ్మాయిపట్ల నువ్వు అమర్యాదగా ప్రవర్తించావు. రెండు చేతులూ జోడించి క్షమార్పణ చెప్పుకో ..." అన్నాడు.

నాగరాజు వెంటనే ఒప్పుకోలేదు. గోకుల్ రెచ్చిపోయి అతడి నామె కాళ్ళమీద పడితేకానీ వదలనన్నాడు. చివరకు నాగరాజలాగే చేసి—"నన్ను బెదిరించ గలుగుతున్నావు కదా అని ఈ ఊళ్ళో ఉన్నవాళ్ళందరికీ నాచేత క్షమార్పణలు చెప్పించాలంటే కుదరదు. ఈసారి కేదో ఊరుకున్నా ఇకమీదట సహించేదిలేదు. ఇదే ఆఖరుసారి...."అన్నాడు.

అది నిజమైన హెచ్చరిక అని గోకుల్ కొక్కడికే తెలుసు. అయినా గంభీరంగా—"నీ పాత తప్పులన్నీ ఈ దెబ్బతో క్షమించేశాను. ఇకమీదట కొత్త తప్పులు చేయకుండా ఉంటే—ఇలాంటి వ్యవహారం నిజంగానే ఇదే ఆఖరుసారవుతుంది—" అన్నాడు.

అతడి డైలాగ్‌కు పార్కులో కొందరు జనం ఈలలు కూడా వేశారు. నాగరాజు తల వంచుకుని అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

తర్వాత అతడు నాగరాజుకు పదివేలూ యిచ్చేశాడు. సత్యానందం దగ్గర్నుంచి పదివేలు సంపాదించుకున్నాడు. ఇంట్లోనూ, ఆఫీసులోనూ హీరో నవిపించుకున్నాడు. అయినా మనసులోని బెదురు మాత్రం పోలేదు.

6

సుగుణకు క్షమార్పణలు చెప్పుకున్నాక సరిగ్గా మూడు

వారాలకు నాగరాజు గోకుల్‌కి ఫోన్‌చేసి —"నీతో అర్జెంటుగా మాట్లాడాలి. మా యింటికి రా —" అన్నాడు.

గోకుల్ భయపడుతూనే నాగరాజింటికి వెళ్ళాడు.

నాగరాజు గంభీరంగా—"అర్జంటుగా నాకు రెండు వేలు కావాలి. డబ్బివ్వనంటే నడిరోడ్డుమీద నాలుగు తన్ని నీ పరువు తీసేస్తాను—" అన్నాడు.

నాగరాజు తనను బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని అర్థం కాగా — "నేను సామాన్యుణ్ణి. నన్నిలా డబ్బడగడం నీకు భావ్యం కాదు...." అన్నాడు గోకుల్.

"డబ్బవసరపడితే ఏం చేయను?"

"సంపాదనకు నీ మార్గాలు నీ కున్నాయిగా...."

"నీలాంటివాడికి లొంగిపోయానని తెలిసేక—నాకొచ్చే బేరాలు తగ్గిపోయాయి. నా కస్టమర్సుకి నామీద నమ్మకం తగ్గిపోయింది. అదీకాక నీ సహవాస ఫలితమో ఏమో— నాలో మార్పు వస్తోంది. నేను మంచివాడిగా మారిపోతున్నాను...."

"నన్ను డబ్బడగడం నీకు మంచి అనిపిస్తోందా?"

నాగరాజు క్షణమాగి—"పోనీ నా కు త్తినే డబ్బివ్వద్దు. నువ్వెవరికంటే వాళ్ళకి నేను క్షమార్పణ చెప్పుకుందుకు సిద్ధంగా వున్నాను. ట్రిప్పుకి రెండువే లిప్పించినా చాలు. కానీ నెల కయిదారు బేరాలైనా కావాలి...." అని— "ఇన్నాళ్ళూ లేని పోని ప్రమాదాల్లో దిగి డబ్బు సంపాదించాను. ఇంత సులభంగా డబ్బు సంపాదించే మార్గముందని నీ మూలంగానే నాకు తెలిసింది...." అన్నాడు.

గోకుల్‌కి ఏం మాట్లాడాలో తెలియులేదు. నాగరాజు సుగుణకు క్షమార్పణ చెప్పుకున్నందుకు పదివేలొచ్చాయి. అతడికా పద్ధతి నచ్చింది. అత డిది రుచి మరిగాడు.

అదృష్టవశాత్తూ తన కింకో పదివేలు కూడా వచ్చాయి. అందులోంచి ఓ రెండువేలు తనిప్పుడు నాగరాజు కిచ్చు కోవచ్చు. కానీ ఇలా ఎన్నాళ్ళు?

తానొకటి తలిస్తే దైవమొకటి తలిచాడు. అయినా నాగ రాజులాంటి వాళ్ళతో చేతులు కలపడం తన బుద్ధి తక్కువ. ఇప్పుడు కొరివితో తల గోక్కున్నట్లైంది. నాగరాజు బాధ నెలా వదిలించుకోవాలో!

"ఏం—మాట్లాడవు?"

"ఈసారికి రెండు వేలూ యిచ్చుకుంటాను. కానీ ఇక మీదట ఇచ్చుకోలేను. క్షమించమనడానికి మనుషుల్ని తీసుకురాలేను—" అన్నాడు గోకుల్.

"నేను నీ పద్ధతికైనా రావాలి. నువ్వు నా పద్ధతికైనా రావాలి. నేను నీ పద్ధతికి రావాలంటే నువ్వు నాకు డబ్బివ్వాలి. నువ్వు నా పద్ధతికొస్తే నేనే నీకు డబ్బిస్తాను కానీ నేను చెప్పిన పనులు చేయాలి. స్మగ్లింగుకు నీలాంటి పెద్దమనుషులవల్ల చాలా ప్రయోజనం" అన్నాడు నాగ రాజు.

"ఆలోచించుకుందుకు గడువు కావాలి—" అని దిగు లుగా ఇంటికి వెళ్ళాడు గోకుల్.

అతడిని చూస్తూ భయం భయంగా—"మా ఊళ్ళో ఉద్యోగం గురించి నాన్నగారు మళ్ళీ ఉత్తరం రాశా రండీ—" అంది ఉమ.

గోకుల్ మామగారికి ఒక్కగా నొక్క కూతురు కావడంవల్ల ఆయన అల్లుణ్ణి తన ఊరిలోనే ఉంచుకునేం దుకు ప్రయత్నాలు చేస్తున్నాడు. మామగారితో ఉండడం తనకు చిన్నతనమని గోకుల్ భావిస్తున్నాడు. అందువల్ల ఆ విషయం వింటేనే మండిపడుతూంటాడు. కానీ ఈరో

ఐతడీ వార్త వినగానే భార్యను రెండు చేతులతో గాలిలోకి ఎత్తి—"ఎంత మంచి వార్త చెప్పావు ఉమా!" అన్నాడు.

ఉమ ఆశ్చర్యంగా— "మీరు కోప్పడతా రనుకున్నాను. అందులోనూ ఈమధ్య పెద్ద హీరో కూడా అయిపో యారు...." అంది.

గోకుల్ ఆమెను క్రిందకు దింపి—"అదే....అదే నన్ని ఊర్నించి పారిపొమ్మంటోంది—" అనుకున్నాడు మనసులో.

వారం రోజుల తర్వాత అతడు నాగరాజుకు రెండు వేలూ ఇచ్చుకున్నాడు. మరో వారం రోజుల్లో అత డూరు మారిపోయాడు.

మళ్ళీ ఎప్పుడూ హీరోయిజం చూపించాలని అత డనుకోలేదు. భార్యతో అన్యోన్యంగా ఉండడంవల్ల—ఆ అవసరమూ అతడికి రాలేదు. □

రాని రాయబారం

స్వరూప్

కాలేజీ కుర్రాళ్ళు.... స్కూటర్ల మీద. సైకిళ్ళమీద 'సైట్' కొడుతూ కామెంట్స్ చేస్తున్నారు.

అది గర్వంగా భావించినా.... చిరుకోపాన్ని కళ్ళతోనే అభినయిస్తున్నారు కొందరు అమ్మాయిలు.

రిస్ట్‌వాచీ వైపు చూసింది ప్రఫుల్ల.

నాలుగూపది.

"కాలేజీ వదిలేసరికి కారుతో సిద్ధంగా వుండే డ్రైవర్ సిద్దప్పగాడికి ఈ రోజు ఏమైందో" విసుక్కుంటూ ఎదురు చూస్తోంది ప్రఫుల్ల.

ప్రముఖ పారిశ్రామికవేత్తల్లో ఒకరైన ఆదినారాయణ గారి ఏకైక సంతానం ప్రఫుల్ల. స్టెల్లా కాలేజీలో ఫైనల్ బి.కాం. చదువుతోన్న ప్రఫుల్ల వయసు ఇరవై. ఇటీవల విజయవాడలోని ఓ వారపత్రిక నిర్వహించిన అందాల పోటీల్లో 'మిస్ నైన్‌టీన్ ఎయిటీఫైవ్'గా అత్యధిక మెజారిటీతో ఎన్నిక కాబడిన అందాలరాసి ప్రఫుల్ల.

విసుక్కుంటూ ఎదురుచూస్తున్న ప్రఫుల్ల ముందు వేగంగా వచ్చి ఆగిందో నల్లరంగు ఎంబాసిడర్ కారు.

వెనకడోర్ తెరచుకుని ఆదుర్దాగా దిగాడో వ్యక్తి.

రోజ్ కలర్ ప్యాంట్‌లోకి క్రీం కలర్ షర్ట్ టక్ చేసుకుని, కూలింగ్ స్పెట్స్‌తో నిలబడ్డ అతని ముఖంలో ఆందోళన కొట్టొచ్చినట్లు కనబడుతోంది.

"మిస్ ప్రఫుల్లా! నేను మీ కంపెనీలో క్యాషియర్ని. మీ కారుకు ఏక్సిడెంట్ అయింది. సిద్దప్ప స్పాట్‌లోనే పోయాడు. మీ నాన్నగారి కండిషన్ చాలా సీరియస్‌గా వుంది మిమ్మల్నే కలవరిస్తుంటే మీ కోసం వచ్చాను. మీరు నాన్నగారితో అప్పుడప్పుడూ కంపెనీకి వస్తుండటంతో మిమ్మల్ని తేలిగ్గా గుర్తించగలిగాను. దయచేసి

త్వరగా రండి" కంగారుగా అన్నాడావ్యక్తి డోర్ తెరచి పట్టుకుని.

ఆ షాకింగ్ న్యూస్‌కు తట్టుకోలేనట్లు నిర్జీవ ప్రతిమలా నడచి బ్యాక్‌సీట్‌లో కూర్చుంది ప్రఫుల్ల. ఆమె మనస్సులో తనని లాలించే తండ్రిరూపం మెదలగానే కళ్ళనిండా నీరు నిండుకుంది. "దేవుడా! డాడీని ప్రాణాపాయం నుండి తప్పించు ప్లీజ్....!" బాధగా కళ్ళుమూసుకుంది.

కూలింగ్ స్పెట్స్ వ్యక్తి బ్యాక్‌సీట్‌లో కూర్చుని డోర్‌లాక్‌చేసి—"పోనీయ్" అన్నాడు కరకుగా డ్రైవింగ్ సీట్‌లోనున్న వ్యక్తితో.

ఆ వ్యక్తి కంఠంలో వచ్చిన మార్పుకు అనుమానంతో తలిపైకెత్తింది ప్రఫుల్ల.

అప్పటికే ఆలస్యమైపోయింది.

ముఖంమీద చిరుజల్లులా స్ప్రే చేయబడ్డ మత్తుమందు ప్రభావానికి మెదడు మొద్దుబారుతుండగా... కళ్ళు భారంగా మూతలు పడుతుండగా తలవాల్చేసింది ప్రఫుల్ల.

అంబాసిడర్‌కారు వేగంగా మొగల్‌రాజపురం కొండల వైపు దూసుకుపోసాగింది.

2

"అమ్మాయి నాలుగ్గంటలకల్లా కాలేజీనుండి బయటికి వస్తుందని తెలుసుకదరా ఇడియట్! ఆలస్యంగా ఎందుకు వెళ్లావ్?" ఆవేశంతో చిందులు వేయసాగారు ఆదినారాయణ గారు.

"టైరులో గాలి తగ్గితే....కొట్టించుకుని వెళ్ళేసరికి పావుగంట ఆలస్యమైందిసార్. అమ్మాయిగారు కన్పించ లేదు." వణికిపోతూ చేతులు కట్టుకుని చెప్పాడు సిద్దప్ప.

"ఏడవలేకపోయావ్?" అంటూ టెలిఫోన్ ముందు

కూర్చుని కూతురు స్నేహితుల ఇళ్ళకు ఫోన్ చేయసాగారు.

ప్రతి ఒక్కరూ తెలియదనే సమాధానం ఇవ్వటంతో విసుగ్గా ఫోన్ పెట్టేసి తలపట్టుకు కూర్చున్నారు ఆదినారాయణగారు.

"అమ్మాయిగారు ఎక్కడికెళ్ళారో తెలిసిందా సార్?" ఆదుర్దాగా అడిగాడు సిద్దప్ప.

సమాధానం చెప్పలేదు ఆదినారాయణగారు. ఆయన గుండెల్లోంచి శోకం తన్నుకురావటానికి సిద్ధంగా వుంది. తల్లిలేనిదని గారాబంగా పెంచారాయన. ఒక్కక్షణం కూతురు కళ్ళముందు కన్పించకపోతే విలవిల్లాడిపోతారాయన. అలాంటిది ఆరుదాటుతోన్నా కూతురు ఇంటికి చేరకపోయేసరికి ఆయన మనసెందుకో కీడునెంచసాగింది.

ఆందోళన చెందుతున్న ఆదినారాయణగారు ఫోన్ మ్రోగుతుంటే.... కూతురుగానీ చేస్తుందేమోనని హడావుడిగా రిసీవరెత్తి "హలో ఆదినారాయణ స్పీకింగ్" అన్నారు.

"కూతురికోసం కంగారు పడుతున్నావా ఆదినారాయణా?" కటువుగా వినిపించిందో కంఠం అటునుండి.

"ఎవర్నువ్?" కనుబొమలు ముడేసి కోపంగా ప్రశ్నించారు ఆదినారాయణగారు.

"మీ అమ్మాయిని మా ఆధీనంలో వుంచిన కిడ్నాపర్ని"

"ఎంత కావాలి నీకు"

"పదిలక్షలు"

"యూ ఇడియట్!.... ఎంత తేలిగ్గా అడిగావురా!.... పదిలక్షలంటే పది - పైసలనుకున్నావట్రా బాస్టర్డ్?...." విపరీతమైన ఆగ్రహంతో అరిచారు ఆదినారాయణగారు.

"అమర్యాదకరమైన పదజాలం ప్రయోగిస్తున్నావు ఆది

నారాయణా! నాలో క్షమాగుణం అతి తక్కువ శాంతం. నీ కూతురు నా బందీగా వుందన్న విషయం గుర్తుంచుకుని గౌరవంగా మాట్లాడు" హెచ్చరించాడు ఆ వ్యక్తి.

"నా దగ్గర అంత డబ్బులేదు. రెండు లక్షలిస్తాను. నా కూతుర్ని విడిచిపెట్టు" ఆవేశం వదలి అర్థింపుగా అడిగారు ఆదినారాయణగారు.

"కొత్త ప్లాంట్ ఎక్స్‌టెన్షన్ కోసం శాంక్షన్ కాబడ్డ డబ్బు ఈ రోజే బ్యాంక్‌లో వేశావు. మర్చిపోయావా ఆదినారాయణా!.... ఓ నిముషం నేను చెప్పేది జాగ్రత్తగా విను. రేపుదయం పదిగంటలకు బ్యాంక్‌లో క్యాష్ తీసుకుని టాక్సీలో మధూగార్డెన్స్ వరకూ రా. అక్కడ టాక్సీ దిగి క్యాష్‌బ్యాగ్‌తో కాలినడకన జమ్మిచెట్టు వరకూ రా! జమ్మిచెట్టు చప్టామీద ప్లాస్టిక్ ఫ్లవర్‌వాజ్‌తో ఓ వ్యక్తి కూర్చుని పిటీబస్ కోసం ఎదురుచూస్తున్నట్లు వుంటాడు. క్యాష్ బ్యాగ్ అతని చేతికిస్తే....ఫ్లవర్‌వాజ్ నీ చేతికిస్తాడు. అందులో నీ కూతురు ఎక్కడవుందీ తెలియపరిచే కాగితం వుంటుంది.

నువ్వు పోలీసులకు ఇన్ఫర్మేషన్ ఇచ్చినా....మమ్మల్ని మోసం చేయాలని ప్రయత్నించినా అందాలరాశి అయిన నీ కూతురు చిత్రహింసల పాలవుతుంది. నాకు క్షమాగుణం చాలా తక్కువని గుర్తుంచుకో" కరకుగా హెచ్చరించాడు ఫోన్లోని వ్యక్తి.

"ప్లీజ్! నా కూతుర్నేం చేయకు. నువ్వు కోరినట్లే పదిలక్షలూ ఇస్తాను"

అవతల ఫోన్ పెట్టేయటంతో ఆదినారాయణగారు కూడా ఫోన్ పెట్టేశారు.

ఓ అర్ధగంట తీవ్రంగా ఆలోచించారాయన. చివరకు

ఓ నిర్ణయానికి వచ్చినట్లు పైకిలేచి లోపలిగదిలోకి నడచి లాంగ్‌కోట్. పెల్ట్‌హ్యాట్ తగిలించుకుని బిల్డింగ్ వెనక వైపు ద్వారంగుండా రోడ్డుమీదకు వచ్చి, చిన్న చిన్న సందుల్లోనుండి నడచి.... మెయిన్‌రోడ్డుమీదకు చేరుకుని వస్తున్న టాక్సీని ఆపి "టూ టవున్ పోలీస్‌స్టేషన్" అని చెప్పారు లోపల కూర్చుంటూ.

3

భారంగా కళ్ళుతెరచిన ప్రపుల్లకు వెలుగుతోన్న ట్యూబ్ లైట్ కనిపించింది.

ఒక్కక్షణం జరిగిన సంఘటన గుర్తురావటంతో ఉలిక్కిపడి పైకిలేచి పరిశీలనగా గది అంతా తిలకించింది.

డబుల్‌కాట్ బెడ్‌మీదుంది తను. ఆ గది అంతా అధునాతనంగా అమర్చబడి వుంది. డబుల్‌కాట్ ప్రక్కనే గ్లాస్ డోర్స్ అమర్చబడిన కిటికీవుంది. గదిలో ఓ ప్రక్క పెద్ద టేబుల్ వుండి దానిమీద విడియో సెట్‌వుంది. ప్రక్కనే నేషనల్ పానసోనిక్ త్రీ ఇన్‌వన్ టేప్‌రికార్డర్, క్యాసెట్స్ విడియో క్యాసెట్స్ వున్నాయి. గదికి మరోప్రక్క కేన్ ఛెయిర్స్ టీపాయ్ సెట్‌వుంది. టీపాయ్‌మీద రకరకాల ప్యారిన్‌మ్యాగ్‌జైన్స్, తన కాలేజీ బుక్స్, వ్యానిటీ బ్యాగ్ వున్నాయి.

వ్యానిటీబ్యాగ్ కనిపించటంతో గబగబా వెళ్ళి బ్యాగ్ తెరచి చూసింది. తన ఫౌంటెన్‌పెన్, వందరూపాయల చిల్లర అలాగే వుంది.

"ఏమాశించి వీళ్ళు తనని బంధించినట్లు?" అనుకుంది.

తను బందీగా వున్నానన్న ఊహ రావటంతో భయపడింది ప్రపుల్ల.

అదీ ఒక్కనిముషం మాత్రమే.

అందరి ఆడపిల్లల్లా పిరికి మనసున్నదికాదు ప్రపుల్ల. అందానికి సరిపడ సాహసమున్న ఆడపిల్ల ఆమె.

వెంటనే తనకి తాను ధైర్యం చెప్పుకుంది. "భయపడి చేసేదేముంది. బయటపడేమార్గం ఆలోచించాలి ముందు" అనుకుంటూ విండోగ్లాస్ డోర్స్ తెరచి చూపింది.

చీకటితప్ప మరేం కన్పించకపోవటంతో రిస్టువాచీ వైపు చూసింది.

ఏడూ పన్నెండు అయింది టైము. దాదాపు మూడు గంటలపాటు తను స్పృహ కోల్పోయినట్లు గ్రహించింది.

డబుల్ కాట్ ప్రక్కనేవున్న డోర్ తెరచి చూసింది. ఎటాచ్డ్ బాత్‌రూమ్ అండ్ లేవెట్రి. ఓ ప్లాస్టిక్ బకెట్, మగ్ పంపుక్రింద వున్నాయి.

పంపు త్రిప్పిచూసింది. ధారగా పడ్డాయి నీళ్ళు. పంపు కట్టేసి తల పైకెత్తి చూసింది షవర్‌కుపైన చిన్న వెంటిలేటర్ వుంది.

బయటకొచ్చి తలుపేసి, మరో తలుపున్నవైపు నడిచింది.

తలుపుదగ్గరకు చేరుకోకముందే ఆ తలుపు త్రోసుకుని లోపలకొచ్చారు ఇద్దరు ఆగంతకులు.

పరీక్షగా వాళ్ళవైపు చూసింది ప్రపుల్ల.

మొదటివాడికి నలభై అయిదేళ్ళుంటాయి. చింతమొద్దు లాంటి శరీరం. నెత్తురుముద్దలాంటి కళ్ళు. గుబురుగా పెరిగిన కనుబొమలు, మాడినట్లున్న పెదాలు, పిల్కులాల్చి, పైజమాతో గూండాల ప్రతినిధిలా వున్న అతని చేతిలో ఏపిల్స్, అరటి, ద్రాక్షపండ్లున్నాయి.

రెండోవాడికి ఇరవైమూడేళ్ళుంటాయి. హిప్పీక్రాపు, తేనెరంగు కళ్ళు, నల్లప్యాంట్ మీద రెడ్ స్ట్రైప్స్ పుల్

హాండ్స్ షర్టు లూజ్‌గా టక్‌చేశాడు. అతని మెళ్లోని చెయిన్‌కు వైట్ మెటల్‌తో తయారుచేసిన రాక్షసుడిలాంటి తలకాయవుండి ట్యూబ్‌లైట్ కాంతికి మెరుస్తోందది. అతని చేతిలో హోటల్‌నుండి తీసుకురాబడ్డ టిఫిన్‌పార్సిల్స్, భుజానికి వ్రేలాడుతూ ఫ్లాస్కు కన్పించాయి ప్రఫుల్లకు.

మనసులోనే వాళ్ళిద్దరికీ 'చింతమొద్దు, హిప్పీక్రాపు' అని నామధేయాలు నిర్ణయించుకుంది ప్రఫుల్ల.

"ఓఁ....నీకు తెలివొచ్చిందన్నమాట." నవ్వుతూ టీపాయ్‌మీదున్న పుస్తకాలను కాలితో క్రిందకు నెట్టి, చేతిలోని పండ్లు టీపాయ్‌మీద వుంచాడు చింతమొద్దు.

హిప్పీ క్రాపువాడు మోచేత్తో డోరుమూసి, ప్రఫుల్ల ప్రక్కనుండి రాసుకుంటూ నడిచి, టిఫిన్ పార్సిళ్ళనీ, ఫ్లాస్కునీ టీపాయ్‌మీదుంచాడు

హిప్పీ క్రాపువాడి ప్రవర్తనకు అసహ్యం పుట్టినా అణుచుకుంది ప్రఫుల్ల.

"ఎవరు మీరు....? నన్నెందుకిక్కడికి తీసుకొచ్చారు?" ఏ మాత్రం ఆవేశం తెచ్చుకోకుండా ప్రశాంతంగా, మెల్లగా ప్రశ్నించింది ప్రఫుల్ల.

ఆమె ధైర్యానికి విస్తుబోయి చూశారు ఆగంతుకు లిద్దరూ.

"ఇక్కడకు తీసుకొచ్చిన ప్రతీ ఆడపిల్లా శోకాలు తీస్తూ, శాపనార్థాలు పెట్టటం చూశానుగానీ....ఇంత తాపీగా అడిగినదాన్ని నిన్నే చూస్తున్నానమ్మాయ్!....తప్పించుకో గలనన్న ధీమాతో వున్నావేమో-నీ ప్రయత్నాలు ఫలించవని చెప్పటానికి జాలిపడుతున్నాను. ఇక్కడనుండి ఎంత గట్టిగా అరచినా నీ అరుపులు ఈ కొండల్లో ప్రతిధ్వనిస్తా యేగానీ....నిన్ను రక్షించటానికి ఎంతమాత్రం అనుకూల

పదవు. ఇక నీ వడిగిన ప్రశ్నలకు సమాధానాలు__

మమ్మల్ని కిడ్నాపర్స్ అంటారు. నిన్ను మీ నాన్నకు అందజేయటానికి పదిలక్షలకు బేరం సెటిల్ చేశాం. రేపు మధ్యాహ్నం పదకొండు గంటలకల్లా మీ నాన్న మా చేతికి పదిలక్షలూ అందజేశాడా సరే—లేకపోతే రాక్షసులుగా మారాల్సివస్తుంది. అంతవరకూ నువు బందీగా వున్నా మాకు అతిథివి. నీ కీ గదిలో అన్ని సౌకర్యాలూ ఏర్పాటు చేసివున్నాయి. ఫ్లాస్కులో పాలున్నాయి. రాత్రికి ఆహారంగా ఈ పండ్లూ, ఫలహారాలు. మా చేతికి పదిలక్షలూ చేరినపుడు నీకీ చెరనుండి విముక్తి. మీ నాన్న మమ్మల్ని చెరసాల పాల్జేయాలని పథకం పన్నితే నిన్ను దారుణంగా చెరచి, అరబ్బుదేశాలకు అమ్ముకోవలసి వస్తుంది వస్తాం. గుడ్‌నైట్" అంటూ ముందుకు కదిలాడు చింత మొద్దు.

వెళుతూ, వెళుతూ మరలా ప్రపుల్లని రాసుకోడానికి ప్రయత్నించాడు హిప్పీక్రాపు.

వాడి ప్రయత్నాన్ని గ్రహించి ప్రక్కకు తప్పుకుంది ప్రపుల్ల.

డోర్‌వరకూ నడచి, ఆకలిగా కొరుక్కుతినేట్లు చూసి డోర్ మూసుకున్నాడు హిప్పీక్రాపు.

వాడి ప్రవర్తనకు వంటిమీద పాములు ప్రాకుతున్నట్లు ఫీలయింది ప్రపుల్ల!

వళ్ళంతా చిరాగ్గా వుండటంతో బాత్‌రూమ్‌లోకి నడిచింది. స్నానం చేయాలని అనుకుంది గానీ....ఎవరో, ఎక్కడ్నుండో తనని పట్టి పట్టి చూస్తున్నట్లు భావన కల్గటంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకుని, ముఖం కడుక్కుని వచ్చేసింది.

ఖాళీగా వుండేసరికి రకరకాల ఆలోచనల్తో మనసు

బలహీనపడుతుండటంతో వెళ్ళి విడియో ఆన్‌చేసింది.

ఓ స్త్రీని ముగ్గురు ఆంబోతుల్లాంటి వ్యక్తులు దారుణంగా రేప్‌చేస్తున్న దృశ్యం స్క్రీన్‌మీద ప్రత్యక్షమయేసరికి ముఖం ఎర్రగా కందిపోయింది. టక్కున విడియో ఆఫ్‌చేసి వచ్చి మంచంమీద కూర్చుంది.

ఒకవేళ డాడీ పదిలక్షలూ ఇవ్వకుండా వీళ్ళని పోలీసులకు పట్టించాలని నిర్ణయించుకుంటే.... వీళ్ళది గ్రహిస్తే.... తన బ్రతుక్కూడా ఆ స్త్రీలాగే శిక్షపడుతుందా?....

ఆ ఊహ రావటంతో వణికిపోయింది ప్రపుల్ల. మరలా పిరికి ఆలోచనల్తో మనసు బలహీనపడుతోందని గ్రహించిన ప్రపుల్ల క్లాసు పుస్తకాలు తెరచి ఆ రోజు లెసన్స్ తిరగేయసాగింది.

అలా చదువుతూనే నిద్రలోకి జారిపోయింది.

4

పోలీస్ స్టేషన్‌ముందు టాక్సీదిగి, ఫెల్ట్‌హ్యాట్ చేత్తో పట్టుకుని లోపలకొస్తున్న ఆదినారాయణగార్ని చూడటంతోనే గౌరవంగా లేచి నిలబడి విష్ చేశాడు ఇన్‌స్పెక్టర్ అమర్‌నాథ్.

ఓ కానిస్టేబుల్ని పిలిచి రెండు కూల్‌డ్రింక్స్ తెమ్మని చెప్పాడు.

"నేను తాపీగా కూల్‌డ్రింక్స్ త్రాగుతూ నీతో బాతాఖానీ కొట్టటానిక్కాదు రాలేదు ఇన్స్‌పెక్టర్!.... నా కూతుర్ని కిడ్నాపర్స్ ఎత్తుకుపోయారు. ఆ విషయం తేల్చుకుందామని వచ్చాను" సీరియస్‌గా అన్నారు ఆదినారాయణగారు.

ఆయన మాటలకు ఉలిక్కిపడ్డాడు అమర్‌నాథ్.

"వివరాలు చెప్పండి" అన్నాడు ఆసక్తిగా.

జరిగింది చెప్పారు ఆదినారాయణగారు.

"మీ ధైర్యానికి అభినందించకుండా వుండలేకపోతున్నాను సార్!....ఈ మధ్య కిడ్నాపర్స్ విజృంభించినట్లు మాకు మెసేజస్ వస్తున్నాయి. కిడ్నాపర్స్ కోరినట్లు డబ్బిచ్చి వాళ్ళ పిల్లల్ని విడిపించుకుంటున్నారేగానీ.... మాతో సంప్రదించి, మా సహాయం పొందాలని ఎవరూ ఆలోచించటం లేదు. అందువల్లనే కిడ్నాపర్స్ మరింత మితిమీరి పోతున్నారు" చెప్పాడు అమర్‌నాథ్.

"నాకు డబ్బుకన్నా నా కూతురి మానప్రాణాలు ముఖ్యం ఇన్‌స్పెక్టర్. పోలీసులకు ఇన్ఫర్మేషనిస్తే నా కూతుర్ని చిత్రహింసలు పెడతారని తెలుసుండీ మీ దగ్గరకు వచ్చానంటే....వాళ్ళని పట్టుకోవటంలో పొరపాటు జరిగితే నా కూతుర్ని నష్టపోతాను. వాళ్ళని పట్టుకోగలిగితే నాలాగా మరే తండ్రీ ఇలా బాధపడాల్సిన దుస్థితి వుండదన్న ఉద్దేశ్యంతో మీ దగ్గరకు వచ్చాను. ఇప్పుడు నా కూతుర్ని రక్షించవలసిన బాధ్యత మీ మీదుంది. నా చిట్టితల్లికి ఏ అపాయం జరిగినా మీ డిపార్టుమెంట్ పరువు ప్రతిష్టలు పునాదులతో లేపుతాను"

"ఆవేశపడకండి ఆదినారాయణగారూ! మా శాయశక్తులా మీ కూతుర్ని రక్షించటానికి ప్రయత్నిస్తాం. మీ సహకారానికి మరోసారి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. మీరు తిరిగి ఇంటికి వెళ్ళేటపుడు కూడా ఎవరి కంటా పడకుండా వెళ్ళిపోండి. రేపు వాళ్ళు చెప్పినట్లు బ్యాంకుకు వెళ్ళి డబ్బుతీసుకుని జమ్మిచెట్టు దగ్గరకు వెళ్ళండి. వాళ్ళని బంధించే ఏర్పాట్లు చేస్తాం" అన్నాడు అమర్‌నాథ్.

5

గుండెలమీద ఎవరో చేయివేసినట్లనిపించటంతో ఉలిక్కి పడి పైకి లేచింది ప్రఫుల్ల.

గుండెలమీదున్న ఆకారం దబ్బుమన్న శబ్దంతో బెడ్ క్రింద పడింది.

చీకటిగావున్న ఆ గదిలో గోళాల్లాంటి రెండుకళ్ళు తననే పట్టి పట్టి చూడటంతో భయంవల్ల వళ్ళంతా చెమటలు పట్టాయి ప్రఫుల్లకు.

పుస్తకం చదువుతూనే నిద్రపోయింది తను. మరి గదిలో లైటార్పింది ఎవరు? మంచం ప్రక్కనవున్న ఆకారం ఎవరు?.... మెల్లగా బెడ్ చివరవరకూ పాక్కుంటూ జరిగి.... గోడ తడిమి స్విచ్ నొక్కింది.

గది అంతా కాంతి అలుముకుంది.

తననంతగా భయపెట్టిన ఆకారం ఓ పిల్లిపిల్లదని తెలియటంతో ప్రఫుల్ల పెదాలమీదకు చిర్నవ్వు చేరింది.

తెల్లగా.... అమాయకంగా వున్న ఆ పిల్లిపిల్ల ప్రఫుల్ల పాదాల మధ్య తల దాచుకుంటూ 'మ్యావ్....మ్యావ్' మంటూ అరవసాగింది.

దాన్ని రెండు చేతులతో పుచ్చుకుని పైకిలేపింది ప్రఫుల్ల.

అమాయకమైన చూపులతో కన్పిస్తున్న దాన్ని గుండెల కదుముకుని ముద్దులు పెట్టింది.

పెంపుడు పిల్లులు, ఆకలితో అలమటించే పిల్లులూ మనుషుల్ని చూసి బెదరవనీ.... ఆహారం కోసం అర్థిస్తాయని ఎవరో చెప్పినవిషయం గుర్తుకు రావటంతో.... గబగబా బాత్‌రూమ్ తలుపుతెరచి, బకెట్‌లోని మగ్ తీసుకొచ్చి, ఫ్లాస్కులోని పాలు మగ్‌లోపోసి పిల్లిపిల్లముందు పెట్టింది ప్రఫుల్ల.

అది ఆబగా పాలు త్రాగుతుంటే దాన్నే చూస్తూ కూర్చుంది.

మగ్‌లో పాలు పూర్తికావటంతో ప్రపుల్లవైపు చూస్తూ మరలా 'మ్యావ్' మంటూ అరచింది పిల్లిపిల్ల.

"పిచ్చిముండ ఎంత ఆకలిమీదున్నావే!" అనుకుంటూ ఫ్లాస్కులో మిగిలిన పాలుకూడా పోసేసింది ప్రపుల్ల.

కొంత పాలుత్రాగి....మిగిలిన పాలు వదిలేసి; మెల్లగా ప్రపుల్ల వడిలోకి చేరింది పిల్లి.

"సీ బడాయిముండా! ఎంత దర్జాగా పడుకున్నావే" అంది ఒడిలోని పిల్లిని ఆప్యాయంగా నిమురుతూ.

దానిమెడ నిమురుతుంటే ప్రపుల్ల మెదడులో తళుక్కున ఓ ఆలోచన మెరసింది. ఒకప్పుడు సందేశాలు పంపటానికి పావురాల్ని ఉపయోగించేవారట. ఈ పిల్లిద్వారా నేను బందీగావున్న విషయం....చింతమొద్దు, హిప్పీక్రాప్ గాడి విషయం వివరంగా వ్రాసి పంపిస్తే....అనుకుంది.

ఈ పిల్లి ఎవరింటిలో వుంటుందో ఏమో! చింతమొద్దు గాడు చుట్టుపట్ల ఇళ్ళులేవని చెప్పాడు. అది నిజంకాదా? ఒకవేళ ఈ పిల్లి చింతమొద్దుగాడిదే అయితే....

నో....అలా కావటానికి ఎంతమాత్రం వీలులేదు. పెంపుడు పిల్లికి పాలుపోయటం మరిచిపోతే వాడి వెనకే పడివుంటుంది. ఇంత ఆకలితో ఇటెందుకొస్తుంది?

సో....వాడిది కాదు. మరెవరు దీన్ని పెంచుతున్నా, పెంచకపోయినా తన ప్లాను అమల్లోపెట్టొచ్చు. తన అదృష్టం బావుంటే బయట పడుతుంది. లేకుంటే ఎలా జరగాల్సి వుంటే అలా జరుగుతుంది. అనుకుంటూ....నోట్‌బుక్‌లో పేపరుచించి, తను ఎలా బందీకాబడిందీ లోపలున్న చింత మొద్దు, హిప్పీక్రాప్‌ల ఆకారాలు వర్ణిస్తూ తనని రక్షించ

మని ప్రాధేయపడుతూ వ్రాసింది. ఆ కాగితాన్ని మడత లుగా చుట్టి. టిఫిన్ పార్సిల్‌కున్న దారాన్ని తీసి కాగితాన్ని పిల్లిపిల్ల మెడలో కట్టింది.

మెడకేదో చుట్టుకున్నట్లుండటంతో కాళ్ళతో దాన్ని ఊడలాక్కోవటానికి ప్రయత్నిస్తూ కొంతసేపు సర్కస్ ఫీట్లు చేసింది పిల్లి. కానీ—దానికి సాధ్యంగాక....ఆ ప్రయత్నాన్ని విడిచిపెట్టి మరలా ప్రపుల్ల వడిలోకి రాబో యింది.

"ముందు బయటకుపోయి ఎవరినైనా తీసుకొచ్చి నన్ను రక్షించవే తల్లీ!...." అంటూ కిటికీవైపు నెట్టింది.

అది బయటకుపోకుండా మరలా తన దగ్గరకే రాబో యింది. రెండు చేతులతో కిటికీనుండి బయటకు విసిరేసింది. నిముషం కూడా గడవకముందే 'మ్యావ్' మంటూ లోపల కొచ్చేసింది.

ఇక లాభంలేదని....నోట్‌బుక్ అందుకుని దాని నెత్తి మీద చిన్నగా మోదింది. యజమానికి కోపం వచ్చిందని గ్రహించి, ఒక్క ఉదుటున కిటికీ బయటకు దూకి చీకట్లో కలిసిపోయింది పిల్లిపిల్ల.

కిటికీ తలుపులు మూసి లైటార్పి పడుకుంది.

నిద్రపట్టకపోవటంతో తెల్లార్లూ జాగారం చేస్తూనే గడి పింది.

6

భార్య కృష్ణవేణితో ఆటో దిగాడు హర్నాద్—

హర్నాద్‌కి మూడ్నెల్ల క్రిందటే వివాహమైంది. వివాహ మైన వెంటనే మూఢం, ఆషాడమాసం అంటూ పెద్దవాళ్ళు సెంటిమెంట్స్ అడ్డుపెట్టడంతో భార్యను కాపురానికి తీసుకు రావడం అదే ప్రథమం.

గేటు తీసుకుని గుమ్మంలో అడుగు పెట్టటంతోనే కాళ్ళకు చుట్టుకుపోయింది పెంపుడు పిల్లిపిల్ల రూనీ—

"థ్యాంక్ గాడ్—ఏ కుక్కో దీన్ని పొట్టన పెట్టుకుంటుందని విపరీతంగా భయపడ్డాను" అంటూ రూనీని పైకెత్తి భార్యవైపు తిరిగి "దిసీజ్ మై బెస్ట్ ఫ్రెండ్ రూనీ" అంటూ నవ్వాడు.

"హలో.... నైస్ టూ మీట్ యూ...."అంది కృష్ణవేణి చేయి ముందుకు చాపి నవ్వుతూ.

"మ్యావ్" అంటూ కృష్ణవేణి చేతిలోకి చేరింది రూనీ.

తలుపుతీపి లోపలకు వెళ్ళి లైటు వేశాడు హర్నాద్.

"మీ రూనీ తప్పిపోతుందనా మెడలో కాగితం కట్టారు?" అడిగింది కృష్ణవేణి.

"రూనీ మెడలో కాగితమా! నేనేం కట్టలేదే" ఆశ్చర్యంగా అన్నాడు హర్నాద్.

"మరి యిది యెవరు కట్టారు?" దారం త్రెంపి కాగితాన్ని హర్నాద్ చేతికందించింది.

కాగితంలోని వివరాలు చదవగానే హర్నాద్ కనుబొమలు ముడిపడ్డాయి.

"కృష్ణా! ఈ పరిసర ప్రాంతాల్లో యెవరో యిద్దరు దుండగులు ఓ ఆడపిల్లను బంధించి వుంచారు. ఆ పిల్ల తెలివిగలదిలా వుంది. ఆకలితో వున్న రూనీకి పాలుపోసి, మనకు సందేశం పంపింది. ఇది చదువు" అంటూ కాగితాన్ని భార్య చేతికి అందించాడు హర్నాద్.

చదవటం పూర్తికాగానే భయంగా అడిగింది కృష్ణవేణి.

"ఇప్పుడేం చేద్దామండి?"

"అదే ఆలోచిస్తున్నా. ఈ కొండ చుట్టుప్రక్కల అనేకమైన యిళ్ళున్నాయి. ఆ అమ్మాయి వర్ణించిన పోలికలున్న

యిల్లువి నేనింతవరకూ చూడలేదు. అసలు ఈ లెటర్లోవి విషయం నిజమా....లేక సరదాగా ఎవరైనా రాసి మన రూనీ మెడలో కట్టారా అన్నది ముందు తేల్చుకోవలసిన విషయం. ఇందులో ఆ అమ్మాయి తండ్రి పేరు వ్రాసింది గానీ....ఆయన ఆఫీసు అడ్రసు, లేక ఫోన్ నంబర్ని లాంటివి యిచ్చినట్లయితే బావుండేది" అన్నాడు హర్నాద్.

"తెలివిగలవాళ్ళు కూడా తప్పటడుగులు వేస్తుంటారు. ఓ థ్రిల్లింగ్ విషయం చెప్పటానిక్కి కలిగిన ఎగ్జయిట్మెంట్ వల్ల....ఎలా మొదలుపెట్టాలో, ఎక్కడ్నుండి ప్రారంభించాలో తెలియక....చివరికా విషయం సారహీనమైన స్థితిలో బయటపడుతుంది. అది సహజం ఆ అమ్మాయికి మన రూనీ ద్వారా సందేశం పంపాలన్న ఆలోచన రావటంతో.. ఆ రాక్షసుల నుంచి బయటపడాలన్న ఒకే ఒక్క ఆలోచన వల్ల వివరంగా వ్రాయలేకపోయివుంటుంది. ఎందుకైనా మంచిది పోలీస్ స్టేషన్కు వెళ్ళి రిపోర్టివ్వండి" ఆతృతగా అంది కృష్ణవేణి.

"వాళ్ళొచ్చినా చేసేదేమీ వుండదు పైపెచ్చు అనుమానం మీద మనల్నే అరెస్టు చేసే డిపార్టుమెంటది మనకు చేతనైతే రక్షిద్దాం. అవసరమనుకుంటే అప్పుడు పోలీసుల్ని అర్థిద్దాం. ముందు నువ్వు చేయాల్సిన పని—ఎలాంటి ఆహారం ఈ రూనీ రాస్కెల్గాడికి అందివ్వకు. ఆకలి తీర్చిన వాళ్ళను ఏ జంతువూ మర్చిపోదు" అన్నాడు హర్నాద్.

అతని అభిప్రాయం గ్రహించింది కృష్ణవేణి.

7

సమయం పదీ పది —

జమ్మిచెట్టు క్రిందకు ఓ అడుక్కుంటున్న ముసలి

వాడొచ్చి చప్టామీద కూర్చున్నాడు.

చుట్టుప్రక్క-లున్న కిళ్ళీకొట్ల దగ్గర జనాల్ని, కాకా హోటల్లోని కస్టమర్స్‌ని, వాటి వెనుకనున్న బిల్డింగ్స్ కిటికీలని పరీక్షగా చూశాడు.

పోలీసు జాగిలాలు పొంచివున్నాయని దృఢనమ్మకం కలగటంతోనే చేతిలోని కర్ర తాటిస్తూ మెల్లగా నడుచుకుంటూ పోయాడు.

ఆ ముసలివాడు కిడ్నాపర్స్ గ్రూప్‌కు సంబంధించిన వ్యక్తిగా ఎవరూ గుర్తించలేదు.

8

సమయం పదిన్నర—

అప్పటివరకూ యజమాని తన ఆకలి తీర్చుతాడని ఎదురు చూసిన రూనీ-ఎంతకూ యజమాని ఆ ప్రయత్నం చేయకపోయేసరికి మెల్లగా బయటకు నడిచింది.

హుషారుగా పైకిలేచాడు హర్నాద్. రూనీకి కనపడకుండా ఫాలో కాసాగాడు. కొన్ని బిల్డింగులు దాటి, అన్నిటికీ దూరంగా వున్న ఓ భవంతివైపు నడవసాగింది రూనీ.

అది ఆ భవంతి వెనక వైపుకు వెళ్ళటం చూసి సాలోచనగా తల పంకించి, ఆ భవంతి దగ్గరకొచ్చాడు హర్నాద్.

అధునాతనంగా సరికొత్త డిజైన్‌లో కట్టబడి వుందా బిల్డింగ్.

కాలింగ్‌బెల్ నొక్క-టంతో ఓ వ్యక్తి బయటకు వచ్చాడు.

తను చదివిన కాగితంలోని వర్ణన గుర్తుకు రాగానే వీడే — చింతమొద్దుగాడై వుంటాడని వూహించాడు హర్నాద్.

"హలో—రాఘవరావుగారుండేది ఈ ఇల్లేనా?" అది

గాడు హర్నాద్.

"కాదు" అంటూ లోపలకు వెళ్ళిపోయాడు చింత మొద్దు

ఓ నిముషం వుండి మరలా కాలింగ్ బెల్ నొక్కాడు.

బయట కొచ్చిన చింతమొద్దు ఇంకా నిలబడివున్న హర్నాద్‌ని ఎర్రగా చూశాడు.

"ఈ యిల్లెవరిదండీ?" అడిగాడు హర్నాద్.

"నాదే. దయచేసి ఇక వెళతారా?" తీవ్రంగా అన్నాడు.

"ఎవడు డాడీ!" అంటూ బయటకొచ్చాడు హిప్పీక్రాపు కుర్రాడు.

"ఎవరోలే. లోపలకెళ్ళు నువ్వు" అన్నాడు చింత మొద్దు.

మొత్తానికి వాళ్ళేదో విషయమై ఆరాటంలో వున్నారని ఊహించాడు హర్నాద్.

"సారీ! మిమ్మల్ని డిస్టర్బ్ చేసినట్లున్నాను" అంటూ వెనక్కి తిరిగాడు.

9

క్యాష్ బ్యాగ్‌తో జమ్మిచెట్టు దగ్గరకొచ్చాడు ఆదినారాయణగారు—

కానీ....అక్కడ ఫ్లవర్ వాజ్‌తో ఎవరూ కన్పించలేదు.

జమ్మిచెట్టు చెప్టామీద....పుడకబెట్టిన చిలకడ దుంపలు, చెఱకుగడల ముక్కలు, బిళ్ళలు, బఠాణీలు గోనెసంచి మీద వుంచి, ఈగల్ని త్రోలుకుంటూ అమ్మేముసల్ది "ఆదినారాయణ మీరేనా బాబూ!" అంటూ అడిగింది.

"అవును. ఏం?...." ఆదుర్దాగా అడిగారు ఆదినారాయణగారు.

"చేతిలో నల్లరంగు బ్యాగ్‌తో ఓ పెద్దమనిషి వస్తారు.

ఆయన పేరడిగి ఈ కాగితం యిచ్చేయ్ అవ్వా!, నేను అర్జంటు పనిమీద మరో చోటికి వెళ్ళాలని నా చేతిలో ఓ రూపాయి పెట్టి ఈ కాగితం యిచ్చిపోయాడు బాబూ ఓ కుర్రాడు'' అంటూ గోనెసంచి క్రిందనుండి కాగితం తీసి ఆదినారాయణగారికిస్తూ చెప్పింది ముసల్ది.

వణుకుతున్న చేతులతో ఆ కాగితం అందుకున్నారాయన.

ఆదినారాయణా!

నువ్వు నమ్ముకున్న పోలీసులు మమ్మల్ని పట్టుకుంటారని ఆశించిన నీ తెలివితక్కువతనానికి మాకు నవ్వొస్తుందోయ్ ఎసీ హా....పరిణామం దారుణంగా వుంటుందని హెచ్చరించినా మాట తప్పావు. అందుకు ప్రతిఫలం—నీ కూతురికి మాన భంగం. చేతనైతే నీ కూతురికి ఏం జరక్కుండా నీ పోలీసుల్ని రక్షించమను.

—కిడ్నాపర్స్.

అది చదవటంతోనే కుప్పలా కూలిపోయాడు ఆదినారాయణగారు. సివిల్ డ్రస్సులో కిళ్ళీకొట్టు దగ్గర నిలబడి ఆయన్నే పరిశీలిస్తున్న అమర్‌నాధ్ గబగబా ఆదినారాయణ గారి దగ్గరకు పరుగెత్తాడు.

ప్రక్క సందులో నుండి పోలీస్ జీప్ వచ్చి వాళ్ళ ప్రక్కగా ఆగింది.

రోదిస్తున్న ఆదినారాయణగార్ని అందులో ఎక్కించాడు అమరనాధ్.

జమ్మిచెట్టు దగ్గర అందరూ ఆశ్చర్యంగా చూస్తున్నంతలోనే జీప్ కదలి వెళ్ళిపోయింది.

"మీ తెలివితక్కువతనం వల్లనే....మీ అసమర్ధత

వల్లనే వాళ్ళు పారిపోయారు. నేను పోలీసుల సహాయం కోరానని తెలిసే వాళ్ళు స్పాట్ దగ్గర వుండలేదు" కోపంతో అరిచారు ఆదినారాయణగారు.

"శాంతించండి ఆదినారాయణగారూ!" అంటూ అనునయించబోయాడు అమరనాథ్.

మరింత రెచ్చిపోయారాయన—"శాంతి భద్రతల్ని రక్షించలేని అసమర్ధులైనపుడు మీ డిపార్ట్ మెంట్ వుండేం.. లేకేం...." ఆయన అరుస్తుండగానే జీప్ పోలీస్ స్టేషన్ ముందు ఆగింది.

అమర్‌నాథ్ జీప్ దిగగానే లోపల్నుండి కానిస్టేబుల్ పరుగెత్తుకొచ్చి సెల్యూట్ కొట్టి చెప్పాడు—"మీకు ఫోన్ సార్. లైన్లో వున్నారు."

గబగబా లోపలకెళ్ళి రిసీవరెత్తి "హలో ఇన్‌స్పెక్టర్ అమర్‌నాథ్ స్పీకింగ్" అన్నాడు.

అవతలి వ్యక్తి చెప్పేది ఊపిరి బిగబట్టి విన్నాడు.

ఫోన్ పెట్టేయడంతోనే రివ్వున బయటకు పరుగెత్తుకొచ్చాడు.

జీప్‌లోని పోలీసులందర్నీ దుమ్ము దులిపేస్తున్న ఆదినారాయణగారితో అన్నాడు—"మీ అమ్మాయి ఎక్కడ వుందో తెలిసింది. దయచేసి సహకరించండి" అనేసి జీపెక్కి "మొగల్‌రాజపురం కొండలవైపు పోనీయ్" అని డ్రైవర్‌తో చెప్పాడు.

10

చింతమొద్దుగాడు ఉదయం గదిలో పెట్టిన పాలని రూనీకి త్రాగించి దాన్ని ముద్దులాడుతున్న సమయాన విసురుగా తలుపు త్రోసుకొచ్చాడో వ్యక్తి.

తండ్రికి ఏక్సిడెంట్ అని తనని నమ్మించిన వ్యక్తిగా

గుర్తించింది ప్రఫుల్ల.

అతని వెనుకే వచ్చారు చింతమొద్దు, హిప్పీక్రాపు.

ప్రతి ఒక్కరూ తీక్షణంగా .... తీవ్రంగా తనని చూడటం గ్రహించి తండ్రివల్ల ఏదో పొరపాటు జరిగి వుంటుందని అనుకుంది ప్రఫుల్ల.

"నీ మాన ప్రాణాలకన్నా మీ నాన్నకు డబ్బే ముఖ్యం అనుకున్నాడమ్మాయ్. ముందు నీ మానాన్ని మంటగలిపి ఆ తర్వాత విషయం ఆలోచిస్తాం." అంటూ డోర్ లాక్ చేసి, కేన్ ఛెయిర్‌లో కూలబడి కూడా తెచ్చుకున్న బాటి లెత్తి గడగడా త్రాగేశాడు చింతమొద్దు.

"చూస్తూ నిలుచున్నారేరా! కానీయండి" ఆజ్ఞాపించాడు.

రేసుకుక్కల్లా వచ్చి ప్రఫుల్లమీద పడ్డారు ఇద్దరూ.

వాళ్ళ కబంధ హస్తాలనుండి బయటపడాలని పెనుగు లాడుతూ అరవసాగింది.

ప్రఫుల్ల పెనుగులాడుతున్న కొలదీ వాళ్ళలో కోరిక మరింత మందసాగింది.

మందు కొడుతూ ఆ ఆటని తిలకిస్తున్నాడు చింతమొద్దు.

అప్పటికే ప్రఫుల్ల వంటిమీద ఓణీ, జాకెట్ చిరిగి పీలికలై పోయాయి. మిగిలిన వలువలు తప్పించటానికి ఉత్సాహంగా ముందుకు నడిచారు ఇద్దరూ.

అదే సమయంలో తలుపులు పగలకొట్టుకుని ప్రవేశిం చారు అమరనాథ్, హర్నాద్, పోలీసులు.

ప్రఫుల్లని రేప్‌చేయబోతున్న ఇద్దరు గూండాలనీ చితక దన్నాడు అమరనాథ్.

చింతమొద్దుగాడ్ని కుళ్ళబొడిచాడు హర్నాద్.

తండ్రిని చుట్టుకుపోయి విలపించసాగింది ప్రఫుల్ల. బెడ్‌షీట్ కూతురి వంటిమీద కప్పి, అనునయించసాగా

రాయన.

కిడ్నాపర్స్ ముగ్గురికీ బేడీలువేసి జీపెక్కించాడు అమర నాధ్.

తండ్రిని చుట్టుకుని బెక్కుతున్న ప్రఫుల్ల భుజం తట్టి "టేకిట్ ఈజీ బేబీ" అన్నాడు అమరనాధ్.

"మా రూనీ ద్వారా సందేశం పంపిన మీ సమయ స్ఫూర్తికి అభినందించకుండా వుండలేకపోతున్నాను మిస్ ప్రఫుల్లా" అన్నాడు హర్నాద్.

"మీ రూనీకి నేను ఆజన్మాంతం ఋణపడి వుంటాను సార్!" అంటూ అప్పటికే హర్నాద్ చేతిలోకి చేరిన రూనీని అందుకుని ముద్దుల వర్షం కురిపించింది ప్రఫుల్ల.

"పట్టణాన్ని వణికిస్తున్న కిడ్నాపర్స్‌ని పట్టిచ్చిన మీకు మా డిపార్ట్‌మెంట్ తరఫున ధన్యవాదాలు రూనీగారూ!" నవ్వుతూ అన్నాడు ఇన్‌స్పెక్టర్ అమరనాధ్.

థాంక్స్ అన్నట్లుగా 'మ్యావ్' మంది రూనీ. □

స్లీపింగ్ పార్ట్‌నర్

చొల్లూరి అచ్యారావు

"అలా అంటే ఎలా? నువ్వు బ్రహ్మచారివి. మేం సంసారకూపంలో యిరుక్కుపోయిన సన్యాసులం. నీ దగ్గర లేకపోతే యింకెవరిదగ్గరుంటాయ్ డబ్బులు?"

"లేవని చెప్పాను కదా!"

"చెప్పావనుకో. అలా చెప్పిం తర్వాత చాలాసార్లు యిచ్చావు కూడా!"

"నిజమే! కాని ఆ యిచ్చినవి తిరిగిచ్చిన పాపాన పోయావా!"

"ఇచ్చేస్తానులే బ్రదర్! అన్ని రాష్ట్రాల టిక్కెట్లు కొన్నాను. ఏదో ఒకటి తగలకపోతుందా?"

"తగుల్తుంది. గూబ గుయ్యిమనేలాగా. నీకు పేకాట తాగుడే అనుకున్నాను. లాటరీ జూదం కూడా వుందన్న మాట. నువ్వు నా దగ్గిరా మరొకరి దగ్గరా ఇలా అప్పులు జేసి తాగుడికి, పేకాటకీ తగలెయ్యకపోతే కుటుంబ ఖర్చులకి వాడుకోవచ్చును కదా!"

"చూడు, నువ్విస్తే యివ్వు లేకుంటే లేదు. ఎందుకొచ్చిన హితోపదేశాలు బాబూ నాకు?" విసవిస వెళ్ళిపోయాడు అవతారం.

శరత్‌బాబు తలెత్తి అవతారం వంక చూసి తిరిగి తన ఫైళ్ళలో మునిగిపోయాడు. అవతారం పాతికేళ్ళుగా అదే ఆఫీసులో గుమస్తా స్టేజినించి పైకి ఎగబ్రాకలేకపోయాడు. తను రెండేళ్ళక్రితం డైరెక్టుగా సీనియర్ అసిస్టెంటుగా పోస్టయ్యాడక్కడికి.

ఉద్యోగంలో జాయినయినప్పట్నుంచీ యింట్లోవాళ్ళు పెళ్ళిచేసుకోమని ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఒకటి రెండు సంబంధాలు చూశాడుగాని, ఏ ఒక్కటీ నచ్చలేదు. తల్లిదండ్రులు కట్నాలకి ఆశపడి అనాకారులైన అమ్మాయిల్ని

చూపించారు. తన కాబోయే భార్య ఎలావుండాలో తనకి కొన్ని స్థిరమైన అభిప్రాయాలున్నాయి. అలాంటి అమ్మాయి దొరికేవరకు బ్రహ్మచర్యం తప్పదు!

హోటల్లో భోంచేసి గదికి తిరిగొస్తుండగా గాంధీ పార్కు ముందర కీసీదలో ఎవరో ఒకమ్మాయి వించుని వుండటం కనిపించింది.

అప్పుడు రాత్రి తొమ్మిది గంటలు కావస్తోంది.

శరత్‌బాబు ఆమె ముందునుంచి వెళ్తుండగా ఆమె పిలిచింది. "ఏమండీ, ఒక మాట!" అంటూ.

శరత్‌బాబు టక్కున నిల్చుండిపోయాడు. ఆశ్చర్యంగా ఆమె వైపు చూశాడు. ఆమె వయసు దాదాపు యిరవై రెండేళ్ళుంటాయి. లావూ సన్నంగాని విగ్రహంతో ఎర్రగా పొడవుగా వుంది. అవయవాలు పరిపుష్టిగా ఎక్కడ వుండాల్సిన ఒంపుసొంపులు అక్కడున్నాయి. ఆమె కట్టుకున్న పల్చటి నైలెక్సు చీర ఆమె అందాల్ని, ఒంపుల్ని స్పష్టంగా బహిర్గతం చేస్తోంది.

శరత్ ఒక్కక్షణం ఆమె కళ్ళలోకి చూసి తల పక్కకి తిప్పుకుని "నాతోనా? మీ రెవరో నాకు తెలియదు." అన్నాడు సిగ్గుపడుతూ.

"ఇప్పటిదాకా తెలియకపోవచ్చు. ఇప్పుడు తెల్సుకోవా లనుకుంటే అభ్యంతర ముండదు" అన్నదామె.

శరత్ ఆమె ముఖంలోకి ఉలిక్కిపడి చూశాడు. ఆమె కళ్ళు నవ్వుతున్నాయి. కొంటెగా, అదో రకంగా చూస్తోందామె. అతను తడబడ్డాడు.

"సారీ, నాకు తెలుసుకోవాలని లేదు."

ఆమె చటుక్కున అతన్ని సమీపించి చేయి పట్టుకుంది. "బొత్తిగా కొత్తలావుంది. మా యింటికి మీ

రొచ్చినాసరే, లేదా మీ రెక్కడికి రమ్మంటే అక్కడి కొస్తాను" అన్నది.

శరత్‌కి ముచ్చెమట్లు పోశాయి. అతనికి ఆడవాళ్ళతో అనుభవం లేదు. ఇప్పటిదాకా వాళ్ళజోలికి పోలేదు. ఆమె చొరవ అతడ్ని నీరుకారిపోయేలా చేస్తోంది.

"సారీ, నా కలవాటులేదు."

ఆమె నవ్వింది గలగల పారే సెలయేరులా.

"ఇప్పుడు అలవాటు చేసుకోండి. ఇంకా పెళ్ళికాలే దన్నమాట. పెళ్ళికిముందు ట్రయినింగ్ అవసరం" అన్నది.

శరత్ ఏదో ఆకర్షణకి ప్రలోభానికి లోనవుతున్నాడు. తనలో యీ రోజు యీమె ఏదో ప్రేరేపిస్తోంది. తనకి తెలియకుండానే తను లొంగిపోతున్నాడు. ఆమె చాలా తెలివైనది. చేసుకునేది వృత్తి అయినా, ఆ తరహా మని షిలా లేదు. చాలా హోమ్లీగా వుంది.

"మీరు రోజూ సుబ్బయ్య హోటల్నుంచి యిదే దారిన వెళ్ళటం చూస్తున్నాను. ఇంట్లో ఆడవారు లేరని, బహుశా పుట్టింటికి వెళ్ళడమో, లేక మీకు పెళ్ళే కాకపోవటమో అయ్యుండవచ్చని ఊహించాను. ఆడ అవసరంలో వున్నా రని గ్రహించాను. అందుకే రోడ్డుపక్కన మీకోసం ఎదురుచూస్తూ నించున్నాను. మా యిల్లు యిక్కడికి దగ్గరే...." అన్నదామె నవ్వుతూ.

ఆమె నవ్వులో ఏదో ఆకర్షణ వుంది. అది అతన్ని పట్టి తనవైపు లాక్కుంటోంది. తన నిగ్రహం, యిన్నాళ్ళ బ్రహ్మచర్యం—యీ క్షణంలో తనని వదిలిపోతానని మారాం చేస్తున్నాయి.

ఎదురుగా అప్సరసలాంటి అందమైన అమ్మాయి, తనని కోరివచ్చిన అమ్మాయి, ఒంటరి తనం, వెన్నెల రాత్రి తనలోని పురుషత్వాన్ని రెచ్చగొడ్తున్నాయి. ఇక నిగ్రహించుకోవటం తన శక్తికి మించినపని.

ఆమె యింకా నవ్వుతూనే వుంది.

"మా రూం యిక్కడికి దగ్గరే.... వెళ్దామా!" అన్నాడు. మాటలు తడబడ్డాయి.

"అలాగే. పదండి." అన్నది.

"మరి.... మరి....?"

"ఏమిటి....?"

"నీకు.... ఎంత.... ఎంతివ్వాలి."

"వెయ్యి రూపాయలు."

త్రుళ్ళిపడ్డాడు. "ఏమిటి?.... వెయ్యి ..."

ఆమె కళ్ళు చిలిపిగా నవ్వుతున్నాయి.

"భయపడకండి. నేను ప్రొఫెషనల్ని కాదు. మీ రెంతిస్తే అంతే! డిమాండ్ చెయ్యను...."

"అయితే నువ్వు.... మీరు...."

"దయచేసి వివరాలడగొద్దు. మీకు నచ్చితే నన్ను మీ వెంట తీసుకువెళ్ళండి. స్లీపింగ్ పార్టనర్‌గా మీ కేలోటూ రానివ్వను."

శరత్‌కి ఆమె నచ్చింది. ఆమె మాటతీరు నచ్చింది. అన్నిటికన్నా ఆమె అందం, ఆకర్షణ నచ్చాయి. అతన్ని అయస్కాంతంలా ఆకర్షిస్తోందామె.

"ఓ. కే... వివరాలడగను." అన్నాడు బుద్ధిగా.

ఆమె కృతజ్ఞతగా నవ్వింది. "పదండి" అన్నది. అతను రిక్షాను పిలుస్తుంటే, "దగ్గరే నంటున్నారుగా. నడిచి వెళ్దాం" అన్నది.

"వద్దు, వద్దు...." అన్నాడతను కంగారుగా.

ఆమె నవ్వింది. అతను మొహమాటంగా నవ్వాడు. నడిచి వెళ్తుండగా తెలిసినవాళ్ళెవరైనా కనిపిస్తే....? ఇంకేమైనా వుందా? మర్నాటికి తన పరువు బజారుపాలే.. ఆఫీసులోను, బయట తను నిప్పులాంటివాడనే పేరుంది. తన ఆఫీసరుకూడా తనపట్ల ఎంతో మర్యాద చూపిస్తాడు. లేడీ క్లార్కులు, స్టెనో, మేనేజర్‌గారి పి.ఏ. అమ్మాయి— అందరకీ తనంటే గొప్ప ఆరాధన! అవసరమైన దానికన్న ఒక్క మాట కూడా ఎక్కువ మాట్లాడని తనని చూసి ఆఫీసు స్టాఫ్ ముద్దుగ బెదురుగొడ్డు అనుకోవటం తనకి తెలుసు.

కాని, యిప్పుడు యీ చిన్ని బలహీనత కారణంగా తనకున్న మంచిపేరు మట్టికొట్టుకుపోగా నలుగురిలోనూ చులకనై పోతాడు.

రూంకి నాలుగ్గజాలముందే రిక్షాదిగి బాడుగ యిచ్చేసి, ఆమెతో రూంకి నడిచాడు.

రూం ముందు ఎవరో వ్యక్తి నిలబడి సిగరెట్టు కాలుస్తున్నాడు!

శరత్ గుండె లయతప్పి కొట్టుకోసాగింది. మొండి ధైర్యంతో ఆమెతో గది దగ్గరకు చేరుకుని, ఆ వ్యక్తి వంక పరీక్షగా చూశాడు.

అతను భయపడినంతా అయింది.

ఆ వ్యక్తి అవతారం! అతని ఆఫీసు క్లార్కు!

2

"హల్లో బ్రదర్! సారీ ఫర్‌ది ఇన్‌కన్వీనియన్స్. మళ్ళీ రాక తప్పలేదు. నా డాటర్‌కి వంట్లో బావుండలేదు. మందులకి...." భావయుక్తంగా నవ్వాడు అవతారం.

అతను ఆ సమయంలో తనని ఆ స్థితిలో చూసి నందుకు బాధ ఓ పక్క, అలాంటివాడి కళ్ళబడి పరువు బజారు కెక్కించుకున్నందుకు దుగ్ధ మరోపక్క అతన్ని వేధించాయి. మారుమాట్లాడకుండా జేబునించి ఏభై రూపాయల నోటుతీసి అతని కందించాడు.

"థాంక్స్ బ్రదర్! అవసరానికి దేవుళ్ళా ఆదుకున్నావు" అంటూ నోట్ అందుకుని ముద్దుపెట్టుకొని, వాళ్ళిద్దరివంక భావయుక్తంగా, వెకిలిగా చూసి, "స్వీట్ నైట్!" చెప్పి వెళ్ళిపోయాడు అవతారం.

తలుపులు తెరవాలనే ధ్యాసకూడా లేకుండా అలాగే నించుండిపోయిన శరత్‌ని చూసి, "తలుపు తెరవండి." అన్నదామె మంద్రస్వరాన.

ఉలిక్కిపడి ఆమె వైపుచూసి జేబునించి తాళం తీసి తలుపులు తెరచాడు. అతని వెనకనే ఆమె లోని కడుగు పెట్టి తలుపులు మూసింది.

ఆమె కళ్ళలో మెచ్చుకోలు కనిపించింది గదిలో అలం కరణ చూసి. ఒకే గది! ఓ పక్క తెల్లటి దుప్పటి పర చిన మంచం నీట్‌గావుంది. మరోపక్క గాడ్రెజ్ ఛైర్, ఫోల్డింగ్ టేబిలు, టేబిల్‌మీద ఓ పక్కగా వరసగా పెట్టిన పుస్తకాలు, గోడకి హేంగర్, దానికి వేలాడుతూ ఓ జత గుడ్డలు, రెండేరెండు ఆయిలు పెయింటింగులు—సీనరీస్- వేలాడుతూన్నాయి. "సింప్లీ సుపర్బ్" అనుకున్నది.

అయితే శరత్‌బాబు పరిస్థితి వేరుగావుంది. ఎవరికళ్ళ బడకూడదో ఆ మనిషి కళ్ళబడ్డాడు. ఆలిండియా రేడియో కన్న త్వరగా వార్తలు ప్రసారం చేయగలిగిన సమర్థుడు అవతారం.

"మీ మూడ్ పాడయినట్టుంది!" అన్నదామె. అతని

మెడకి ఆమె ఊపిరి వెచ్చగా తగుల్తోంది. ఆమె ఒంటి మీదినుంచి వస్తున్న పరిమళం అతన్ని మళ్ళీ మూడ్‌లోకి తీసుకొచ్చేసింది. అంత సమీపంలో స్త్రీతో ఒంటరిగా, తన గదిలో....అతనికి ఒళ్ళంతా పులకరించింది. ఈ రాత్రికి ఆమె తనది అనుకుంటుంటే అతని శరీరం అతని అదుపు తప్పుతోంది.

చకచక గుడ్డలు మార్చుకున్నాడు. లుంగీ కట్టుకున్నాడు. ఆమె పరీక్షగా అతనివంకే చూస్తోంది. బలిష్టమయిన అతని ఛాతీ కట్ బనీనులోనుంచి పొంగుకొస్తోంది. చామనఛాయతో, ఆరోగ్యమైన ముఖంతో ఆకర్షణీయంగానే వున్నాడనుకున్నది.

మంచంమీద కూచుని నవ్వుతూ చూపిం దతనివంక. అతను బిడియంగా నవ్వి ఆమె పక్కన కూచున్నాడు. ఆమెమీద చేతులువేసి దగ్గరకు లాక్కోబోయి సంకోచంగా ఆగిపోయాడు.

ఆమె నవ్వి అతని భుజంమీద చేతులువేసి దగ్గరగా లాక్కుంది. అతని కళ్ళలోకి చిలిపిగా చూపింది. అతను తడబడ్తున్నాడు. అయినా ధైర్యంచేసి ఆమెను గుండెలకి హత్తుకున్నాడు. ఒణుకుతున్నాడు. చెమటతో శరీరం తడిసిపోయింది. ఎందుకో నెర్వస్‌గా ఫీలవుతున్నాడు.

"భయపడ్తున్నారా?" అన్నది.

"అబ్బే, భయమా? దేనికి?" అన్నాడేగాని, అంతకు మించి ముందుకు సాగటంలేదు.

"నీపేరేమిటి?" అడిగాడు పొడి పొడిగా.

"శ్యామల" అన్నది చిన్నగా నవ్వి.

మళ్ళీ మౌనం వహించాడు. ఏదో చెయ్యాలి. కాని, ధైర్యం చాలటంలేదు. శ్యామల చటుక్కున అతన్ని

తనమీదకు లాక్కుంది.

అరగంట తర్వాత అలసి సొలసిన అతన్ని చూసి "ఫరవాలేదు ప్రాక్టీసు బాగానేవుంది. వృద్ధిలోకి వస్తారు." అన్నది శ్యామల నవ్వుతూ.

శరత్‌బాబు ఆమెవంక ప్రేమగా, అపురూపంగా చూశాడు. తనలో స్పందన కలగచేసి, తనకి స్త్రీసాంగత్యం లోని రుచి చూపించిన మొట్టమొదటి స్త్రీ ఆమె!

"రోజూ వచ్చెయ్యి" అన్నాడు గుసగుసగా.

"మరి మీ ఆఫీసువాళ్ళకి, బయటివాళ్ళకి తెలిసిపోదా!"

"తెలిసినా లెక్కచెయ్యను. నీ గురించి అవన్నీ భరిస్తాను." ఆమె మనోహరంగా నవ్వింది మరోసారి ఆమె నాక్రమించుకున్నాడతను.

తెల్లవారఝామున నాలుగు కొట్టేవరకు అత నామెను వదిలిపెట్టలేదు. తను నిద్రపోలేదు, ఆమెని నిద్రపోనివ్వ లేదు.

"ఇక నేను వెళ్తాను. పూర్తిగా తెల్లవారకముందు వెళ్ళిపోతే యిద్దరికీ మంచిది" అన్నది శ్యామల.

శరత్‌బాబు వదల్లేక వదిలాడామెని. రెండువంద రూపాయల నోట్లు తీసిచ్చాడు. ఆమె చిన్నగా నవ్వి, ఒక వంద నోటు అతనికి తిరిగిచ్చేసి "అత్యాశలేదు. వంద చాలు!" అన్నది.

శరత్‌బాబు ఆశ్చర్యపోయాడు. వృత్తిచేసుకునే స్త్రీలు ఎంత యిచ్చినా యింకా రాబట్టుకోవాలని చూస్తారు. కాని యీమె ప్రవర్తన విచిత్రంగా వుంది.

చివరిసారిగా ఆమెను కౌగలించుకొని వదిలాడు. ఆమె తలుపులు తెరుచుకుని బయటకు అడుగుపెట్టింది. ఆమె నాలుగ్గజాలు వెళ్ళాక తలుపులు వేసుకోబోయాడు.

అప్పుడు వినిపించింది కెవ్వున కేక! కేక మధ్యలోనే ఎవరో నోరు నొక్కిపెట్టడంతో గొంతులోనే గిజగిజ లాడింది. ఎవరో పెనుగులాడుతున్న మెత్తటి శబ్దం.

తలుపులు బార్లాతెరిచాడు. గదిలోంచి పడుతున్న సన్నటి వెలుర్లో కనిపించిన దృశ్యం అతడ్ని నిర్ఘాంతపోయేలా చేసింది.

శ్యామల నెత్తుటి మడుగులో పడివుంది. ఎవడో ఆమెని పొడిచి పారిపోతున్నాడు వెనకనించి మాత్రమే అతన్ని చూడగలిగాడు శరత్‌బాబు.

రెండంగల్లో ఆమె దగ్గరికి పరుగెత్తుకు వెళ్ళాడు. ఆమె కడపటి క్షణాల్లోవుంది! ఊపిరి బరువుగా వదుల్తోంది. పొత్తికడుపులోనించి రక్తం యింకా స్రవిస్తోంది ధారగా. అతన్నిచూసి దగ్గరికి రావద్దని తల అటు యిటు తిప్పింది. ఏదో చెప్పాలని తాపత్రయపడింది.

శరత్‌బాబు ఆమెని సమీపించాడు. "ఏమిటి? ఎవరు వాడు? నిన్నెందుకు పొడిచాడు?" అంటూ ప్రశ్నల పరంపర కురిపించాడు అతనికి ముచ్చెమటట్లు పోశాయి. ఆ దృశ్యాన్ని చూసి నిలువెల్లా ఒణికిపోతున్నాడు. గొంతు తడారిపోయింది. మాట తడబడింది

ఆమె ఏదో చెప్పాలని నోరు తెరచింది. కళ్ళు, నోరు అలా తెరుచుకునే వున్నాయి. ఆమె తల పక్కకి వాలి పోయింది.

ఆమె చనిపోయిందన్న నిజం అప్పటిగ్గాని అతని మెదడుకి తాకలేదు. అతనికి భయంతో గుండెలు దడదడ లాడాయి ఆమె తన గది ముందరే హత్య చేయబడింది. కొద్ది క్షణాలక్రితం ఆమె సజీవంగా తన బాహువుల్లో నలిగి తనకి స్వర్గసుఖాల నందించింది. ఆమె తనతో వుండగా

అవతారం చూశాడు.

ఇప్పుడు పోలీసులు రంగంలోకి ప్రవేశిస్తే మొదటి అనుమానితుడు తనే! తనెంత చెప్పినా వినకుండా తనని పోలీసులు అరెస్టుచేసి కేసు పెడతారు. తననే హంతకుడిగా నిరూపించినా నిరూపించగలరు!

శరత్‌బాబుకి కాళ్ళుచేతులాడలేదు. ఆమె నక్కడ అలాగే వదిలేసి గదిలోకి పరుగెత్తాడు. చకచక గుడ్డలు మార్చుకున్నాడు. గదికి తాళం పెట్టాడు. రోడ్‌మీది కొచ్చాడు. సెంటర్లో రిక్షాలున్నాయి. రిక్షాల్లో డ్రయివర్లు నిద్రపోతున్నారు. ఓ రిక్షావాడ్నిలేపి కూచున్నాడు. రిక్షాను పోనివ్వమన్నాడు.

అప్పుడు నాలుగున్నర గంట అయింది.

3

కాలింగ్ బజ్జర్ అదే పనిగా మోగుతోంది.

డిటెక్టివ్ కిరణ్ పక్కమీద బద్ధకంగా కదిలి, లేచి కూచున్నాడు. కాలింగ్ బజ్జర్ మోగుతూనేవుంది.

లేచి తలుపు తెరిచాడు. ఎదురుగా పాతికేళ్ళ యువకుడు విల్చుని వున్నాడు. పక్కనే తన గూర్ఖా.

"డిటెక్టివ్ కిరణ్‌గారు...."

"నేనే. లోపలకు రండి!" పక్కకి తొలిగి దారి యిచ్చాడు కిరణ్. గూర్ఖా సెల్యూట్‌చేసి వెళ్ళిపోయాడు. అతను లోపలికొచ్చాడు.

"నాపేరు శరత్‌బాబు, నేనో పెద్ద ఆపదలో చిక్కుకున్నాను" అన్నాడా యువకుడు.

అతన్ని డ్రాయింగ్ రూంలో కూర్చుండబెట్టి బాత్ రూంకి వెళ్ళి ముఖం కడుక్కుని వచ్చి "చెప్పండి" అన్నాడు.

శరత్‌బాబు జరిగిన సంగతి వివరంగా చెప్పాడు.

కిరణ్ శ్రద్ధగా విన్నాడు.

"హత్య జరిగిన సమయంలో ఆ చుట్టుపక్కలవా ళ్ళెవరైనా మేలుకొని వున్నారా?" అడిగాడు కిరణ్.

"లేదు సార్. అంతా గాఢనిద్రల్లోవుండే సమయం. నేను ఒక్కడ్నే ప్రత్యక్షంగా చూశాను. నేను యిక్కడికి బయల్దేరివచ్చే సమయానికి కూడా వీధిలో ఎవరూ మేలు కోలేదు. ఆమె శవం మాత్రం అలా పడివుంది. ఎవరూ చూడలేదు."

"ఇదివరకు మీకామెతో ఎన్నడూ పరిచయం లేదు కదూ!"

"లేదు సార్. రాత్రి మొదటిసారిగా చూశానామెను. ఆమె ఎవరో, ఎక్కడుంటుందో వివారాలేం తెలీవు."

"కాని ఆమెను మిమ్మల్ని మీ ఆఫీసు కొలీగ్ చూశా డంటున్నారు కదా! ఆ సాక్ష్యం చాలు మీమీద కేసు బిగుసు కోవటానికి! ....ఇంకా ఎవరైనా చూశారా మీ యిద్దర్నీ?"

"రోడ్ మొదట్లో పాన్‌షాపతను చూసి వుండొచ్చు సార్! చుట్టుపక్కల యిళ్ళ తలుపులు మూసివున్నాయి. అప్పటికి తొమ్మిది దాటింది. ఎనిమిది గంటలకే మా వీధి నిర్మానుష్యంగా అయిపోతుంది."

"ఇళ్ళ లోపల్నుంచి ఏ కిటికీలోనుంచో మిమ్మల్నిద్దర్నీ యిళ్ళలోపలివాళ్ళు చూసే అవకాశముందా?"

శరత్ తలూపాడు. "ఉంటుంది సార్".

"హత్య జరిగింది మీ గదిముందరే కాబట్టి యీ హత్య కేసులో మొదటి అనుమానితుడు మీరే అవుతారు. పోస్ట్ మార్టం పరీక్షలో ఆమె అంతకు క్రితమే సంభోగ క్రియలో పాల్గొన్నట్లు తెలిసిపోతుంది. ఆమెను అనుభవించి, తర్వాత

హత్యచేశారని మీమీద అభియోగం తీసుకువస్తారు."

శరత్ నిలువెల్లా ఒణికిపోతున్నాడు. ఎలాగో గొంతు పెకల్చుకుని, "అందుకే సార్, పోలీసులకి తెలియచేయకుండా మీ దగ్గరికి పరుగెత్తుకొచ్చాను. నా దురదృష్టం కాకపోతే నేను చేసిన మొదటి తప్పుకి పరిణామం యింత ఘోరంగా వుంటుందనుకోలేదు. నా పరువు ప్రతిష్టలు పోవటంతోబాటు, తరతరాలుగా నా కుటుంబం తలెత్తుకు తిరగలేని పరిస్థితి ఎదురయింది. అందరూ నన్నే హంతకుడని వేలెత్తి చూపుతుంటే ...ఆ ఆలోచనే భరించలేకపోతున్నాను. నన్ను అరెస్టు చేయకుండా చూడండి సార్! మీకాళ్ళు పట్టుకుంటాను." అన్నాడు.

కిరణ్ గంభీరముద్ర దాల్చాడు. తర్వాత సూటిగా శరత్‌వైపు చూసి, "మీరు అరెస్టు కాకుండా ఆ భగవంతుడు కూడా అడ్డుపడలేడు. ఈ కేసులో మొట్టమొదటి ప్రధాన అనుమానితుడు మీరే! మిమ్మల్ని అరెస్టు చేయకుండా చూడటంకోసమే మీరు నాదగ్గిరకొస్తే యిక మీరు వెళ్ళొచ్చు!" అన్నాడు.

శరాత్‌బాబు కంగారుపడ్డాడు. "అది కాదు సార్! నా పరువు మర్యాదలు ...." తడబడ్డాడు.

"ఆమె మీద వ్యామోహపడినపుడు గుర్తురాలేదా పరువు మర్యాదలు? ఆమెని మీ గదికి తీసుకుని రాకపోతే యిదంతా జరిగేవి కావు."

శరత్ మొహం వివర్ణమైంది. "మీరు చెప్పేది కరెక్టే సార్! దిద్దుకోలేని పొరపాటు జరిగిపోయింది. దయచేసి నన్ను నిర్దోషిగా నిరూపించండి సార్. ఆ సాయంచేస్తే మీమేలు జన్మ జన్మలకూ మరచిపోను." అన్నాడు చేతులు

జోడించి.

"ఆల్ రైట్! మీరు నేరం చెయ్యలేదని నేను విశ్వ పిస్తున్నాను. మీరు నాదగ్గిర ఏ విషయం దాచినా లాభం లేదు. మీరు నాతో ఏదైనా అబద్ధం చెప్పారని నా కను మానం వస్తే యీ కేసు మధ్యలోనే వదిలేస్తాను."

"లేదు సార్! నేను అన్ని విషయాలు దాచకుండా మీకు మనవి చేశాను. ఇలాంటి పరిస్థితుల్లో మీరు తప్ప నన్ను రక్షించేవారు లేరు!"

"పదండి. మీ గదికి వెళ్దాం. ఈపాటికి శవం నలు గురి కళ్ళలోను పడేవుంటుంది. ఎవరో వొకరు పోలీసు లకి తెలియచేసి వుంటారు. అయినా విషయాన్ని పోలీసు లకి తెలియచెప్పాల్సిన బాధ్యత నామీద వున్నది." అంటూ ఫోనెత్తి డయిల్ చేశాడు కిరణ్.

"హల్లో, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వున్నారా?" అన్నాడు.

అవతల్నుంచి సార్జంటు శివం గొంతు పలికింది. "అయిదు నిమిషాలక్రితమే ఇన్‌స్పెక్టరుగారు గాంధీ నగర్‌లో ఏదో హత్య జరిగిందని ఫోన్‌వస్తే వెళ్ళారు సార్! ఏమయినా చెప్పమంటారా?" అన్నాడు.

"ఆ విషయం చెప్పటానికే రింగ్ చేశాను." అంటూ ఫోన్ పెట్టేసి శరత్‌వైపు చూసి, "పోలీసులు రంగంలోకి దిగారు" అన్నాడు కిరణ్.

శరత్‌బాబు గుండె వేగం హెచ్చింది.

"పదండి వెళ్దాం" అంటూ లోపలికి వెళ్ళి దుస్తులు మార్చుకొని వచ్చాడు డిటెక్టివ్ కిరణ్.

రెండు నిమిషాల తర్వాత కిరణ్ టయోటా గాంధీనగర్ వైపు పరుగుతీసింది.

4

టయోటా స్పాట్‌కి చేరేసరికి అప్పటికే అక్కడికి పోలీసు వాహనం వచ్చివున్నది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఫోటోగ్రాఫరు, డాక్టరు తమ పనుల్లో మునిగిపోయి వున్నారు.

కిరణ్‌ని చూస్తూనే ఆశ్చర్యంగా ముందుకొచ్చి విష్ చేశాడు శ్రీనివాస్. అప్పుడే యీ వార్త నీకెలా తెలిసిందని అతని ఆశ్చర్యాని కర్థం! కిరణ్ వెనుకనే శరత్‌బాబు టయోటా దిగి పక్కగా నిలబడ్డాడు. శ్రీనివాస్ అతని వంక ప్రశ్నార్థకంగా చూసి కిరణ్‌వైపు చూశాడు.

కిరణ్ శవంవైపు నడిచాడు. ఫోటోగ్రాఫర్ ఫోటోలు తీయటంకోసం శవాన్ని అటు యిటు కదిపినట్టు గ్రహించాడు కిరణ్.

"నాలుగున్నర ప్రాంతాల ఫోన్ వచ్చింది, యిక్కడ ఏదో శవం పడుందని! వెంటనే స్టేషన్‌కొచ్చి సిబ్బందితో యిలా వచ్చాను. నీకీ విషయం ఫోన్ చేద్దామనుకుంటున్నాను. ఇంతలో నువ్వే వచ్చావు" అన్నాడు శ్రీనివాస్.

"హత్యాయుధం లేదా?" అన్నాడు కిరణ్.

"లేదు. హంతకుడు వెంట పట్టుకుపోయినట్టున్నాడు. కడుపులోను, ఛాతీమీద మొత్తం అయిదుపోట్లు తగిలాయి. వెంటనే ప్రాణం పోయుండాలి."

డాక్టరు దగ్గరకొచ్చి. "తెల్లవారుఝామున మూడున్నర నాలుగున్నర మధ్య హత్య జరిగుండాలి. మోటివ్ తెలీదు. ఆమెని బలాత్కారంచేసిన లక్షణాలేవీ లేవుగాని, హత్యకు ముందు ఆమె యింటర్‌కోర్సులో పాల్గొని వుండొచ్చునని ఊహిస్తున్నాను. ఏ విషయము పూర్తిగా పోస్టుమార్టం చేశాక చెప్తాను" అన్నాడు.

కిరణ్ ఆయన కుశాగ్రబుద్ధికి ఆశ్చర్యపడినా, దాన్ని పైకి ప్రకటించలేదు.

శ్రీనివాస్ కిరణ్‌వంక చూసి, "ప్రిలిమినరీ యిన్వెస్టిగేషన్ చేశాను. ఈ అమ్మాయి యీ ఎదురుగావున్న గదిలోని యువకుడితో రాత్రి తొమ్మిదిగంటల ప్రాంతాలకు యిక్కడి కొచ్చిందని యీ పక్కింటి ఆయన చెప్పారు. ఆమె రాత్రి అతనితో యీ గదిలోనే గడిపి వుండొచ్చునని చెప్పాడు. అయితే యీ గదిలోని యువకుడు ఏమైపోయాడో పత్తాలేదు," అన్నాడు.

కిరణ్ శరత్‌బాబుని చూపించి, "అతనే యీ గదిలోని యువకుడు. ఈమెతో రాత్రి గడిపిన మనిషి...." అంటూ జరిగిన సంగతంతా చెప్పాడు.

శ్రీనివాస్ ఇబ్బందిగా చూశాడు. "బ్రదర్, అతను నీ క్లయింటు యిప్పుడు. కాని అతన్ని ప్రథమ నిందితుడిగా అరెస్టుచేయక తప్పదేమో! ఎలా?" అన్నాడు.

కిరణ్ ముఖం గంభీరముద్ర దాల్చింది. "అతను నా క్లయింటయితే కావచ్చు కాని చట్టం దృష్టిలో ప్రస్తుతం నేరస్తుడు. హంతకు డెవరో తేలేవరకు అతన్ని రిమాండులో వుంచక తప్పదు కదా! కస్టడీలోకి తీసుకో!" అన్నాడు.

శరత్‌బాబుని పిలిచి అతని గది తలుపులు తెరిపించి గదినంతా పరిశీలించారు కిరణ్, శ్రీనివాస్‌లు. అనుమానించడానికి ఆధారాలేం కనిపించలేదు. శరత్ యిచ్చానని చెప్పిన వంద రూపాయలనోటు శవం బ్లౌజులోపల దొరికింది.

శరత్‌బాబు చుట్టుపక్కలవాళ్ళవైపు కన్నెత్తి చూడలేక పోతున్నాడు. అవమాన భారంతో అతని తల భూమిలోకి

కుంగిపోయింది. తనని ఎంత తొందరగా పోలీసులు తీసుకు పోతే అంత మంచిదన్నట్టున్నాడు.

"హంతకుడ్ని చూస్తే గుర్తుపట్టగలరు కదా!" అన్నాడు కిరణ్ శరత్‌బాబుతో.

"వెనకనుంచి చూశాను సార్! ముఖం చూచాయగా కనిపించింది. అయినా గుర్తించగలననుకుంటాను" అన్నాడు శరత్.

"ఓ ముఖ్యమైన విషయం మరచాను. ఆమె తనింట్లో ఒంటరిగా వుంటుందా, ఎవరితోనైనా కలిసివుంటోందా? ఆమె నివాసం ఎక్కడ!—యీ వివరాలు మీతో ఏమైనా చెప్పిందా?" అడిగాడు కిరణ్.

"చెప్పింది సార్. గాంధీపార్కుకి దగ్గర్లోనే పోస్ట్ బాక్స్ పక్కనున్న పెంకుటింట్లో వుంటున్నానని చెప్పింది. పూర్తి వివరాలు చెప్పటాని కిష్టపడలేదు. నేను ఆమెని రెట్టించి అడగలేకపోయాను."

"గుడ్! ఆమాత్రం వివరణ చాలు. నేను ఎంక్వయిరీ చేస్తాను. ప్రస్తుతానికి మీరు పోలీస్ కస్టడీలో వుండక తప్పదు. అవసరమైనప్పుడు నేనేవచ్చి కలుస్తాను." అన్నాడు కిరణ్ శరత్‌బాబుతో.

శరత్ నీళ్ళునిండిన కళ్ళతో కిరణ్‌వంక చూసి రెండు చేతులెత్తి నమస్కరించాడు. శ్రీనివాస్ ఏమనుకున్నాడో ఏమో, శరత్‌కి బేడీలు వేయించకుండానే వేన్ ఎక్కించాడు.

"నేను ఓగంట తర్వాత స్టేషన్ కొస్తాను" అన్నాడు కిరణ్ శ్రీనివాస్‌తో.

"ఆల్‌రైట్ బ్రదర్. ఎదురుచూస్తుంటాను" అన్నాడు శ్రీనివాస్.

కిరణ్ శవం చుట్టుపక్కల సమగ్రంగా పరిశీలించి చూశాడు. కాని ఆధారాలేమీ కనిపించలేదు. టయోటా స్టార్టుచేసి శరత్ చెప్పిన గుర్తుగల యింటికి—శ్యామల వుంటున్న యింటికి—వెళ్ళాడు.

అది చిన్న పెంకుటిల్లు. దాదాపు శిధిలావస్థలో వున్నది. రెండే గదులున్నాయి. గోడలు సున్నం మొహంచూసి ఎన్నాళ్ళో అయినట్టుంది.

ముందు గదిలో కర్ర కుర్చీమీద కూర్చుని ఓ ముప్పయి-ముప్పయి అయిదేళ్ళ వ్యక్తి వీధివంకే చూస్తున్నాడు. కిరణ్ లోపలికి రావటంచూసి లేవబోయి మళ్ళీ కూచున్నాడు.

"ఎవరు కావాలండీ?" అన్నాడు కిరణ్‌వంక ఆశ్చర్యంగా చూస్తూ.

"ఈ యింట్లో శ్యామల అనే ఆమె వున్నారా?"

అతను కిరణ్‌వంక సూటిగా చూసి, "ఆమె మిమ్మల్ని యింత ఉదయమే రమ్మన్నదా?" అన్నాడు. అతని గొంతులో ఎలాటి భావమూ ప్రకటితం కాలేదు.

కిరణ్ ఆశ్చర్యాన్ని అణచుకుంటూ "ఆమెకి మీరేమవుతారో తెలుసుకోవచ్చా?" అన్నాడు.

అతను తల దించుకుని "ఆమె నా భార్య" అన్నాడు.

కిరణ్ ఉలిక్కిపడ్డాడు. "ఆమె ఎక్కడికి వెళ్ళారో తెలుసా?" అడిగాడు.

అతను తల అడ్డంగా తిప్పి, "తెలియదు. కాని, తెల్లారేసరికి వచ్చి తీర్తుంది. పోయిన రాత్రి ఎనిమిదిన్నరకు యిల్లువిడిచి వెళ్ళింది. ఇప్పటిదాకా రాలేదు. ఆమె గురించే చూస్తున్నాను." అన్నాడు.

"ఆమె ప్రతి రాత్రీ బయటికి వెళ్తారా?"

"ఒక్కోసారి యిక్కడికే మగవాళ్ళని తీసుకొస్తుంది."

"అంటే, మీకు ఆమె చేస్తున్నపని తెలుసా?"

"తెలుసు. ఆమె గురించి యిన్ని వివరాలడుగుతున్నారు మీ రెవరో తెలుసుకోవచ్చునా?"

"చెపుతాను. నా ప్రశ్నలకి దయచేసి సమాధానం చెప్పండి. మీకు తెలిసే ఆమెను 'అందుకు' ప్రోత్సహిస్తున్నారా?"

అతను వెంటనే మాట్లాడలేదు. "ఆమె నా అనుమతితోనే ఆ పని చేస్తోంది." అన్నాడు మెల్లగా.

కిరణ్ ఆశ్చర్యంతో అతనివంక పరిశీలనగా చూశాడు.

అతనికి రెండు కాళ్ళులేవు: మోకాళ్ళవరకు తీసివేయబడ్డాయి.

"నా కాళ్ళు చూశారా? ఏక్సిడెంట్లో పోయాయి. అంతక్రితం నేనో ప్రయివేటు కంపెనీలో పనిచేస్తుండేవాడ్ని. కాళ్ళు పోగానే పనీ పోయింది. బతకటానికి దారిలేదు. దాదాపు యిరవై రోజులు పస్తులతో కొనప్రాణాలతో బతికాం. చివరికి శ్యామల నన్ను పస్తులతో చంపలేక యీ దారి నెన్నుకుంది. ఆకలిబాధ మానావమానాల్ని చంపేసింది." అతను శూన్యంలోకి చూస్తున్నాడు.

కిరణ్‌కి జాలేసింది. ఎవర్ని బతికించుకోవాలని బలవంతాన యీ వృత్తి నెన్నుకున్నదో ఆ శ్యామల యిప్పుడు బతికిలేదు? నిజాన్ని భరించగలడా ఆతను?

"క్షమించండి. శ్యామల నెవరో చంపేశారు." అన్నాడు మెల్లిగా కిరణ్.

అతను ముందు నిర్ఘాంతపోయాడు. ఆ తర్వాత ఒక్కసారిగా ముఖాన్ని చేతుల్లో దాచుకుని వెక్కి వెక్కి ఏడ్చాడు. దుఃఖం తీరేవరకు అతన్ని ఏడవనిచ్చాడు కిరణ్.

"మీరు నాకు కొన్ని వివరాలు చెప్పాలి. నన్ను కిరణ్ అంటారు. ప్రయివేట్ డిటెక్టివ్‌ని."

"చెపుతాను సార్!....మిమ్మల్ని నిలబెట్టే మాట్లాడా నింతసేపు. కూచోవటానికి ఆ నులకమంచం తప్ప మరేం లేదు. దయచేసి అలా కూచోండి."

"ఫరవాలేదు చెప్పండి."

"శ్యామల నెవరు చంపారు? ఎక్కడుంది! ఆమెను నేను వెంటనే చూడాలి."

"అలాగే. మిమ్మల్ని నా కార్లో తీసుకెళ్తాను. ఆమెను హత్యచేసినవాడ్ని పట్టి ఇట్టానికి అప్పగిస్తాను. ఆమె కెవరైనా శత్రువు లున్నారా? ఆమెని చంపాల్సినంత అవసరం ఎవరికుంది? ఆమెని చంపటంవల్ల వాళ్ళ కేం లాభం? మీకు తెలిపిన వివరాలన్నీ చెప్పండి."

"నా పేరు మోహనరావు." అన్నాడతను. కిరణ్ తలూపాడు. "నాకో బావమరది వున్నాడు అతను శ్యామల కన్న చిన్నవాడు. శ్యామల యిలా వృత్తిచేస్తుందని విని పదిహేనురోజుల క్రితం ఆమెను కొట్టాడు వృత్తి మానక పోతే చంపుతానన్నాడు. శ్యామల పౌరుషపడి 'మా యిద్దర్నీ పోషించు. అలాగే మానేస్తాను' అన్నది అతను ఉక్రోషంతో వెళ్ళిపోయాడు. అతనికి ఉద్యోగంలేదు. ఇంటర్‌వరకు చదివి రోడ్లుపట్టుకు తిరుగుతున్నాడు. అతను చంపివుండొచ్చునేమో!"

కిరణ్ తలూపి, "ఇంకా....?" అన్నాడు.

"నాలుగు రోజుల కితం ఓ కిస్టమర్ శ్యామలను తన గదికి తీసుకువెళ్ళాడట. ఒక్కడినే అని చెప్పి తన స్నేహితులందర్నీ ఆమెపైకి వదిలాడట. శ్యామల అతని

మీద తిరగబడి, అతన్ని దుర్భాషలాడి, నీ తల్లో చెల్లో అయితే యిలాగే ప్రవర్తిస్తావా? అంటూ అతన్ని తిట్టి, వాళ్ళనుంచి తప్పించుకుని పారిపోయి వచ్చిందట. అతను ఆమెను పట్టుకోవాలని ప్రయత్నిస్తే నలుగుర్నోను పెట్టి, అతను తనమీద అత్యాచారం చేయబోతున్నాడని. తన వెంటపడి వేధిస్తున్నాడనీ చెప్పిందట. శ్యామల వృత్తి చేసుకునే స్త్రీ అంటే ఎవరూ నమ్మరు. ఆమె చెప్పింది అందరు నమ్మి. అతన్ని పట్టుకుని చితక్కొట్టారట. అప్పుడు సమయం రాత్రి తొమ్మిదిలోపే కావటంవల్ల రోడ్డుమీద జనం మసుల్తున్నారట. అతను తన్నులు తిని శ్యామలవంక గుర్రుగా చూపి 'నీ అంతు చూస్తా' అని బెదిరించి ఆటోలో పారిపోయాడట."

కిరణ్ శ్రద్ధగావిని, "అత నెవరో ఆమె చెప్పిందా?" అన్నాడు.

"వివరాలు తెలియవండీ. కాని, శ్యామల తను ఎక్కడికి వెళ్ళినదీ ఎవరెంత డబ్బిచ్చినదీ దాచకుండా చెప్తుంది. రామారావు పేటలో స్టూడెంట్సుంటున్న గదిలో అలా జరిగిందని చెప్పింది. వరసగా మూడుగదుల యిల్లు ఆరుగురు స్టూడెంట్సు తీసుకుని వుంటున్నారట. ఆ కుర్రాడు తనకన్న కూడా వయసులో చిన్నవాడని మాత్రం చెప్పినట్టు గుర్తు. పేరు చెప్పలేదు."

కిరణ్ తలూపి, "ఇంకా ఏమైనా చెపుతారా?" అనడిగాడు.

మోహనరావు రెండు క్షణాలేదో గుర్తుచేసుకోవటానికి ప్రయత్నించి, "ప్రస్తుతానికేం గుర్తురావటం లేదుసార్. గుర్తొస్తే చెపుతాను....దయచేసి నా శ్యామలను చూపించండి. ఆమె నాకోసమే నన్ను బతికించుకోవటం కోసమే,

తన ప్రాణాలు పోగొట్టుకున్నది. నన్ను తీసుకు వెళ్ళండి సార్, తీసుకు వెళ్ళండి." అంటూ మళ్ళీ ఏడవసాగాడు.

కిరణ్ కి కంటనీరు తిరిగింది.

"మీ బావమరది ఫోటో ఏదయినా వుందా?" అడిగాడు.

అతను గోడకు చేర్చిన ఊతకర్రలు తీసి చంకకు తగిలించుకుని ఆ గదిలో మూలగావున్న చెక్కపెట్టె దగ్గరకు వెళ్ళి ఫ్రేముకట్టని ఓ ఫోటోతీసి, కిరణ్ కందించాడు. "ఇందులో నా భార్యా, ఆమె తల్లి, తమ్ముడు వున్నారు. తల్లి యీమధ్యనే చనిపోయింది." అన్నాడు

కిరణ్ ఫోటోని జాగ్రత్తపరచి, "రండి, వెళదాం." అంటూ అతన్ని నడిపించుకుని టయోటా దగ్గరకు తీసుకు వెళ్ళాడు.

టయోటా మార్చ్యురీ వైపు దూసుకు పోయింది.

5

సార్జంటు శివాన్ని రామారావుపేట పంపించాడు కిరణ్. స్టూడెంట్సు మాత్రమే వున్న మూడు గదుల పోర్షన్ గురించి ఎంక్వయిరీ చేయమని పంపాడు.

అంతక్రితమే శరత్ బాబుని కలిసి శ్యామల తమ్ముడి ఫోటో చూపించాడు. హంతకుడు అతనేనా అని పోల్చమన్నాడు. శరత్ కాదన్నాడు. అతని కోలీగ్ అవతారం మీద కూడా ఓ కన్నేసి వుంచమని సార్జంటు రాజుని నియమించాడు కిరణ్. శివం వచ్చేలోపల పోస్టుమార్టం రిపోర్టు స్టడీ చేయసాగాడు కిరణ్.

"బ్రదర్, చెప్పటం మరిచాను. ఈ లాకెట్ శవం గుప్పిట్లో వుందట. పోస్టుమార్టం చేస్తూండగా కనిపించింది" అంటూ ఓ లాకెట్ కిరణ్ ముందు పెట్టాడు శ్రీనివాస్.

డబ్బున్న మగపిల్లలు విలాసంగా మెళ్ళో ధరించే పులి గోరు తాపటం చేసిన లాకెట్ గొలుసది! లాకెట్ వెనక జి. కె. అన్న యింగ్లీషు అక్షరా లున్నాయి.

"గుడ్! మన పరిశోధనకి ఓ ఆధారం దొరికింది." అన్నాడు కిరణ్ గొలుసు వంక పరీక్షగా చూస్తూ.

"పోస్టుమార్టం రిపోర్టులో మరో విషయం కూడా వున్నది శవం ఎడమచేయి గోళ్ళలో మాంసం పోగులు, ఎండిన రక్తం చిక్కుకుని వున్నాయనీ, అవి హంతకుడివి కావచ్చుననీ హంతకుడి ముఖంమీది చర్మపు పోగులు కావచ్చుననీ రాసి వున్నది అంటే హంతకుడి ముఖం మీద లోతైన గాయాలు కూడా మనకి కనిపించే అవకాశ మున్నది." అన్నాడు కిరణ్.

ఇంతలో సార్జంటు శివం వచ్చాడు.

"సార్, రామారావు పేటలో ఒకే ఒక యింట్లో ఆరు గురు స్టూడెంట్సున్నారు సార్. అది మూడు గదుల పోర్షన్. స్టూడెంట్సు పేర్లు కూడా రాసుకొచ్చాను. ప్రస్తుతం ఆ పోర్షన్ తాళం పెట్టబడి వున్నది." అంటూ పేర్లు రాసిన కాగితం కిరణ్ కందించాడు.

కిరణ్ పేర్లు చకచక చదివాడు. మాధవరావు, వినోద్, కశ్యప్. గోపాలక్రిష్ణ. గోవింద్, సతీష్.

"మిస్టర్ శ్రీనివాస్! గోపాలకృష్ణ హంతకుడు! ఈ లాకెట్ వెనకవున్న జి. కె. అన్న యింగ్లీషు పొడి అక్ష రాలు దాన్ని రుజావు చేస్తున్నాయి. గోపాలకృష్ణ ముఖం మీద శ్యామల చేసిన రక్కులు కూడా కనిపిస్తాయి. హరి యప్! అతనెక్కడున్నా అరెస్టు చేయించు." అన్నాడు కిరణ్.

* * *

గోపాలకృష్ణ నేరం ఒప్పుకున్నాడు. శరత్‌బాబు అతన్ని పోల్చాడు. అదీగాక అతని ముఖంమీద శ్యామల చేసిన రక్కులు, అతని లాకెట్ గొలుసు అతన్ని పట్టిచ్చాయి. శ్యామల గోళ్ళలో చిక్కిన మాంసపు పోగులు, రక్తం అతనివే నని రుజువయింది.

"శ్యామల పదిమందిలోను నన్ను అవమానపరచింది. కసి పెట్టుకున్నాను. ఆమె గాంధీపార్కు దగ్గిర ఎవరితోనో మాట్లాడటం, అతనితో అతని గదికి వెళ్ళటం చూశాను. ఆమె గదిలోనించి బయటికి రాగానే చంపెయ్యాలని అప్పటికప్పుడు ఓ కత్తి సంపాదించి ఆ గది సమీపంలో కాచుకుని వున్నాను. తెల్లవారుఝామువరకు అలాగే వేచి వున్నాను. ఆమె బయటికి రాగానే కత్తితో దొరికిన చోటల్లా పొడిచి పారిపోయాను." అంటూ తన స్టేట్‌మెంట్లో పేర్కొన్నాడు గోపాలకృష్ణ. □

తప్పు ఒప్పుకో...

సరసి



"మీరేస్థితిలో ఉండి మాట్లాడుతున్నారో నా కర్థం కావడంలేదు. పడిపోయేలాగ కనిపిస్తున్నప్పటికీ ఆ రాయి క్రిందికి దొర్లిపోయే అవకాశం ఎంత మాత్రమూ లేదని సీనియర్ ఇంజనీర్లు ధృవపరిచాకనే క్రింద క్వార్టర్సు కట్టించింది ప్రభుత్వం. ఇప్పుడు మీరొచ్చి ఆ రాయి క్రిందికి దొర్లిపోతుందనీ అరగంటలోనే దానికి ముహూర్తం వుందనీ చెప్తూంటే మేం ఏమనుకోవాలి? తమరు 'పెద్ద' జ్యోతిష శిఖామణులైనా అయ్యుండాలి, లేదా 'బార్' నించి సరాసరి పోలీస్‌స్టేషన్‌కి విచ్చేశానా ఉండాలి" అన్నాడు యస్ ఐ. వ్యంగ్యంగా పక్కనున్న కాన్‌స్టేబిల్‌కి కన్నుగీటి.

"నేను జ్యోతిషజ్ఞీకాను అలాగని బార్‌నించీ రావడం లేదు. నా మాట నమ్మండి తగిన రక్షణ చర్యలు తీసుకునే ఏర్పాటు చేయించండి." ప్రాధేయపడ్డాడు చక్రపాణి.

అతని మాటలకేం ప్రాధాన్యం ఇవ్వకుండా ఏదో రిపోర్టు రాసుకుపోతున్నాడు యస్సై తన ధోరణిలో.

"పోనీ మీకు నమ్మకం కలక్కపోతే మరో సంగతి కూడా చెప్తా. ఆ ప్రమాదంలో పెద్దగా ప్రాణనష్టం ఏమీ వుండదు. నలుగురు వ్యక్తులు స్వల్పంగా గాయపడతారు. మూడు మేకలు ఆ రాయికింద పడి చచ్చిపోతాయి!"

తలపైకెత్తి ఫక్కుమని నవ్వి వెంటనే ఆ యస్సై సీరియస్సైపోయి "వాటీస్ దిస్ మిస్టర్? అసలే సాల్వ్‌కాని కేసుల్తో మేము తల బద్దలు కొట్టుకు ఛస్తూంటే మధ్యలో కాలక్షేపానికి స్టేషనుకొచ్చి జోకులేస్తావేమిటి? ఆ బండ నిజంగా దొర్లడమంటూ జరిగితే ఎంతమంది పోతారో తెల్సా? హండ్రెడ్స్! వందలమంది ఛస్తారు! రెండు మేకలూ మూడు పిల్లులూ అంటావేమిటి?"

"ఎగ్జాక్ట్లీ కరెక్ట్! ఒకవేళ నా అంచనా తప్పయితే మీరన్నట్టు వందలాదిమంది చనిపోతారు. ఆ భయంతోనే ఇక్కడకొచ్చి మిమ్మల్ని రిక్వెస్ట్ చేస్తున్నాను తగిన రక్షణ చర్యలు తీసుకోమని!"

"చూడండి మిస్టర్! మీరు చెప్పినట్టే రాయి దొర్లడం సంభవిస్తే ప్రాణనష్టం కూడా మీరు చెప్పినట్టే జరుగుతుంది. మనం ప్రయత్నిస్తే మాత్రం ఆ నష్టాన్ని నివారించగలమా? మనం నిమిత్త మాత్రులం!" గీతలో కృష్ణుడిలా సెలవిచ్చాడా పోలీస్ అధికారి.

ఇంకా ఏదో చెప్పబోతున్న చక్రపాణిని వారిస్తూ "ఇంకేం చెప్పొద్దు. దయచేసి వెళ్ళి మీ పని చూసుకోండి. డోంట్ డిస్టర్బ్ మీ!" చిరాగ్గా అన్నాడు యస్సై - మెంటల్ కేసుతో తన సమయం వృధా కావడం ఇష్టంలేక.

నీరసంగా బైటకొచ్చాడు చక్రపాణి.

సరిగ్గా అతను చెప్పినట్టే అరగంట తర్వాత భూమి కంపించింది. గలగలా అల్లాడిపోయాయి పొడవాటి భవనాలు. ప్రజలంతా హాహాకారాలు చేస్తూ రోడ్లమీదికి పరుగులెట్టారు. కొండమీది బండరాయి పట్టుతప్పి వెనక పల్లంలోకి జారిపోయి పది అడుగుల క్రిందవున్న మరో రాయిని ఒరుసుకుని ఆగిపోయింది. ఆ రాళ్ళ రాపిడికి రెండు చిన్న బండలు 'ఫట్'మని పగిలి గాల్లోకి ఎగిరాయి. కొంచెం దూరంలో ఎత్తుగావున్న ఓ సురక్షిత ప్రదేశం నించి బండవంక దీక్షగా చూస్తున్న చక్రపాణి నుదురుకు అందులో ఒక రాయి ఎగిరొచ్చి బలంగా తగిలింది. అక్కడే కూలిపోయాడు చక్రపాణి "అమ్మా" అని ఓ పొలికేక వేసి.

2

"నగరంలో స్వల్పంగా భూకంపం! పంజా గుట్టమీది బండరాయి దొర్లి నలుగురికి స్వల్పంగా గాయాలు!" అని హెడ్డింగుతో వచ్చిన న్యూస్‌పేపర్‌ని బ్యాండేజీల మధ్య నించి చూస్తూ మందహాసం చేశాడు చక్రపాణి హాస్పిటల్‌లో.

అచ్చం 'మైత్రేయ' రాసిచ్చినట్టే వచ్చింది పేపర్లో!

సంవత్సరం క్రితం ఏదో ఆఫీసు పనిమీద బెంగుళూరు వెడుతున్న చక్రపాణికి రైల్లో పరిచయమయ్యాడు మైత్రేయ. ఒకే ఊరి వారవ్వడం వలనా ఇద్దరి భావాలకీ పొంతన ఉండడం వలనా ఆ పరిచయం క్రమంగా స్నేహంగా మారింది తర్వాత.

మైత్రేయ అందరిలాంటి వ్యక్తికాదు. అతనిలో ఓ అద్భుతమైన శక్తివుంది అది 'శక్తి'కాదు 'విద్య' అంటారు చాలామంది. కొంతమంది 'కళ' అంటారు. మైత్రేయ నడిగితే "ఏమో నాకే తెలియదు అదేమిటో!" అంటాడు మాటమార్చి.

భవిష్యత్తు అతని కళ్ళకు కట్టినట్టు కనిపిస్తుంది. రాబోయే సంఘటనల నతడు ముందుగానే పసిగట్టగలడు. 'భవిష్యత్తు చెప్పబడును' అని బోర్డు పెట్టుకుని కూర్చో లేదతను. జాతకాలూ, హస్త సాముద్రికాలూ అంటే తెలియదతనికి.

తనకి తెలిసిన విద్యను ప్రజలముందు ప్రదర్శించడానికి అతడొక పద్ధతి రూపొందించుకున్నాడు.

మర్నాడుగాని, కొద్దిరోజుల తర్వాతగాని ఫలానా తేదీ నాడు ఫలానా దినపత్రికలో ఫలానావార్త ఏ విధంగా ప్రచురించబడుతుందో అక్షరం కూడా పొల్లుపోకుండా

ఖచ్చితంగా చెబుతాడు. ముందుగా ఓ కాగితం మీద ఆ వార్త వ్రాసి కవర్‌లోపెట్టి సీల్‌చేసి ఇస్తాడు. ఆ కవరు మన దగ్గరుంచుకొని అతడు చెప్పిన రోజున న్యూస్‌పేపర్ ముందుంచుకుని అందరి సమక్షంలో ఆ కవరువిప్పి చూస్తే అక్షరం తేడా లేకుండా యధాతధంగా అతడు రాసినట్టే ఉంటుందా పత్రికలో.

అదీ అతని ప్రత్యేకత!

అనేక కార్యక్రమాలలో, ఉత్సవాలలో ఈ ప్రదర్శన ఇచ్చి ప్రముఖుల ప్రశంసలే కాక ప్రభుత్వం తరపున కూడా ఎన్నోసార్లు బహుమతులందుకున్నాడు మైత్రేయ.

పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్‌పార్టీ అత్యధిక మెజారిటీతో విజయం సాధిస్తుందనీ, 'గాంధీ' సినిమాకి 'ఆస్కార్' అవార్డు లభిస్తుందనీ, అజరుద్దీన్ వరసగా మూడు టెస్ట్ క్రికెట్ సెంచరీలు చేస్తాడనీ ముందుగానే ఊహించి కాగితంపై రాసి ఆ కవరు సీలుచేసి ఇచ్చి ఆయా తేదీల వార్తాపత్రికల హెడ్డింగులతో తను రాసిచ్చినవి సరిగ్గా వున్నట్లు నిరూపించుకుని అందరి మెప్పుల నందుకున్నాడతను.

జరగబోయే సంఘటనలు అతనికి ముందుగా తెలిసినప్పటికీ వాటిని వారించే ప్రయత్నంగానీ, ముందుగా ఎవరికైనా తెలియజేయడంగాని అతడెన్నడూ చేయలేదు. 'అలా చేయకూడదు కూడా' అంటాడతను.

చక్రపాణి, మైత్రేయల స్నేహబంధం చెప్పుకోదగ్గది. దాదాపు అన్ని కార్యక్రమాలకి మైత్రేయతోబాటు హాజరవుతూంటాడు చక్రపాణి కూడా. కొన్ని సంఘాలవారు మైత్రేయతోబాటు చక్రపాణిని కూడా సన్మానించారు మైత్రేయ సన్నిహితుడైనందుకు.

ఒకసారి మైత్రేయ సింగపూర్‌లో ప్రదర్శన ఇవ్వడానికి వెడుతూ తను వచ్చేవరకూ చక్రపాణికి కాలక్షేపంగా ఉంటుందని రెండు సీలువేసిన కవర్లిచ్చి వాటిని ఏ ఏ తేదీలలో తెరవాలో వాటిమీదే నోట్ చేశాడు.

ఒక కవరు మరునాడు తెరవాల్సి వుండగా చక్రపాణి మనసులో ఓ ఆలోచన వచ్చింది. "ఈ రోజే ఆ కవరు తెరిచి ఎందుకు చూడకూడదూ? చూస్తే జరగబోయే ఆ సంఘటన ఏదో ఈరోజే ముందుగా తెలుసుకోవచ్చుగదా!" అని. ఆ ఆలోచన రాగానే క్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా ఆ కవర్ని తెరిచి చూశాడు.

మర్నాడు ఫలానా పేపర్లో పంజాగుట్టవద్ద జరగేరాయి ప్రమాదం గురించి వార్త రాసుంది.

దానిలో సమయం, ప్రమాదం తాలూకు వివరాలూ పూర్తిగా ఇచ్చాడు మైత్రేయ.

జరగబోయే ప్రమాదం ముందుగానే తెలిశాక ఇంక తటస్థంగా ఉండలేకపోయాడు చక్రపాణి. వెంటనే పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి ఆ దుర్ఘటన జరక్కుండా చూడమని శత విధాల అభ్యర్థించాడు.

ఫలితం—అతడొక పిచ్చివాడుగా జమకట్టబడ్డాడు.

జరగబోయే దుర్ఘటన ముందుగా తెల్సినప్పటికీ దానిని నివారించలేకపోయాడు సరికదా గాయాలు తగిలిన నలుగురిలో తనూ ఒకడయ్యాడు.

శారీరకంగా స్వస్థత చేకూరింది. అయితే మనసు మాత్రం నిలవనివ్వడంలేదు చక్రపాణిని. రెండో కవరు కూడా తెరవాలి! అందులో ఏం రాశాడో చూడాలి!!

ఆ కవర్లో ఇలా వుంది:-

14 వ తేదీ ఆంధ్రజ్యోతి రెండవ పేజీలో ఈ విధంగా

వార్త ప్రచురించబడుతుంది.

"ప్రాచీన శిలా శాసనం లభ్యం"

అహోబిలం, మార్చి 13:- పురాతత్వ శాఖవారు నిర్వహిస్తున్న త్రవ్వకాలలో నిన్నటిరోజున అహోబిలంలో క్రీ.శ. 1510 వ సం॥రం నాటి విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు చెక్కించిన ఒక శిలా శాసనం బయల్పడింది ఈ శాసనంలో రాయలవారు నిర్వహించిన దండయాత్రలు, వారి రచనల గురించి వివరంగా ఇవ్వబడినది. ఈ శాసనం కొంతభాగం శిథిలమైనప్పటికీ మిగిలిన భాగంలోని తెలుగు లిపి స్పష్టంగా ఉన్నందున రాయల కాలంనాటి పరిస్థితుల అవగాహన కిది ఎంతగానో దోహదం చేస్తుందని చారిత్రక పరిశోధకులు భావిస్తున్నారు."

చక్రపాణి ఆఫీసుకు సెలవుపెట్టి 12 వ తేదీ ఉదయానికి అహోబిలం చేరుకున్నాడు.

ఆ రోజు సాయంత్రం అనుకున్న విధంగానే శిలా శాసనం ఒకటి బయటపడింది.

కాని అది 1510 సం॥రం నాటిది కాదు. శ్రీకృష్ణదేవరాయలు చెక్కించింది అసలేకాదు.

క్రీ.శ. 1311 వ సం॥రంలో కాకతీయ చక్రవర్తి రెండవ ప్రతాపరుద్రుడు కంపిలిపై చేసిన దండయాత్ర వివరాలూ, జంబుకేశ్వరాన్ని దర్శించిన విషయాలూ స్పష్టంగా ఉన్నాయా శాసనంలో.

కంగుతిన్నాడు చక్రపాణి. ఆ రాత్రే బయలుదేరాడింటికి. మైత్రేయ రాసిచ్చింది అబద్ధం ఎందుకయిందో అర్థం కాలేదతనికి.

ఇంటికి చేరి మైత్రేయ రాసిచ్చింది మరోసారి చూశాడు. "కృష్ణదేవరాయలు చెక్కించిన శిలాశాసనం" అనే వుంది

అందులో.

కాగితాన్ని అటూ ఇటూ తిప్పిచూశాడు. వెనకాల చిన్న అక్షరాలతో ఇలా రాసివుంది.

"డియర్ చక్రం,

కాల గమనానికి, ఆ గమనంలో వచ్చే మార్పులకి సంకెళ్ళు వెయ్యడం ఎవరి తరం? మూర్ఖంగా ఎవరైనా అందుకు ప్రయత్నిస్తే భంగపడడం తప్ప ఏం మిగులుతుంది? నువ్వు ఈ పిచ్చిపని చేస్తావని తెలిసే నేను నిజం కాని ఓ విషయాన్ని రాసిచ్చాను.

పంజాగుట్ట దుర్ఘటన విషయం ముందుగా బయట పెట్టినందుకు నీకు జరిగిన సన్మానం దృష్టిలో ఉంచుకుని కాలగతుల్ని ముందుగా తెలుసుకోవాలనే ప్రయత్నాలని ఇక ముందు చెయ్యకు. అవి ప్రయత్నిస్తేనో కృషిచేస్తేనో తెలిసేవి కావు.

ఇట్లు
నీ శ్రేయోభిలాషి
మైత్రేయ"

3

తెల తెల వారుతోంది.

పారిపోయే చీకటిని తరుముకెడుతున్నట్లు చెట్లమీది పక్షులన్నీ గుంపులు గుంపులుగా తలో దిక్కుకూ పరుగు లెడుతున్నాయి.

కాలింగ్‌బెల్ మోతకి చిరాగ్గాలేచి, వెళ్ళి తలుపు తీశాడు చక్రపాణి.

ఎదురుగా నిలబడ్డ వ్యక్తుల్ని చూసేసరికి అంతవరకూ ఉన్న నిద్రమత్తు కాస్తా వదిలిపోయింది.

"బేడ్ మోణింగ్ మిస్టర్ చక్రపాణీ! మిమ్మల్ని అరెస్ట్

చేస్తున్నాం! ఇదిగో వారెంట్!!"

"అరెస్టా? ఎందుకు?"

"పకడ్బందీగా ఓ హత్యా కార్యక్రమాన్ని నిర్వహించినందుకు."

"హత్యా?"

"యస్! మీ స్నేహితుడు మైత్రేయని తమరు భవబంధ విముక్తుణ్ణి చేసినందుకు మీకు సంకెళ్ళు వేసే భాగ్యం మాకు కలిగింది."

"వ్వాట్? మైత్రేయ హత్య చెయ్యబడ్డాడా? ఎప్పుడూ?" నోరు తెరిచి అలాగే ఉండిపోయాడు చక్రపాణి

"గుడ్! చక్కటి నటన! తడిగుడ్డతో గొంతులు కొయ్యడంలోనేకాదు అమాయకులుగా నటించడంలో కూడ తమరు సిద్ధహస్తుల్లా వున్నారు" అన్నాడు ఇన్స్పెక్టర్ శతభిషం.

"మైత్రేయని నేను హత్య చేశానా? దిసీజ్ హైలీ ఇడియాటిక్!" ఆక్రోశించాడు చక్రపాణి.

వాకిట్లో జరిగే హడావుడికి పెరట్లోంచి వచ్చిన చక్రపాణి భార్య అర్చనకి మైత్రేయ హత్య గురించి టూకీగా చెప్పి చక్రపాణిని బేడీలు తగిలించి జీపులో తీసికెళ్ళిపోయారు పోలీసులు.

స్థాణువులా నిలబడిపోయింది అర్చన.

4

ఎన్నడూ లేనంతమంది జనంతో కిటకిట లాడిపోతోంది పరంజ్యోతి మెమోరియల్ హాల్. చోటు చాలక జనం హాలుబయట కూడా గుంపులు గుంపులుగా చేరి చర్చించుకుంటున్నారు మైత్రేయ గురించి.

మైత్రేయ ఆఖరుసారిగా పరంజ్యోతి క్లబ్ వారికి

రాసిచ్చిన సీల్డుకవరు ఆ రోజు అందరి సమక్షంలో తెరు స్తున్నట్లు అంతకు ముందురోజు పేపర్లో ప్రకటన ఇచ్చారు.

అందరూ ఆత్రంగా చూస్తున్నారు స్టేజివైపు. అంతకు మూడు రోజుల క్రితమే మైత్రేయ హత్యచేయబడ్డాడు.

"తన హత్య తాను ముందుగానే ఊహించగలిగేడా? ఊహించి ఉంటే తప్పించుకునే ప్రయత్నం చేసి ఉండే వాడు కదా! ఎవ్వరూ తెలిసుండి మృత్యువును కౌగలించు కోరు! బహుశా అతడు తన చావును ముందుగా తెలుసుకో లేక పోయాడు!!"

"అదేం కాదు! అతడు తన మృత్యువయ్యేది ఏదయ్యేది భయపడే రకం కాదు! చూస్తూ ఉండు హంతకుడి పేరుతో సహా మొత్తం రాసుంటాడా కవర్లో!"

రక రకాలుగా మాట్లాడుకుంటున్నారు జనం.

ఇంతలో అలజడి పెరిగింది. నలుగురు క్లబ్ మెంబర్లు స్టేజి ఎక్కి "అంతా నిశ్శబ్దంగా ఉండాలి" అని హెచ్చరిం చారు. ఒక సీలువేసిన కవర్ని అందరికీ ఎత్తి చూపించి మెల్లిగా చించి ఓ కాగితం బయటకు తీసి మైకుదగ్గర బిగ్గ రగా చదివేడు అందులోని ఒక వ్యక్తి.

ఈ నెల 22 వ తేదీ రాత్రి పదిగంటల ప్రాంతంలో నేను అంతిమ శ్వాస విడుస్తాను. నా స్నేహితుడు చక్ర పాణే నా పాలిట మృత్యు దేవతగా మారి నా ప్రాణం తీస్తాడు. నయవంచన చేసిన ఆ కృతఘ్నుణ్ణి, చట్టంగాని, ప్రజలుగాని క్షమించరు.

ఇట్లు—మైత్రేయ."

జనం గట్టిగా హాహాకారాలు చేశారు. కొంతమంది మైత్రేయకి జేజేలు పలికారు. మరికొంతమంది అతని

మేధాశక్తికి నివాళు లర్పించారు. తర్వాత అందరూ ముక్త కంఠంతో "చక్రపాణీ ముర్దాబాద్! చక్రపాణిని ఉరి తియ్యాలి!" అంటూ పెంకు లదిరేలాగా నినాదా లిచ్చారు.

5

"ఈ విశాల విశ్వంలో నేనొక చిన్న జీవినండీ! అందరూ 'చిరంజీవి' అంటారండి! మా డిటెక్టివ్‌గారైతే ముద్దుగా 'రంజీ' అని పిలుస్తారండి! ఇకపోతే—డిటెక్టివ్‌గారు లోపల సంధ్యావందనం చేసుకుంటున్నారు. ఈలోగా మీరు ఏం పనిమీద వచ్చారో చెబితే వారికి రాగానే బ్రీఫ్‌గా వివరిస్తాను. అందువల్ల వారి సమయం కలిసొస్తుంది. ఏమంటారు!" అన్నాడొక పాతికేళ్ళ యువకుడు ఎదురుగా కూర్చున్న యువతి నుద్దేశించి.

ఆమె హ్యాండ్ బ్యాగ్‌లోంచి కర్చీఫ్ తీసి కళ్ళొత్తుకుంది.

రెండు నిమిషాలు మౌనంగా రోదించి "నిజంగా భగవంతుడనే వాడుంటే...." అంటూ ఏదో చెప్పబోతూ కళ్ళ మీద నించి జేబురుమాలు తీసి తలెత్తి చూసేసరికి ఎదురుగా ఓ దివ్యపురుషుడు—ఆరడుగుల పొడగరి, ఎర్రటి పట్టు పంచె, మెడలో రుద్రాక్షలూ, భుజంపై హరేరామ హరే కృష్ణ ఖండువా, నుదుటపై దట్టమైన విభూతి రేఖలూ, అభయహస్తంతో ప్రత్యక్షమయ్యాడు.

ఆమె అప్రయత్నంగా లేచి రెండు చేతులూ జోడించింది ఏదో అనిర్వచనీయమైన అనుభూతితో.

"వారేనమ్మా డిటెక్టివ్ దీక్షితులుగారు!" అంటూ లేచి నుంచున్నాడు చిరంజీవి చిరునవ్వుతో.

ఆ క్షణంలో ఆతనిలో తన కష్టాలు కడతేర్చే భగవంతుడే కనిపించాడామెకు. వెంటనే సాష్టాంగ ప్రణామం

చేపింది మనఃపూర్వకంగా.

"దీర్ఘ సుమంగళీభవః" వార్తలు చదివే అద్దంకి మన్నార్ లాగా వుంది అతని గొంతు.

"ఆ ఆశీర్వాదంకోసమే మిమ్మల్ని వెతుక్కుంటూ వచ్చాను" అంటూ కళ్ళు తుడుచుకుని లేచి కుర్చీలో కూర్చుంది డిటెక్టివ్‌ల కెదురుగా.

"నా పేరు అర్చన. చక్రపాణిగారి భార్యని."

మందహాసం చేశాడు డిటెక్టివ్. తర్వాత ఆమె చెప్పిన కథంతా విన్నాడు ఓపిగ్గా.

"22వ తేదీ రాత్రి మైత్రేయ హత్య చెయ్యబడ్డారు. మా వారిమీద తప్పుడుకేసు బనాయించి వారిని అరెస్టుచేసి తీసికెళ్ళారు. నిజానికి మావారు నిర్దోషి. ఆ రాత్రి అంతా ఆయన ఇంట్లోనే వున్నారు. నన్ను విడిచి ఒక్క క్షణం కూడా బయటకు వెళ్ళలేదు అలాంటప్పుడు ఆ రాత్రి ఆయన స్వయంగా వెళ్ళి ఆ హత్యచేశారనడం ఏం సబబు?" ఆమె గొంతు బొంగురుపోయింది.

"రాత్రంతా మీవారు మీతోనే వున్నారని మీరు ఋజువు చేసుకోగలరా? ఒక్క క్షణం కూడా ఒకర్ని విడిచి ఒకరు!" ఇంకా ఏదో అడగబోతున్న చిరంజీవికేసి దీక్షితులు తీక్షణంగా చూసేసరికి అతడు తగ్గిపోయాడు.

చిరంజీవి బ్రహ్మచారి. ఇటువంటి ప్రశ్నలు వెయ్యటం అతనికో సరదా.

ఆమె చెప్పిందంతా విని అన్నాడు దీక్షితులు "నువ్వు చెప్పినట్టు నిజంగా మీ ఆయన నిర్దోషి అయితే రక్షించబడ్డాడనే అనుకోమ్మా! ఈ దీక్షితులు పట్టిన ఏ కేసులోనూ నిర్దోషి కన్యాయం జరగదు. అలానే దోషి కూడా తప్పిం

చుకోలేదు. నీ అడ్రసు ఇచ్చి వెళ్ళు."

"మీ అడ్వాన్సు" అంటూ అయిదు వందనోట్లు టేబిల్ మీద పెట్టి చేతులు జోడించి వెళ్ళిపోయింది అర్చన.

6

ఇన్స్పెక్టర్ శతభిషం కేసు విషయాలన్నీ వివరంగా చెప్పాడు దీక్షితులుకి.

"23 ఉదయం తెలతెలవారుతుండగా ఇసకబండి తోలుకుంటూ వస్తున్న ఓ కూలి సర్వీచెట్ల మధ్య ఓ శవం బోర్లా పడి వుందనీ ఇసకలో మొహం కూరుకుపోయి వుందనీ వచ్చి రిపోర్ట్ చేశాడు.

హుటాహుటిన నేను నలుగురు కానిస్టేబిల్స్ని వెంట బెట్టుకుని వెళ్ళాను. ఫోటోలు తీశాక శవాన్ని పక్కకు దొర్లించి చూస్తే యింకేవుంది! 'మైత్రేయ'. నా మటుక్కు నేను చాలా బాధపడ్డాను—అంతటి గొప్ప మేధావిని ఎంతో భవిష్యత్తు వున్నవాణ్ణి ఎవరో పొట్టన బెట్టుకున్నందుకు.

శవం బాగా నల్లగా మారిపోయింది. ఇదేదో విష ప్రయోగం అయివుంటుందనీ, శవం పడివున్న పరిస్థితి చూస్తే తప్పకుండా హత్యే అయివుంటుందని అనుమానించాను. నా అనుమానాలు మరింత గట్టిపడేలాగా అతని కాళ్ళదగ్గిర ఒక తాళం చెవుల గుత్తి సగం ఇసకలో కప్పబడి వుండడం చూశాను. దానికుండే ప్లాస్టిక్ ప్లేట్ మీద "ఎస్. చక్రపాణి" అని గోల్డ్ లెటర్స్లో ప్రింటు చెయ్యబడి వుంది.

తర్వాత ఎంక్వయిరీ చేశాం. ఎప్పటిలాగే ఆరోజు సాయంత్రం కూడా మైత్రేయతోబాటు చక్రపాణి కామత్ హోటల్లో చాలాసేపు కూర్చున్నాడట. ఆఖరిసారి అతనితో కలిసున్న వ్యక్తి చక్రపాణే. ఈ బలమైన ఆధారాలే అతడ్ని

పట్టిచ్చాయి."

"మిస్టర్ శతభిషం! పోస్టుమార్టం రిపోర్ట్‌లో ఏం తేలిందీ?"

"నా అనుమానం నిజమైంది. సైనేడ్ పూసిన సూదితో గుచ్చి చంపేడతన్ని."

"హత్యాయుధం.... ఐ మీన్ ఆ సూది దొరికిందా?"

"లేదు."

"హత్య ఎన్ని గంటలకి జరిగుంటుంది?"

"రాత్రి పదిగంటల ప్రాంతంలో జరిగిందని చెప్పాడు డాక్టరు."

"తాళంచెవుల గుత్తిమీద వేలిముద్రల కోసం ప్రయత్నం చేశారా?"

"ఇసకలో కూరుకుపోవడం వలన ఆ ఆధారం కూడా లేకుండా పోయింది."

"ఏదీ ఒకసారి చూడవచ్చా?"

"తప్పకుండా" అంటూ శతభిషం డ్రాయరు సొరుగు లోంచి తాళంచెవుల గుత్తి ఒకటితీసి దీక్షితుల కందించాడు. పరిశీలనగా చూశాడు డిటెక్టివ్.

అక్షరాలు బాగా మెరుస్తున్నాయి. అంటే కొత్తగా ప్రింటు చేయించినదై ఉండాలి. లేదా చాలా కాలం క్రితమే ప్రింటు చేయబడి ఉపయోగించకుండా ఉండాలి. దీక్షితులు మెదడుకి ఏదో ఆలోచనతట్టింది.

"మిస్టర్ శతభిషం! ఒకసారి ఈ కీ చైన్ నావెంట తీసుకెళ్ళడానికి అనుమతినిస్తారా?"

శతభిషం అంగీకారంతో వాటిని, జేబులో వేసుకుని బైటకొచ్చాడు దీక్షితులు.

"మిత్రుడు పోయినందుకు నేను విచారిస్తూంటే అతన్ని నేనే చంపానని లోకం వేలెత్తి చూపుతోంది. ఇది నాకు

మరింత బాధను కలగజేస్తోంది సార్" అన్నాడు కటకటాల వెనక కళ్ళలో కన్నీళ్ళు నింపుకున్న చక్రపాణి.

"పరిస్థితుల ప్రభావం మిస్టర్ చక్రపాణీ! ఆ రోజు సాయంత్రం మీరు మైత్రేయని ఎక్కడ కలిశారు?"

"మేము సాధారణంగా ప్రతీసాయంత్రం కామత్ హోటల్‌వద్ద కలుస్తూంటాం. ఆ రోజుకూడా రాత్రి ఎనిమిది గంటలవరకూ అక్కడేవున్నాం ఇద్దరం. నేనువచ్చేశాక అత డెక్కడకి వెళ్ళిందీ తెలియదు. నేను సరాసరి ఇంటికి వచ్చి సుమారు పదిగంటల ప్రాంతంలో నిద్ర కుపక్రమించాను."

"మీరెప్పుడైనా మీ స్కూటర్ మైత్రేయ కిస్తూంటారా?"

"ఎప్పుడూ ఆ అవసరం రాలేదు. కాకపోతే ఇద్దరం నా స్కూటర్‌మీద కలసివెళ్ళేవాళ్ళం."

"హత్య జరిగినరోజు మీ స్కూటర్ ఎక్కడుంది?"

"నా దగ్గరేవుంది."

"మైత్రేయ వెళ్ళిపోయాక మీరింటికి వెళ్ళిపోయి మరి ఎక్కడకీ వెళ్ళలేదంటున్నారు. స్కూటర్ కూడా అతని కివ్వలేదని చెబుతున్నారు. మరి మీ స్కూటర్ తాళాలు హతుడి సమీపంలో ఎలా లభించాయి?" అంటూ జేబు లోంచి కీచైన్ ఒకటి తీసి చూపిస్తూ అడిగేడు దీక్షితులు.

"ఎలా చేరాయో నాకు తెలియదు....ఏదీ ఇలా చూపిం చండి....ఈ కీచైన్ నాదికాదు. ఈ మోడల్‌లో పేరు చెక్కిన ప్లాస్టిక్ ప్లేట్ అసలు నాకు లేనేలేదు. స్కూటరు తాళాలు మాత్రం నావే. నా స్కూటర్ తాళాలు పదిరోజుల క్రితం కామత్ హోటల్‌వద్ద పార్కుచేసి ఉండగా ఎవరో దొంగిలించారు. ప్రస్తుతం నేను డూప్లికేట్ కీస్ వాడు తున్నాను."

"ఐసీ! తాళంచెవులు మీవి. నేమ్‌ప్లేట్ మాత్రం మీది

కాదు. అవునా?"

"అవును ఎవరో నన్ను ఈ కేసులో ఇరికించడానికి ఇదంతా చేశారని నా అనుమానం."

"పోనీ ఆ అవకాశం ఎవరికుందో చెప్పగలరా?"

"నాకుతెలియదు. నేనుమాత్రం ఈ హత్యచేయ్యలేదు."

"నిన్న పరంజ్యోతి క్లబ్‌వారు మైత్రేయ రాపిచ్చిన ఆఖరి కవరు ఓపెన్‌చేసి చూస్తే అందులో మీరే అతన్ని హత్యచేసినట్లు స్పష్టంగా రాసుంది. దీన్నిబట్టి అయినా మీరు మీ నేరం ఒప్పుకోవాల్సి వుంటుంది. అవునంటారా?"

"చూడండి డిటెక్టివ్‌గారూ! దీని వెనక తప్పకుండా ఒక కుట్ర వుందని చెప్పడానికి ఆ కవరే ఒక పెద్ద సాక్ష్యం. ఎందుకంటారా? ఇంతవరకూ మైత్రేయ రాపిచ్చిన ఏ వాక్యం అబద్ధం కాలేదు. అతడు ఊహించి రాపిన ప్రతి వాక్యం నిజమయి తీరింది. ఆ సీలువేసిన కవరూ, అందులోని వార్త మైత్రేయ రాపిచ్చినవి ఎంతమాత్రమూ కావు. ఎందుకంటే—అది నిజంగా మైత్రేయ రాసుంటే అందులో హంతకుడి పేరు నాది కాక ఎవరిదో వుండి వుండేది. ఎందుకంటే హత్యచేసింది నేను కాదు కాబట్టి. హంతకుణ్ణి నేను కాదని నాకు తెలుసు. ఆ రాత్రి నాతో గడపిన నా భార్యకు తెలుసు.

మరో విషయం ఏమిటంటే—ఈ పథకం వేసిన వ్యక్తులు ఒకచోట పప్పులో కాలేశారు. మైత్రేయ ఎప్పుడు చెప్పినా పత్రికలలో వచ్చే వార్తలనే చెప్పాడు. జ్యోతిష్కుడిలాగా జరగబోయే సంఘటనలని కథలలాగా ఎప్పుడు చెప్పలేదు. వాళ్ళు తెరిచి చూపించిన కవర్లోని వార్త ఏ తేదీదో, ఏ వార్తా పత్రికదో మైత్రేయ వ్రాయలేదు.

అతనిలాగా అక్షరం పొల్లుపోకుండా వార్త ఊహించి

రాయలేని ఆ వ్యక్తులు తమ కిష్టం వచ్చినట్టు సంఘటన గురించి రాపి తాము మైత్రేయని ఎ సమయంలో చంపిందీ వారంతట వారే బయట పెట్టుకున్నారు. కాబట్టి నిందితుల్ని పట్టుకోవడానికి ఆ కవరే పెద్ద ఆధారం. నా నిర్దోషిత్వం బయటపడడానికి మైత్రేయ పేరిట తెరువబడిన ఆ కవరే పెద్ద క్లూ!" అన్నాడు చక్రపాణి.

7

ఉదయం పదిగంటలైంది.

దేశమందరికీ తెల్లారినా ఆ కాంపౌండ్ లో వారికి మాత్రం ఇంకా తెల్లవారినట్టు లేదు. ముసుగులు తన్ని పడుకున్నా రందరూ చిందరవందరగా.

చిరంజీవి స్కూటరొచ్చి ఆగింది ఓచోట. అతడు వెల్లిగా దిగి అక్కడ బడ్డీమీద నిద్రపోతున్న వ్యక్తిని తట్టిలేపాడు.

"ఎవడివయ్యా నువ్వు పొద్దున్నే పనీపాట లేకండా. చీకటిపడ్డాక రా. రాత్రిపూటే మా బిజినెస్సు ఎల్లెల్లు."

"ఇదిగో చూడు వీరభద్రం!...." అవతలివాడి పేరు తెలియనప్పుడు తన నోటికొచ్చిన ఏదో పేరుతో పిలిచి పని జరిపెయ్యడం చిరంజీవి కలవాటు.

తనదికాని పేరుతో పిలుస్తూ తట్టి లేపుతున్న వ్యక్తిమీద విరుచుకు పడ్డాడు నిద్రలో వ్యక్తి. లేస్తూనే చిరంజీవి చేతిలో వున్న ఇరవై కాగితం చూపి పైలంటయిపోయి "అయ్యా మీకేం కావాలి?" అనే స్థితి కెదిగాడు.

అది ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ కాంపౌండు.

"మీ దగ్గర కీచైనుమీద పేరు ప్రింటుచేయమని ఆర్డ రిచ్చే కష్టమర్లు తమ పేరు కాగితంమీద రాపిస్తారుకదా! అలా రాపిచ్చిన కాగితాలు, పుస్తకాలూ ఓసారి చూడాలి పట్రా" అన్నాడు చిరంజీవి ఓ కాలు కొట్టుమెట్టుమీదవేసి.

ఇదేదో పోలీసు వ్యవహారం అని అనుమానం వచ్చి కొట్టులోపలికి దూరి మూడు చిత్తుపుస్తకాలు తెచ్చి చిరంజీవి కందించాడు.

ఓ పావుగంటసేపు పేరుపేరునా ప్రతి పేజీ చూసిచూసి ఒకచోట ఆగిపోయి "అవుచ్!" అని గట్టిగా కేకపెట్టాడు. తర్వాత ఓసారి కళ్ళు చిన్నవిచేసి మళ్ళీ పెద్దవిచేసి "దొరికింది గురో దొరికింది" అన్నాడు ప్రకాశంగా.

"ఏంటి సార్?" అన్నాడు కొట్టువాడు భయపడి.

"నీ కిరవై రూపాయలు!" అని ఆ నోటు వాడి చేతిలో కుక్కి ఆ కాగితం మీద తేదీ వేసుకుని పుస్తకంలోంచి చింపి మడతపెట్టి జేబులో వేసుకున్నాడు చిరంజీవి.

"సాధారణంగా పేరు రాసిమ్మని షాపువాడు అడగ్గానే హడావుడిగా కలిపిరాతలో రాసేస్తారు. ఆ తర్వాత కాపిటల్ లెటర్స్‌లో రాసిమ్మని షాపువాడు అడిగితే మళ్ళీ విడి అక్షరాలలో పేరు రాస్తారు కస్టమర్లు. అందువల్లే "యస్. చక్రపాణి" అని రెండువిధాలగానూ రాసిచ్చాడు గురుడు. మన డిటెక్షన్‌కి మార్గం సుగమంచేస్తూ" అన్నాడు చిరంజీవి చేటంత మొహం చేసుకుని దీక్షితులుతో.

"వెల్‌డన్ రంజీ" మెచ్చుకోలుగా చూశాడు డిటెక్టివ్.

"కాకపోతే మరేంటి సార్! సిటీలో అయిదారు షాపులు చచ్చి చెడి తిరిగేక గాని నాకు లైటు వెలగలేదు ఎగ్జిబిషన్‌లో ట్రై చెయ్యాలని."

"సరే! క్లబ్ మెంబర్స్ నలుగురి అడ్రసులు దొరికాయి. వాళ్ళందరి దగ్గరా క్లబ్ ఆఫీసు తాళంచెవులు డూప్లికేట్ వుంటాయి కాబట్టి ఆ నలుగురిలో ఎవరికైనా మైత్రేయ రాసిచ్చిన అసలు కవరు మాయంచేసి దాని స్థానంలో వేరే కవరుపెట్టే అవకాశం వుంటుంది. వాళ్ళందరి చేతిరాతలు

సంపాదించడంతోబాటు వారిలో మైత్రేయకిగాని. చక్రపాణికి గాని విరోధులున్నారేమో తెలుసుకోవాలి. క్లబ్ వాళ్ల అందరి సమక్షంలోనూ ఓపెన్ చేసిన కవర్‌లోని చేతిరాత మైత్రేయ చేతిరాత ఒక్కలాగే వున్నాయి. హంతకుడా విషయంలో జాగ్రత్తపడ్డాడు. అతడి చేతిరాత బాగానే వుందిగాని నుదుటిరాత బాగాలేదు" అన్నాడు దీక్షితులు చేతిలోని కాగితం వంక దీక్షగా చూస్తూ.

8

గదిలో డిమ్ముగా వెలుగుతోంది బెడ్‌లైటు.

గోడగడియారం పదిన్నర గంట కొట్టింది.

డబుల్‌కాట్ మంచంమీద ఒక పురుషుడు ఒక స్త్రీ గుసగుసలాడుకుంటున్నారు దగ్గరగా చేరి.

ప్రక్కగా వేరే మంచంమీద పడుకున్న తొమ్మిదేళ్ళ కొడుకు కొంచెం మూలిగేసరికి వాళ్ళు కబుర్లాపి వాడికేసి చూశారు. కొంచెంసేపు అస్పష్టంగా గొణుక్కుంటూ తర్వాత స్పష్టంగా పలవరిస్తున్న కొడుకుకేసి కళ్ళింత చేసుకుని చూశారిద్దరూ—ఆశ్చర్యంగా.

"ఒరేయ్ తప్పు ఒప్పుకో! లేకపోతే ఎల్లుండి రాత్రి పన్నెండు గంటలకి దారుణంగా ఛస్తావ్! మైత్రేయకి చావు లేదు!!" అదిరిపోయాడు పక్కమీదనున్న పురుషుడు.

వెంటనే కొడుకు మంచం దగ్గర కెళ్ళి వాడిని తట్టి లేపబోయాడు. వాడు చిన్నగా మూలుగుతూ పక్కకి వత్తిగిల్లి పడుకుని మళ్ళీ పలవరించాడు.

"ఒరేయ్ తప్పు ఒప్పుకో! లేకపోతే ఎల్లుండి రాత్రి పన్నెండు గంటలకి దారుణంగా ఛస్తావ్! మైత్రేయకి చావు లేదు!!"

చెమటలు పట్టేశాయి పురుషుడికి. ఆ రాత్రి అతడు

నిద్రపోలేదు. మైత్రేయ మాటలు ఊరికే పోవు. ఎల్లుండే తన చావు ముహూర్తమా? వణికిపోయాడా వ్యక్తి. భయంతో జ్వరం వచ్చినట్టయింది. మర్నాడు తెల్లవారుతూనే పోలీస్ స్టేషన్‌లో ప్రత్యక్షమయ్యాడు.

9

శతభిషం నించి ఫోన్ కాల్ అందుకున్న దీక్షితులు, చిరంజీవి మొఖంకూడ కడుక్కోకుండానే లుంగీలతో వచ్చేశారు పోలీస్ స్టేషన్‌కి.

పురుషుడు చెప్పడం ప్రారంభించాడు.

"నేనేం చెయ్యలేదు. అంతా మా బావమరిదే చేశాడు. నేను పరంజ్యోతి మెమోరియల్ క్లబ్ మెంబర్ని. మా బావమరిది విఠల్‌రావు, చక్రపాణి ఆఫీసులో మానేజరు. అడపాదడపా లంచాలు తినడం అలవాటుంది అతనికి. అనేక కుంభకోణాల్లో ఇరుక్కున్నాడు. అవి నిరూపించబడితే సుమారు రెండు లక్షల రూపాయిలదాకా కట్టవలసి వుంటుంది. అతడు ఏ విధంగా డబ్బు సంపాదించిందీ అసిస్టెంట్ మానేజరుగా చక్రపాణికి తెలుసు.

కోర్టులో విఠల్‌రావుకి అనుకూలంగా సాక్ష్యం చెప్పడానికి చక్రపాణి నిరాకరించాడు. తన లోటుపాట్లు అన్నీ తెలిసిన చక్రపాణిని మొదట ట్రాన్స్‌ఫర్ చేయించాలని చూసి తర్వాత అది కుదరక అతడి స్కూటర్‌కి ఏక్సిడెంట్ చేయాలని ప్రయత్నాలు చేశాడు.

ఈలోగా మైత్రేయ మా క్లబ్‌కి ఒక సందర్భంలో ఒక కవరు ఇవ్వడం జరిగింది. తర్వాత నేను, మా బావమరిదీ కలిపి ఒక ప్లాన్ ప్రకారం మైత్రేయని సర్వీతోటకి తీసికెళ్ళి అక్కడ సైనేడ్ ప్రయోగంతో అతన్ని చంపి ఆ హత్యానేరం చక్రపాణి మీదకు తోసి క్లబ్‌లో కవరు మార్చేశాం.

అంతకు ముందే చక్రపాణి స్కూటర్ తాళాలు ఓ మనిషి ద్వారా దొంగిలించి తెప్పించి దానికి చక్రపాణి పేరున్న నేమ్ ప్లేట్ తగిలించి శవంపక్కన పడేశాం వేలిముద్రలు తుడిచేసి.

తాళాలగుత్తి ఆధారంతో చక్రపాణిని అరెస్టుచేస్తారనీ, మైత్రేయ కూడా చక్రపాణిని దోషిగా వెల్లడిస్తే చక్రపాణి హంతకుడిగా నిరూపించబడడానికీ తద్వారా అతడు ఏ ఉరి శిక్షకో, యావజ్జీవ జైలుశిక్షకో గురి అవుతాడని భావించాం.

కాని నిన్నరాత్రి మైత్రేయ మా అబ్బాయి కలలోకొచ్చి తప్పు ఒప్పుకోకపోతే నేను దారుణంగా మరణిస్తానని చెప్పాడు. అతని చేతిరాత, నోటిమాట అసత్యం కాలేదింత వరకూ. నేను నా తప్పు ఒప్పుకున్నాను. నాకే శిక్ష విధించినా సరే! నిజానికి నేను మా బావమరిదికి సహాయపడ్డానే తప్ప హత్య నేను చెయ్యలేదు. నేనుమాత్రం చావకూడదు! బతకాలి!! నేను బతకాలి!!" తల పట్టుకున్నాకూర్చున్నాడతను కళ్ళలో నీళ్ళు తిరుగుతుండగా.

"ఈ చేతిరాత మీదేనా?"

"అవును.... నాదే! ఇది మీకెలా వచ్చిందీ?"

"చచ్చిపోయిన మైత్రేయ మాట్లాడగా లేంది ప్రాణం లేని కాగితాలు కథలు చెప్పడంలో ఆశ్చర్యం ఏవుందీ? మీ అంతట మీరు వచ్చి నేరం ఒప్పుకోకపోయినా ఈ కాగితం ఆధారంతో మేమే మిమ్మల్ని అరెస్టు చెసేవాళ్ళం ఈరోజు" అన్నాడు డిటెక్టివ్ దీక్షితులు. ఆ తర్వాత విఠల్‌రావు కూడా అరెస్టుచెయ్యబడ్డాడు హత్యానేరం మీద.

స్కూలుకి వెళ్ళి ఆ పిల్లవాడ్ని కలుసుకుని మైత్రేయ చెబుతున్నట్లుగా ఆ రాత్రి డైలాగులు చెప్పించడం దీక్షితులు రహస్యంగా చేసిన మరో ప్రయోగం అన్న సంగతి డిటెక్టివ్‌లకి తప్ప, మూడోకంటివాడికి తెలియదు. □

ప్రత్యూష ఘడియలు

—చంద్రశేఖర అజాద్

ఫోన్ మ్రోగింది.

హరీంద్ర తనకు తెలియకుండానే చెవులు రిక్కించాడు.

"హల్లో....యస్....ఆఁ వున్నారు....ఒన్ మినిట్"

"మిస్టర్ హరీంద్రా" పిలిచాడు మేనేజర్.

"కమింగ్ సార్" చటుక్కున లేచాడు.

"మీకెవరో ఫోన్‌చేశారు" అందించాడతను.

"హలో....నేను హరీంద్రను మాట్లాడుతున్నా"

"హలో....నేనన్నయ్యా" అవతల నుండి వినపడింది.

"ఏమిటిరా" అన్నాడు హరీంద్ర.

"బావను హాస్పిటల్లో చేర్పించాం."

"ఎందుకు?"

"రాత్రినుండి స్పృహలేదు. వెంటనే బయలుదేరిరా"

"వస్తాను"

"నాలుగురోజులు శెలవుపెట్టిరా. అయిపోతాడనుకుంటున్నారు" అవతలనుండి కంఠంలో ఏడుపుజీర.

"అంత సీ....రి....య....సా" హరీంద్ర నోటినుండి భారంగా వెలువడ్డా యా మాటలు.

"అవును" అతను ఫోన్లో దాదాపు ఏడుస్తున్నాడు.

"ఇప్పుడే వస్తున్నా"

హరీంద్ర ఫోన్ పెట్టేశాడు.

మేనేజర్ ప్రశ్నార్థకంగా చూస్తున్నాడు.

హరీంద్ర కళ్ళలో ఆందోళన తొంగిచూస్తోంది. పెదవులు వణుకుతున్నాయి. అప్పటికే మనసు మొద్దుబారిపోయింది. మరో విషయం ఆలోచించే స్థితిలోలేడు

"వాట్ హాపెండ్ హరీంద్రా"

"మా బావగారికి సీరియస్‌గా వుందట. నేను వెంటనే బయలుదేరి వెళ్ళాలి"

"ఓ.కె. మీరు వెళ్ళండి. కొంత వర్క్ ట్రబులవుతుందనుకోండి. అయినా యిలాంటి పరిస్థితుల్లో ఎవరుమాత్రం ఏం చెయ్యగలం" అన్నాడాయన.

"థాంక్యూ సర్. లీవ్‌లెటర్‌మీద నాలుగు రోజులకు సంతకంపెట్టి వెళతాను. ఇన్‌కేస్ అవసరమయితే ఎక్స్టెండ్

చేస్తాను. లేకుంటే వచ్చి కాన్సిల్ చేసుకుంటాను" అన్నాడు హరీంద్ర.

"ఇట్సాల్ రైట్"

హరీంద్ర గబగబ తన సీటుదగ్గరకు వచ్చి లీవ్ లెటర్ రాశాడు. తన కొలీగ్‌కు బీరువా తాళంచెవులు యిచ్చాడు.

మరోసారి మేనేజర్‌తో "వెళ్తున్నాను సార్" అని చెప్పి బైటకు వచ్చాడు.

సైకిల్ తాళంతీసి బైలుదేరాడు.

సైకిల్ వేగంగా దూసుకెళ్తోంది.

తన గుండెల చప్పుడు హరీంద్రకు స్పష్టంగా వినబడుతోంది.

"ఏమైనా జరిగిందేమో"

అదే ఆలోచన.

సైకిల్ ఇంటి ముందు ఆగింది. విసురుగా లోపలకు నడిచాడు.

కంగారుగా వస్తున్న హరీంద్రను చూసి "ఏమిటండి. ఏమయింది" అందతని శ్రీమతి.

"బావను హాస్పిటల్లో చేర్చారు. అ....యి....పోతాడంటున్నారు" కంఠంలో ఏడుపుతాలూకు జీర.

"ఎప్పుడండి" అందామె కంగారుగా.

"ఇప్పుడే ఫోన్ వచ్చింది. నేను ఇప్పుడు బస్సుకు బైలుదేరి వెళుతున్నాను పిల్లలు బడినుండి రాగానే నువ్వు ట్రైన్‌లో రా"

ఆమె రెండుజతల బట్టల్ని సూట్‌కేసులో సర్ది, నాలుగు వందలు యిచ్చింది.

"మరి నేను వెళ్ళొస్తాను"

"మీరు ఊరికే కంగారుపడకండి. మామూలుగా హాస్పి

టల్లో చేర్పించి వుంటారు"

"సర్లే"

"జాగ్రత్తగా వెళ్ళండి"

"అలాగే"

సూట్ కేస్ అందుకొని బైటకు వచ్చాడు.

వేగంగా నడిచి వెళ్తున్న భర్తవంక ఆందోళనగా చూపిందామె.

మాటవరసకలా అందేగాని ఆమెకా క్షణం నుండే గుండె దడ ఆరంభమయింది. వెంటనే బట్టలు సర్దుకోవడం మొదలుపెట్టింది.

హరీంద్ర దగ్గరకు రిక్షావచ్చి ఆగింది.

ఎక్కి "బస్టాండ్" అన్నాడు.

దిగాక అప్పటికే చేతిలో వుంచుకున్న డబ్బులు అతని కిచ్చి, పరుగులాంటి నడకతో లోపలకు వెళ్ళాడు.

బస్ రెడీగా వుంది.

ఎక్కేశాడు. సీట్లులేవు. నిలబడి ప్రయాణం చేయాలి. సూట్ కేసు క్రిందపెట్టాడు.

బస్ కదిలింది.

అప్పటిదాకా వున్న టెంక్షన్ ఒక్కసారిగా విడిపోయి నట్లయింది.

హరీంద్రకు రెండు నెలల క్రితం బావమాటలు గుర్తొచ్చాయ్.

అప్పటికి చాలసేపు నుండి త్రాగుతున్నాడు రాజేశ్వర రావు. కళ్ళు ఎర్రబడ్డాయి. మూడు సిగరెట్ ప్యాకెట్లు క్రింద పడున్నాయి.

రాజేశ్వరరావు చెబుతూనే వున్నాడు.

గత జీవితపు సంఘటనల్ని—ఒక్కో పొర విడదీస్తూ.

ఆ ఎనలిసిస్‌లో నిజాయితీ వుంది.

"నేను సమాజానికి ఉపయోగపడే వ్యక్తినికాదు. ఆ సంగతి నాకు బాగా తెలుసు. ఇంకెంతోకాలం బ్రతకాలని నేను కోరుకోవటంలేదు. బ్రతకను కూడా. ఏ రోజో ఇలాగే తాగుతూపోతాను. అప్పుడు మీలో ఎవరైనా నా కోసం ఏడుస్తారా."

గుండెల్ని ఎవరో రంపంతోకోసినట్లయి, రక్తం అంతా ఒక్కసారిగా ఉప్పెనలా మొఖంలోకి కేంద్రీకరించబడి నట్లున్న హరీంద్రను చూసి ఆయన నవ్వాడు.

హరీంద్రలో ఆ క్షణాలు జాలి, దయ, దుఃఖం, బాధ, ఏం ప్రతిఫలించాయో ఆయన మాత్రమే అర్థం చేసుకో గలడు.

"కొంపతీసి భావోద్రేకంలో ఏమైనా చేసుకోలేదుకదా" అనుకున్నాడు హరీంద్ర.

నిజంగా ఆయన లేకుంటే?

ఆయన పోయాడేమో....ఆ వార్త వినగానే తన గుండెలు బరువెక్కి అప్‌సెట్‌కాగలనని ఇలా చెప్పా రేమో. లేకుంటే ఫోన్‌లో తమ్ముడు అంతగా ఏడుస్తూ ఎందుకు చెప్పటం? బస్సు ఆగగానే దిగివెళ్ళితే. హాస్పిటల్లో ఎదురుగా స్ట్రెచ్చర్‌మీద, నిండుగా తెల్లగుడ్డకప్పి, శవం ఎదురొస్తే.

నో....నో....అలాంటి దృశ్యంవద్దు....వద్దు....అక్కా- నేను చూడలేను నీ దైన్యాన్ని....నువ్వు గుండెలు పగిలి పోయేలా ఏడుస్తుంటే నేను భరించలేను. నువ్వెన్ని తప్పులు చేస్తున్నా, చేసినా, నువ్వు భౌతికంగా మా నుండి దూరమవటం నేనూహించలేను. నువ్వు లేనిలోటు పూడ్చు కోలేం. ఇంక మాకంతా శూన్యమే.

హరీంద్ర కళ్ళు పచ్చని చేలను, కొండల్ని యాంత్రికంగా పరిశీలిస్తున్నాయేగాని, హృదయం రోదిస్తూంది.

"అనవసరంగా కంగారుపడటం మినహాయించి ఏం జరిగివుండదు. మామూలుగానే అనారోగ్యంగా ఉంటున్నాడు కదా.... కొంచెం సీరియస్ అయిందేమో.... అంతగా అయితే మద్రాసు 'అపోలో'కు తీసుకెళ్ళి 'ఇంటెన్సివ్' కేర్‌లో ఉంచితే అదే నయం అవుతుంది. ఆ తర్వాత కొంత గట్టిగావుంటే ఆయనే అన్ని అలవాట్లనుండీ బయటపడి తీరతాడు."

హరీంద్రలో ఆలోచనలు చిందర వందరగా వున్నాయి.

బస్సు వెళ్తూనేవుంది.

2

"ఇక్కడ ఏడుస్తూ కూర్చోకూడదు. ముందులేవండి, ఆ మూల కూర్చోండి" నర్సు అరుస్తూంది.

అయిదడుగులఎత్తు, ఎర్రటి దేహం, కొన్ని వందల దేహాల్ని కోస్తుంటే నిర్లిప్తంగా చూస్తున్న అనుభవం, వయసు, ఆమెకున్నాయి. ఆమె కంఠంలో మార్దవంలేదు-చిటపటలు తప్పితే. గదిముందు కూర్చున్నవారంతా ఒకరి మొఖాలు ఒకరు చూసుకున్నారు.

ఎవరూ కదల్లేదు.

అక్కడి వాతావరణం చాలా గంభీరంగా వుంది. నడుమ నడుమ ఎవరో వచ్చిచూసి వెళుతున్నారు. క్రొత్తవ్యక్తులు రావటంతో మరలా మొదలవుతుంది. ఒక్కసారిగా కొన్ని గొంతులు విషాదగీతాన్ని ఆలపిస్తాయి.

"మీకే చెప్పేది. మీరిలా ఏడుస్తూకూర్చుంటే అవతల పేషెంట్లున్నారు. వాళ్ళ కండీషన్ దెబ్బతింటుంది. ముందు లేవండి. ఊఁ" అంటూ తిరిగి గద్దించిందామె.

ఈసారి అక్కడవారిలో కొందరు లేచారు. కారిడార్ మూలగా వెళ్ళి కూర్చున్నారు.

హరీంద్ర మెల్లగా నడుచుకుంటూ వస్తున్నాడు.

అతనివెంట సుభాకర్ నడచివస్తున్నాడు.

ఇరువురి వదనాల్లో విషాదరేఖలు అత్యంత స్పష్టంగా కనిపిస్తున్నాయి.

గదిముందు ఆగాడు.

హరీంద్రను చూసిన అక్కయ్య గుండెలోతుల్లో దాచుకున్న దుఃఖాన్ని ఇంక అణచలేకపోయింది. పొంగి పొంగి పొరలుతున్న ఆ ప్రవాహం బయటకు ఎగతన్నింది.

ఎలా ఓదార్చాలో హరీంద్రకు అర్థంకాలేదు.

హరీంద్ర కళ్ళనుండి కారుతున్న నీళ్ళు బుగ్గలమీద నుండి జారిపోతున్నాయి.

కర్చీఫ్ అందుకొని తుడుచుకున్నాడు నేలవంక చూస్తూ.

హృదయభారం తగ్గాక గది తలుపు తెరిచాడు.

ఎదురుగా బెడ్‌మీద పడుకోబెట్టి ఉన్నాడు.

అరికాలు కోసి అక్కడినుండి సిలైన్ పంపే ఏర్పాట్లు చేశారు.

నాసికా రంధ్రాలకు తగిలించబడిన రెండు గొట్టాలు ఆక్సిజెన్‌ను లోపలికి పంపుతున్నాయి. బిగించబడ్డ ఆక్సిజెన్ సిలిండర్‌కు తగిలించబడ్డ సీసానుండి బుడగలు వస్తున్నాయి. కళ్ళు సగంతెరిచీ, తెరవకుండావున్నాయి. గాలి పీలుస్తున్నప్పుడు శరీరం ఎగిరెగిరి పడుతోంది.

హరీంద్రకు గురకశబ్దం వినిపిస్తోంది.

గురక....గురక....

ఎవరో కెవ్వున ఏడ్చినట్లు....

ఏ మృగమో గర్జించినట్లు....

ఆ కళ్ళు ఏ ఏ దృశ్యాల్ని చూస్తున్నాయో తెలియటం లేదు.

ఆయన కాళ్ళదగ్గర కూర్చొని చూస్తున్నాడు విష్ణు.

విష్ణు, రాజేశ్వరరావు కొడుకు.

పిలైన్సనుండే ఒక్కో బొట్టు పడుతూంది.

రాజేశ్వరరావు ఈ లోకంలో లేడు.

హరీంద్ర ముందుకు కదిలి ఆయన చేతిని అందుకున్నాడు.

చల్లగావుంది.

మరుక్షణం వదిలేశాడు.

చేతులు వణుకుతున్నాయి. ఏదో జరగబోతూంది. తిరిగి బావను చూడటం జరిగేపనేనా?

విష్ణును కళ్ళతోనే పలకరించాడు.

గురక వినపడుతున్నా ఆ గదిలో భయంకరంగా మౌనం ఆవరించుకొంది.

హరీంద్ర ఎక్కువసేపు నిలవలేక పోయాడు.

వెనక్కి తిరిగి బయటకువచ్చాడు.

"ఇప్పుడు చెప్పరా ఏమయింది?" అన్నాడు హరీంద్ర, తమ్ముడితో.

"మొన్న ఉదయం నుండి బిజినెస్ వ్యవహారాలు మాట్లాడుతూనే వున్నాడు. దాంతోపాటు త్రాగుతున్నాడట. జ్వరం కూడా వుంది. ఇంటినుండి వెళ్ళిపోయి లాడ్జింగ్‌లో ఉన్నారు. రాత్రి బాధపడుతుంటే రమణగారు హాస్పిటల్లో చేర్పించాలన్నారు. అయినా ఆలస్యం అయింది. ఇంకా ఏం జరిగిందో పూర్తి వివరాలు తెలియటంలేదు. తెల్లవారాక కారులో తీసుకొచ్చారు. అప్పటినుండి స్పృహలేదు.

అలానే మంచంలో వున్నాడు" చెప్పాడు సుధాకర్.

"డాక్టర్లేమంటున్నారు"

"వాళ్ళు గ్యారంటీ ఏమీ ఇవ్వటంలేదు. అసలు ఉదయమే అయిపోయాడనుకున్నారు. లక్కీ. అంతే. ఆ స్పెషలిస్టు ఆగిపోయిన గుండెమీద టూటైమ్స్ గట్టిగా తట్టాడట. అప్పుడు కొట్టుకుంది. లేకపోతే ఉదయమే అంతా అయి పోయినట్లు"

"ఆ గురకేమిటి....దారుణంగా వుంది"

"అదే డేంజర్. అది తగ్గితేనే నయం అయినట్లు. ఉదయం ఓ రకంగా అదే రక్షించింది. ఆ స్పెషలిస్ట్ రాజన్ గారు ఛెక్ చేసి వెనక్కి తిరిగారు. సడెన్‌గా గురక ఆగిపోయింది. వెంటనే ఆయన చూస్తే గుండాగిపోయింది. వెంటనే ఆయన రెండుసార్లు ప్రెస్ చేశాట్ట. అప్పుడు తిరిగి ఆడింది. రెండుక్షణాలు లేటయినా మనకు దక్కేవాడు కాదు. ముందా గురక తగ్గిపోవాలి. ఏమైనా అప్పుడే కొంత హోప్ వుంటుంది."

"అలాగా" అన్నాడు.

"ఈ సాయంకాలం, లేకుంటే రేపు ఉదయందాకా డేంజర్ నుండి బయటపడినట్లెంకాదు. రేపు ఉదయం దాట గలిగితే ఫర్వాలేదంటున్నారు"

"ఎవరు చెప్పారు"

"ఎవరో నర్స్ నడిగితే అంది"

హరీంద్ర టైం చూసుకున్నాడు.

మూడుగంటలు కావస్తోంది.

ఇంకా పద్దెనిమిదిగంటలు గడవాలి.

గడిస్తే తిరిగి రాజేశ్వరరావు ఈ లోకంలోకి వస్తాడు.

"కామాకేసు లెప్పుడూ సస్పెన్సే"

అప్పుడు కదిలాడు హరీంద్ర.

"కో....మా....నా"

"అవును. ఇప్పుడు కేవలం గుండె కొట్టుకొంటూంది. ఆక్సిజెన్ పీలుస్తున్నాడు. గురకపెడుతున్నాడు. అంతే. జాండీస్ విపరీతంగా వుంది కిడ్నీస్ దెబ్బ తిన్నాయంటున్నారు. మెదడు పనిచేయటంలేదట. పెరాలసిస్ స్ట్రోక్ రావచ్చంటున్నారు. ఒక్కమాటలో అన్ని రోగాలూ ఒక్కసారిగా దాడి చేశాయి. వాటన్నింటిని ఎదుర్కొని బయట పడగలితే...."

"మృత్యువుతో పోరాటమన్నమాట"

"అవును. బావ బ్రతికి బయటపడితే రియల్లీ ఇటీజ వండర్"

"ఆయన బ్రతుకుతాడు" గొణిగాడు హరీంద్ర.

అది ఆత్మ విశ్వాసం తాలూకు ఓకోణం మాత్రమేనని అతనికి స్పష్టంగా తెలుసు.

మరో ప్రక్క....

ఆందోళన....

భరించలేనంత ఉత్కంఠ.

రేపు ఎనిమిదిగంటలు దాటాలి.

దాటుతాయా?

3

రాజేశ్వరరావుకు విష్ణు ఒక్కడే సంతానం. విష్ణుకి పెళ్ళయి సంవత్సరం కావస్తోంది. ఆయనకు చాలా వ్యాపారాలున్నాయి. దాదాపు ముప్పై లక్షలకు పైగా సంపాదించాడని భావిస్తుంటారు.

ఎంత ఉందో, ఎక్కడెక్కడవుందో ఆయనకు మాత్రమే తెలుసు.

రాజేశ్వరరావు అనేక అలవాట్లకు గురయ్యాడు. లోబడిపోయాడు. వాటి ప్రభావం నిత్య జీవితంలోని ప్రతి కోణం మీదపడింది. రాజేశ్వరరావు వ్యక్తిత్వం ఎంతటి గొప్పదయినా అది వంటరితనానికి లోనయింది. అందుకే తనను తాను బలిచేసుకుంటూవచ్చాడు. తాను చేసే ప్రతి పనిలోనూ మంచి, చెడ్డల్ని బేరీజు వెయ్యగల తను, అన్నీ తెలిసి స్వయంగా విషాదానుభూతికి స్వాగతం చెప్పేవాడు.

విష్ణు తనబిడ్డ. కానీ ఎందుకో ఏనాడూ వారిరువురి సంబంధం, తండ్రీ-కొడుకుల సంబంధంలా ఉండలేదు. విష్ణునుండి అతను ఎంతో ఆశించేవాడు. అయితే అది అతని ముందు వ్యక్తంచేసి ఫలితాల్ని సాధించటంకాక, దూరం నుండి చూస్తూ విమర్శించే కార్యక్రమంలో ఉండేవాడు. ఇలాంటి చర్య మూలంగా విష్ణు మరోరకంగా తయారయ్యాడు. రాజేశ్వరరావు వెనకనున్న మనుష్యులు ఆయన్ని ఓ రకంగా మారిస్తే, విష్ణు వెనక వున్నవారు మరోరకంగా మార్చారు.

రాజేశ్వరరావులో తనను తాను విశ్లేషించుకొనే గుణం వుంది. తన స్థితిపట్ల బాధవుంది.

విష్ణులో లేనిదదే!

రాజేశ్వరరావు వ్యక్తిగత అహంతోనే తన బిడ్డపట్ల, భార్యపట్ల, తల్లిపట్ల, తమ్ముడిపట్ల, ప్రవర్తనలోనూ, సున్నితమైన సంబంధాల్ని త్రెంచేసుకున్నాడు. అందుకు ఆయనొక్కడే నేరస్థుడు కాదు. అందరికీ వాటా ఉంది.

అందుకే ఆ ఇల్లు ఓ ఏకాంతమందిరం!

ఎవరి గదుల్లో వారు....

ఎవరి భావాల్లో వారు....

రాజేశ్వరరావు మాత్రం ఉదయం నుండి మందుతో

మొదలయి ఏ సాయంకాలమో ఆ మత్తులోనే మునిగిపోయే వాడు.

ఈ సందర్భంలో ఆయనకో సర్కిల్ ఏర్పడింది. ఆయన్ని వినియోగించుకుంటూ, ఆయన బలహీనతలమీద 'ప్లే' చేయటం మొదలయింది. అవి రాను, రానూ ఏ దశకు చేరుకున్నాయంటే తండ్రీ-కొడుకూ, భార్యాభర్తల నడుమ సంబంధాన్ని వారే శాసించటం మొదలుపెట్టారు. వారి నడుమవున్న వైరుధ్యాలు మరింతగా సంఘర్షించి బద్దలు కావటంకోసమే వారు నిరంతర ప్రయత్నాలు చేశారు.

ఆయనకు మందు అందించటంతో మొదలయి, ఆయన శృంగార జీవితానికి కావలసిన సకల ఏర్పాట్లను చేస్తుండ టంతో సహజంగానే ఆయనపట్ల తమకు హక్కు ఉన్నట్లు ప్రవర్తించేవారు.

రాజేశ్వరరావు గత జీవితం వున్నతాదర్శం!

రాజేశ్వరరావు వర్తమానం బ్రహ్మండమయిన పతనం!

ఆ జీవితమే గుణపాఠం.

పెళ్ళయిన తొలిదినాల్లో సిగరెట్ సైతం త్రాగని ఆయన ఈనాడు మంచంలోవుండి... కోమాలో జారిపోవటం వెనక గల సంవత్సరాలు....సంఘటనలు....వ్యక్తులు....ఇదంతా జీవిత పోరాటాన్ని విశ్లేషించుకోవటానికి పనికివస్తాయి.

హరీంద్ర ఆలోచనలు సాగుతున్నాయి.

ఆ గదిలో విష్ణు, తాను మాత్రమే వున్నారు.

ఆక్సిజెన్ నిరంతరాయంగా పంపబడుతూంది.

తలుపు చప్పుడయింది.

విష్ణు, హరీంద్ర ఆ వైపు చూశారు.

రాజేశ్వరరావు తమ్ముడు మూర్తి.

అప్పటికి సమయం రాత్రి ఎనిమిదిగంటలు.

"ఈ రాత్రికి ఎవరుంటారు?"

"మేం ఉంటాములే" అన్నాడు విష్ణు.

"హరీంద్రా, నువ్వు వుంటావా?"

"ఊఁ" అన్నాడు విష్ణు.

"సరే. మిగతావారందరినీ ఇంటికి వెళ్ళమని చెబుతాను. ఈ రాత్రి మాత్రం జాగ్రత్తగా వుండాలి. ఆక్సిజెన్ వుందో లేదో తెలియటానికి మీటర్ చెడిపోయింది. కాబట్టి మీరా సీసావంక చూస్తుండాలి. బుడగలు రావటం తగ్గిపోతే వెంటనే చెబితే ఇంకోటి ఏర్పాటుచేస్తారు.

ఇప్పుడు గురకవింటున్నారుగా. అందులో ఎలాంటి మార్పు కనబడ్డా వెంటనే కంపౌండర్ని పిలవండి. అవసరమయితే అతను డాక్టర్ని పిలుస్తాడు. ప్రతిగంటకూ మందు ఇవ్వాల్సి వుంటుంది. నోట్ చేసుకోండి. ఓ వేళ అతను ఇక్కడలేకుండా, వేరే వార్డులోకి వెళితే పిలుచుకురావాలి. అసలు ఓ కంపౌండర్ మనకు ప్రత్యేకంగా ఉంటాడు. రేపు ఉదయం గడిస్తే ఫర్వాలేదంటున్నారు. మనం చెయ్యగలిగింది మాత్రం ఇదే. ఈ రాత్రి చాలా కేర్‌ఫుల్‌గా వుండాలి" అన్నాడాయన.

హరీంద్ర తల పంకించాడు.

"నేను ఉదయమే వస్తాను. అవసరమయితే ఫోన్ చెయ్యండి" అంటూ మూర్తి వెళ్ళిపోయాడు.

హరీంద్ర బయటకు వచ్చాడు.

గదిముందు అక్కతోపాటు, అమ్మకూడా వుంది.

దూరంగా ఇంకా కొంతమంది కూర్చుని ఉన్నారు.

హరీంద్ర అక్కదగ్గరకు వెళ్ళాడు. ఆమె మొఖంలో ఏ మాత్రం కళలేదు.

"భోంచేశారా" అన్నాడు.

"ఏం భోజనంలే" అంది విరక్తిగా.

"ఏమంటున్నార్రా" అంది హరీంద్ర తల్లి.

"రేపు ఉదయం గడిస్తేగాని చెప్పటానికి వీలులేదు" పెదవి విరిచింది అక్క.

"కంగారుపడాల్సిన పనిలేదులే. మీరు ఇంటికి వెళ్ళండి" అన్నాడు హరీంద్ర.

"నేను ఇక్కడే ఉంటాను" అంది హరీంద్ర అక్క.

విష్ణు బయటకు వచ్చాడు విసురుగా.

"ఏమిటి ఇక్కడ ఉండేది. అందరూ ఇంటికిపొండి. ఇక్కడ ఎవర్నీ ఉండవద్దని డాక్టర్లు చెప్పారు. అందరూ ఈః చుట్టు ప్రక్కలకూర్చుని ఏడుస్తుంటే వాళ్ళు ఊరుకుంటారాః" అరిచాడు విష్ణు.

హరీంద్ర అక్కకేసి చూశాడు.

ఆమె కళ్ళలో నీళ్ళుః

విష్ణు ముందుకు నడిచి గుంపుగా కూర్చున్న వారందరికీ అదే చెప్పాడు.

మెల్లగా ఒక్కొక్కరే లేచారు.

విష్ణు తిరిగి గదిలోకి వెళ్ళాడు.

హరీంద్ర కూడా లోపలకు వెళ్ళాడు.

"కొంచెం మెల్లగా చెప్పొచ్చుకదాః"

"ఏమిటి చెప్పేది. అందరూ కూర్చొని కదలకపోతే ఏం చెయ్యాలిః"

"అందరిసంగతి ఏమైనా కావచ్చు. ఆమె నీ తల్లి, ఆయన భార్య. ఆమె ఉండాలనుకోక ఏం అనుకుంటుందిః"

విష్ణు ఏం మాట్లాడలేదు.

"నీ ధోరణి నువ్వు మార్చుకోవాలి. ఓవేళ తల్లీతండ్రి నిజంగానే దుర్మార్గులయినా వారితో ప్రేమగా మాట్లాడి

తీరాలి."

తిరిగి మౌనాన్ని చీలుస్తూ అన్నాడు హరీంద్ర.

"తల్లీ-తండ్రి మార్కెట్లో దొరకరు"

విష్ణు తలెత్తి చూశాడు.

హరీంద్ర బయటకు వెళ్ళాడు.

"అక్కా.... ఈ రాత్రంతా మేలుకోవాలి. మేం ఈ రోజుంటాం. ఉదయం కూడా ఆయన ప్రక్కన ఎవరో ఒకరుండాలి. మీరు ఇప్పుడు వెళ్ళి పడుకొని ఉదయం వస్తే, మేం రెస్ట్ తీసుకోవటానికి అవకాశం వుంటుంది."

"అది కాదురా ..."

"ఇంకేం చెప్పకు. ముందు మీరు వెళ్ళి స్నానంచేసి, భోంచేసి పడుకోండి" అన్నాడు.

బలవంతంగానే వాళ్ళు కదిలారు.

హరీంద్ర లోపలకు నడిచి, తలుపుదగ్గరగా వేశాడు.

కంపౌండర్ వచ్చాడు.

గురకద్వారా నోట్లో పేరుకుపోతున్న తెమడను సక్ చేసి తీశాడు. సక్ చేస్తున్నప్పుడు ఆయన్ని పట్టుకోవాల్సివచ్చింది.

అప్పుడు ఆయన కళ్ళు ఎర్రగా మారి తనవంక తీక్ష ణంగా చూస్తున్నట్లనిపించింది హరీంద్రకు.

తిరిగి గురక మామూలుగా వినపడుతూంది.

సిలైన్ నుండి ఒక్కోచుక్క పడుతూంది.

అరికాలు నుండే ఇంజక్షన్ ఇస్తున్నారు.

విష్ణు తన తండ్రివంక చూస్తున్నాడు.

ఇరవై అయిదు సంవత్సరాల్లో, ఊహ తెలిశాక మొదటి సారి తన తండ్రి ప్రక్కన కూర్చొని ఆయన కళ్ళలోకి చూస్తున్నాడు. ఆయన కాళ్ళను ప్రేమతో వత్తుతున్నాడు.

మృత్యువు కొందరిని దగ్గరకు చేరుస్తుందా?

4

ఉదయం: ఎనిమిది గంటలు.

నర్సుల్తో, కంపౌండర్లతో, విజిటర్స్‌తో హడావుడిగా ఉందా ప్రాంతం. హాస్పిటలంతా మందుల వాసన కొడుతూంది.

ఈ దేశంలో ఛంబల్ లోయలో బందిపోట్లున్నారు. పాతిక సంవత్సరాలుగా దేశ రహస్యాల్ని అమ్ముతున్నవారున్నారు. దార్లు కాచి, ముసుగులు వేసుకొని దోచుకునేవారున్నారు. చిల్లర దొంగతనాలు, కన్నాలు వేయటం ఉంది. కానీ ఏ ఊరువెళ్ళినా ఎత్తైనా ఆధునిక ఆసుపత్రి భవనాలు, అవి ప్రభుత్వంవారివైనా, ప్రైవేట్ వారివైనా, వాటిల్లో క్రైమ్ యథేచ్ఛగా రాజ్యమేలుతుందని, రోగి జబ్బుతో మాత్రమే వీళ్ళు బ్రతుకుతారని, ఇంతకంటే అసహ్యమైన పీడన, మరే రంగంలో లేదంటే కొందరు ఆశ్చర్యపోతారు.

రెండంతస్తుల భవనం అది. ఆ ఆసుపత్రిలోనే అనేక విభాగాలున్నాయి. కొంతమంది డాక్టర్లు జీతాలు తీసుకొని పనిచేస్తారు. అక్కడే బ్లడ్ టెస్ట్, మోషన్ టెస్టులు చేస్తారు. ఎక్స్‌రేలు తీస్తారు. ఇంకా గర్భంలో పిల్లల్ని చూసుకోవటానికి స్క్రీనింగ్ ఉన్నయంత్రం, ఆధునికమైన ఆపరేషన్ థియేటర్లు....ఏ.సి. గదులు....మామూలుగదులూ ఉన్నాయి.

నిరంతరం అక్కడ ధనం ప్రవహిస్తుంటుంది.

ఆ హాస్పటల్ కో విధానం ఉంది.

"ఇచ్చే లాడ్జ్ నాటే హాస్పిటల్" అంటారు కొందరు.

ఆ హాస్పిటల్‌ను నడుపుతున్న భార్యాభర్తలు రోగాల్ని తమ దగ్గరే నయం చేయించుకోవాలనే నియమం పెట్టరు. ఆ గదుల్లో ఉండి ఏ స్పెషలిస్టులనయినా పిలిపించుకోవచ్చు. ఓ రకంగా వారికి ఆ గదులు నిండటమే కావాలి.

అక్కడ నర్సులూ, కంపౌండర్లూ, డాక్టర్లూ—

రోగుల్ని, రోగాల్ని తిని బ్రతుకుతుంటారు.

స్ట్రెచ్చర్స్ దూసుకొస్తున్నాయి.

ఆపరేషన్ థియేటర్లోకి ఎవరెవరో ప్రవేశిస్తున్నారు.

ఎక్కడినుండో పిలవబడ్డ స్పెషలిస్ట్ చేతులకు గ్లవుస్ తొడుక్కుంటున్నాడు.

రాజేశ్వరరావు బంధువులు తలో మూల చేరారు.

జట్లు, జట్లుగా, ముఠాలు, ముఠాలుగా గుసగుసలు.

ఉన్నది ఒక్కడే కొడుకు. ఈ ఆస్తంతా వాడిది. వాడ్ని బుట్టలో వేసుకోగలిగితే....

ఒక్క విషయం మాత్రం వాస్తవం.

రాజేశ్వరరావుకు స్పృహవస్తే, అందులో మూడువంతుల మందిని లోపలకొచ్చి చూడటానికి కూడా అనుమతించడు.

ఆయన బాబాయినంటూ వచ్చాడొకాయన.

విష్ణు చూస్తున్నాడు.

రాత్రంతా ఇద్దరికీ నిద్రలేదు.

శరీరం అంతా వాసన.

కళ్ళు మండుతున్నాయి.

ఆయన కుర్చీనడుము తన దేహం యిరుక్కుపోతే, ఆపరేషన్ థియేటర్లో మాత్రమే తనని బయటకు తీయాల్సి ఉంటుందని గ్రహించాడు. అందుకే సగందేహం మాత్రం అనించాడు.

"అబ్బాయి హాస్పటల్లో ఉన్నాడని చెప్పగానే నా గుండాగినంత పనయింది. జనవేమో ఆస్తులవి రాయించుకుంటానికి లాయర్ని పిలిపించారనుకుంటున్నారు. ఆస్తులేముంది. అబ్బాయి ప్రాణాలు కావాలని" అంటూ సన్నగా రాగం తీయటం ప్రారంభించాడు.

ఆ పెద్దమనిషి ఇద్దరు పెళ్ళాల్ని తగలేసేడని ప్రతీతి.

"సర్లే తాతా. పెద్దగా ఏడవకు. గుండెలు బద్దలై పోగలవు. ఆ తర్వాత నీ కొడుకులికి లాయర్లని పిలి పించుకునే టైం కూడా వుండదు" అన్నాడు విష్ణు.

ఆ జోక్ అర్థమయిందో, అయినా పట్టించుకోలేదో తెలియలేదు.

"అబ్బాయికి కోళ్ళంటే ప్రాణం....అరకోడ్ని తప్పితే తినేవాడు కాదు. అందుకే పదిరోజులకో సారి అరకోడ్ని పంపించేవాడ్ని. ఇప్పుడాడ్ని చూస్తుంటే నా గుండె చెరువయి పోతుంది. చెట్టులాంటి మనిషి. ఈకలు పీకేసిన కోడిలా వున్నాడు" అంటూ గొంతు బొంగురుచేసి దుఃఖం అభినయించాడు.

అప్పుడే వచ్చింది చిటపటల నర్సు.

"ఎవరయ్యా నువ్వు అరుస్తున్నావు. స్పృహవస్తే ఆయన కంగారు పడిపోతాడు. నీ ఏడుపు ప్రక్కగది పేషెంట్‌కు వినపడితే వాడు గుండాగి పోతాడు. ముందీ గదినుండి బయట కెళ్ళు...."

"అదేంటమ్మా" అన్నా డాయిన కంగారుగా.

"అవునండీ డ్రెస్సింగ్ చెయ్యాలి. ఎవరూ వుండ కూడదు. డాక్టరుగారొస్తున్నారు. యూరిన్, బ్లడ్ టెస్టులు చేయాల్సుంటుంది. ప్లీజ్ గో" అందామె తీవ్రంగా.

ఆ ముసలాయన మాట్లాడకుండా బయటకు వెళ్ళి పోయాడు.

సాయంకాలం గడిచింది.

రేపు ఉదయం గడవాలట!

గడుస్తుందా?

ఇప్పటికి ఎన్నిసార్లు బ్లడ్ టెస్టులు, యూరిన్ టెస్టులు చేశారో లెక్కలేదు. ఎన్ని సిలైన్‌చేశారో, ఎన్నెన్ని ఇంజ

క్షన్‌లు వాడారో....అయినాగాని ఆ శరీరంలో మార్పులేదు. ఎక్స్‌రే యూనిట్‌వారు ఆ గదికొచ్చి ఎక్స్‌రేలు తీశారు.

ఏమీ అంతుబట్టడం లేదు.

ఈ డాక్టర్లు, నర్సులు చెప్పటం లేదు.

చెప్పినా కర్ర విరగకుండా, పాము చావకుండా చెబుతున్నారు.

"డెకోడ్రాన్ మెడిసన్ ఇస్తున్నారంటే చాలా సీరియస్ కేసే. దటీజ్ ది లాస్ట్ ట్రీట్‌మెంట్. అంతకుమించి వేరే ట్రీట్‌మెంట్ లేదు. నాకయితే అరికాలునుండి అన్నీ పంపిస్తున్నారంటే అనుమానంగానే వుంది. ఆయన గనక బ్రతికి బట్టకడితే రియల్లీ ఇటీజే మిరకిల్."

"అదేమిటి? అలా అనటానికి ఆస్కారం లేదు. నటి సావిత్రి సంవత్సరానికి పైగా కోమాలో ఉంది."

"లేదు. లేదు. రేపు సాయంకాలానికల్లా తేలిపోతుందంటున్నారు."

"ఏమిటో మరి? మధ్యాహ్నం కల్లా గురక పెరుగుతూంది. సాయంకాలానికి తగ్గుతుంది. ఇలా కొంతకాలం కంటిన్యూ అవుతుందేమో."

"కోమా కేసు లెప్పుడూ అంతే."

"రేపు ఉదయం దాకా చూసి 'అపొలో'కు తీసుకెళ్తే బాగుంటుంది."

"ఈ సిలెండర్లూ....ఆక్సిజెన్ ఎలా అంటారు."

"రైల్లో ఒప్పుకుంటారు."

"లేకపోతే ఆంబులెన్స్ వ్యాన్ మాట్లాడుకొని వెంట ఓ డాక్టర్ని తీసుకెళ్తే సరి."

"నిజమే. మూడురోజులు గడుస్తుంటే ఇంతవరకూ ఎలాంటి ఇంప్రూవ్‌మెంట్ లేదు."

"ఈ రోజునుండి ట్రీట్ మెంట్ మార్చారు."

"ఏం మార్చటమో ఏమిటో ... ఆయన శరీరంనుండి రక్తం లాగుతుంటే నేను విలవిల లాడిపోయాననుకో."

"అబ్బా చిత్రహింస అనుభవిస్తున్నాడయ్యా .... ఓ రకంగా కోమాలో వుండబట్టి సరిపోయింది. లేకపోతేను ఆ దారుణం నేను వర్ణించలేను."

"త్రాగింది ఇంకా కడుపులోనే ఉంది. గొట్టంవేసి బయటకు లాగుతున్నారు. నరకం అంటే మరెక్కడో లేదు."

"ఇకనన్నా మనం కొన్ని అలవాట్లుతగ్గిస్తే బాగుంటుంది. కనీసం నరాలు దొరకటానికయినా మనం సన్నబడాలి."

"ఏం చెప్పుకున్నా ఈ కొంచెంసేపే. రేపటి నుండి అన్నీ మామూలే."

"సరే నేను వస్తాను."

మొత్తంమీద జనంలో మొదటిరోజున్నంత టెంక్షన్ లేదు. ఈ విధంగా కొన్నిరోజులు గడుస్తాయనే నిర్ణయాని కొచ్చారు. అందుకే ఎవరి పనులకు వారు వెళుతున్నారు.

ఉదయం గడిచింది.

శరీరాన్ని శుభ్రంగా తుడిచి బట్టలు కప్పారు.

యూరిన్ ఎక్కువగా రావటంలేదు.

ఎవరెవరో వచ్చి చూస్తున్నారు.

5

'విశ్వామిత్ర' పెళ్ళున నవ్వాడు.

అతని ముందు గ్లాసులో సగం దాకా పోసిన విస్కీ ఉంది. దాంతోపాటు చిప్స్ వున్నాయి. అతన్తోపాటు ఎర్రగా, నొక్కుల జుట్టుకల మరొకాయన వున్నాడు.

విశ్వామిత్రుడి అసలు పేరు ఏదో ఉంది. సత్య హరిశ్చంద్రలో ఆ పాత్ర తరుచుగా వేస్తూంటాడు. అందుకా

పేరు స్థిరపడిపోయింది.

రాజేశ్వరరావుకు విశ్వామిత్రుడు అనుచరుడు.

ఆయనకు విస్కీ పోసి అందించటంనుండి, ఆడపిల్లల్ని మాట్లాడి తేవటంనుండి అన్నిపనులూ చేస్తాడు. ఓసారి తన వారిమీద విపరీతమైన కోపంలో ఉన్నప్పుడు, మత్తులో "నీ కేదైనా చేస్తాను" అంటూ హామీ ఇచ్చాడు రాజేశ్వరరావు.

రాజేశ్వరరావు వ్యాపారం వదిలేసి, దానిమీద కేంద్రీకరించకుండా వదిలెయ్యటంతో నష్టాలు రావటం ప్రారంభం అయ్యాయి. ఆ సంస్థను తన పరంచేస్తే, సంస్కరించగలనని పనికట్టుకొని పోరేవాడు. అతన్తోపాటు అతని చుట్టం ఒకాయన తయారయ్యాడు.

అయితే రాజేశ్వరరావులో ఓ లక్షణం వుంది. ఆయనకు కోపంవస్తే తిరిగి లాక్కోగలడు. అందుకే విశ్వామిత్రుడు మూడుసంవత్సరాలు అగ్రిమెంటు రాయమన్నాడు.

అప్పుడు రాజేశ్వరరావు కొంచెం లోతుగా ఆలోచించాడు.

విశ్వామిత్రుడిపట్ల కుటుంబంలో, బయట ఎవరికీ సదభిప్రాయం లేదు. సంస్థను అతని కప్పగించటం ఎవరికీ ఇష్టంలేదు. మూడు సంవత్సరాలు దాటితే విశ్వామిత్రుడే ప్రమాదకరంగా మారతాడు.

అందుకే వాయిదావేస్తూ వచ్చాడు.

రెండు మూడు సార్లు ఆరోగ్యం పాడయిపోయిందన్న లక్షణాలు కనపడ్డాయి. పరీక్షించిన డాక్టర్లు ఈ అలవాట్లు పూర్తిగా మానెయ్యకుంటే ప్రాణానికే ప్రమాదం అని చెప్పారు.

హరీంద్రతో గతంలో రిలేషన్స్ దెబ్బతిన్నాయి. ఏదో విషయంమీద అభిప్రాయ భేదాలొచ్చి ఇద్దరూ చాలాకాలం

మాట్లాడుకోలేదు. ఈ నడుమకాలంలో తిరిగి సంబంధాలు గౌరవప్రదంగా పునరుద్ధరించబడ్డాయి. ఇప్పటికే అనేక విషయాల్లో ఇరువురి అభిప్రాయాలు కలవకున్నా, ఆ రిజర్వేషన్స్ వుంచుకొని ఒకరి నొకరు గౌరవించుకున్నారు.

హరీంద్రతో సంబంధాలు మెరుగు కావటం, మంచి మిత్రుల వత్తిడి మూలంగా, ఆయన తిరిగి పాత జీవితంలోకి రావటానికి ప్రయత్నాలు ఆరంభించాడు.

దాంతో తప్పని సరిగా విశ్వామిత్రుడికి దూరం అవుతున్నాడు.

విశ్వామిత్రుడు ఆయనకూ, కొడుక్కీ నడుమ సంబంధాల్ని శత్రు పూరితంగా మార్చేశాడు. అలాంటిది రాజేశ్వరరావు మారటం అతనికి దడ పుట్టించింది.

రాజేశ్వరరావు మారితే తనకు దిక్కులేదు.

అందుకే రాజేశ్వరరావుకు తార్చిన ఓ యువతి ద్వారా వత్తిడి ప్రారంభించాడు.

"అదికాదయ్యా, వ్యాపారం మొదలెట్టందే తిరిగి రానని సవాల్ చేశాను. ఇప్పుడే మొఖం పెట్టుకొని వెళ్తాం."

"నువ్వుండు బావా. రెండు గంటల్లో స్పృహ రావచ్చునంటున్నారు" అన్నాడు విశ్వామిత్ర.

"నాకా నమ్మకంలేదు. అంతగా తాగించాల్సింది కాదు."

"తాక్కపోతే మనకు సంతకం పెట్టడు. అందుకేగా రాత్రంతాకూర్చోబెట్టి తాగించాను. ఐనా సంతకంపెట్టాడా."

"పెట్టాక వా దేమయిపోయినా బాగుండేది."

"ఏం చేస్తాం. మనం అనుకొన్నట్లు జరగలేదు."

"అసలు పడిపోయినప్పుడే తీసుకు రావలసింది."

"బావా....ఎన్నిసార్లు పడలేదు. మెల్లగాలేస్తే సంతకం పెట్టించుకోవాలని ఆరాటపడ్డాను."

"అది సరే ఆ కాయితాలు ఏమయిపోయాయి."

"అదే తెలియటంలేదు. ఆయనెంత తెలివిగలవాడంటే చెరువులోకి నాదో ఎకరం కలిపింది. రిజిస్ట్రేషన్ అయిపోయింది. నా కింతవరకూ డబ్బు రాలేదు."

"ఓరి విన్నూ తగలెయ్య ...ఇంతకాలం చెప్పలేదే."

విశ్వామిత్రుడు నిట్టూర్చాడు.

"దురదృష్టంఅంటే ఇదికాకఏమిటి? ఈ చేతుల్తో మందు పోశాను. ఈ చేతుల్తోనే చెయ్యరాని పనులన్నీ చేశాను. ఊళ్ళో అందరిచేతా ఊయించుకుంటున్నాను. చిట్టచివరి నిముషంలో ఇలాకావటం నా ఖర్మకాకుంటే ఏమిటి? ఇంకో రెండు గంటల్లో విజయం సాధిస్తున్నామనుకుంటే ఈలోపు ఇలా జరిగింది. చూద్దాం....బ్రతుకుతాడేమో...."

తలుపుమీద చప్పుడయింది.

"ఎవరు."

లోపలకు వచ్చారెవరో.

"అయ్యగారికి సీరియస్‌గా వుందండి. ఇంకా రెండు గంటలే అంటున్నారు."

"అదేంటయ్యా....సరిగ్గా విన్నావా....స్పృహ వస్తుందని అంటున్నారు. సీరియస్ ఏమిటి?"

"కాదండయ్యా."

"సరే పద వస్తున్నాం."

విశ్వామిత్రుడు కంగారుగా లేచాడు.

ఇంకా రెండు గంటలే!

6

"హరీ" అన్నాడు గాద్గదికంగా మూర్తి.

"ఇంకా రెండు గంటలు. డాక్టర్ పెదవి విరిచాడు.

బాడీని తీసుకువెళ్ళటమే. వెంటనే ఫోన్ చెయ్యండి. రేపు వ్యాపారం బంద్ చేయండి. అందరికీ ముందే కబురుచేసి చెబితే మంచిది. ఆయన కోరిక ప్రకారం ఆయన పొలంలో దహనం చేద్దాం... ప్లీజ్ వెళ్ళి ఆ పని చూడు."

మూర్తి లిస్టు ఇచ్చాడు.

హరీంద్ర వెనక్కు తిరిగాడు.

"కోమా....కోమా....నువ్వెంత దారుణమైన దానివే." గొణుక్కున్నాడు

హరీంద్ర ఫోన్ ముందు కూర్చున్నాడు.

"హలో నేను హరీంద్రని....అవును. ఇంకా రెండు గంటలు. అసలు తీసుకువెళ్ళమనే చెబున్నారు. అవును. ఉదయం బాగానే వుంది అనుకొన్నారు. ఈలోపు కండిషన్ మారిపోయింది. అసలింతవరకూ స్పెషలిస్టు డేంజర్ తొలిగిపోలేదంటున్నాడు. ఇంకా కొన్ని ఫోన్‌కాల్స్ చెయ్యాలి."

"అవునండి ... లాభం లేదు ... రెండు గంటలే."

"అక్కడికే తీసుకొస్తాం. కబురు చెయ్యండి. మూర్తి చెప్పారు. అందరికీ ఫోన్ చేస్తున్నాం. ఇంకా లేదు. ఇప్పుడింక లాభం లేదు. ఉంటాను."

"అలాగే."

"అవును. అయిపోయింది. క్లియరుగా చెప్పారు. కేవలం రెండు గంటలే."

ఇంకా కొన్ని ట్రంకాల్స్ రావాలి.

మరికొన్ని ఫోనోగ్రామ్స్ బుక్ చేయాల్సి ఉంది.

గడియారం ముల్లు వేగంగా తిరుగుతున్నాయి.

గురక పెరిగిపోతూంది.

డాక్టర్లొచ్చారు.

తిరిగి రక్తం తీస్తున్నారు.

ఇంజక్షన్ పిరంజిని శరీరంలోకి దించుతున్నారు.

శరీరం అంతా తూట్లు పడిపోయింది.

నరం మాత్రం అందటం లేదు.

ప్రయత్నంమీద దొరికాక పిరంజిలోకి నురగ వస్తోంది.

"హరియప్.... ఇమిడియట్‌గా రిపోర్టు రావాలి."

ఎవరో పరిగెడుతున్న ధ్వని....

ఎక్కడో మందుల బాటిల్స్ పగిలాయి....

ఇంకా కొన్ని నిముషాలు....

జీవితం ఎంతటి విషాదకర, విస్మయ, ఉత్కంఠల సమ్మిశితమో అక్కడ వున్నవారి వదనాలు చెబుతున్నాయి. వ్యక్తి చివరి క్షణాల్ని ప్రత్యక్ష అనుభవంతో చూస్తుండటం కూడా శరీరాన్ని జలదరించే అనుభూతి.

ఇంకా కొన్ని నిముషాల్లో ప్రాణం పోతుంటే....

ఇంకా ఆ శరీరం మీద ప్రయోగాలెందుకు?

చివరి క్షణందాకా బ్రతికించాలనే ఆరాటమా?

మృత్యువుతో తుదికంట పోరాడాలనా!

7

తెల్లవారగట్ట ఎవరో తలుపుతట్టిన ధ్వని.

ఉలిక్కిపడి లేచాడు హరీంద్ర. ఎదురుగా సుభాకర్.

"ఏమిటిరా"

"ఫోన్ వచ్చింది"

"ఏమైంది"

"సీరియస్‌గా వుందట. ఇంకా రెండు గంటలు."

"ఎన్నిసార్లు చెబుతారలా"

"ఏమో మరి. నేను వెళుతున్నాను"

"సర్లే. నేనూ వస్తాను. పద"

హాస్పిటల్ చేరుకుని చకచక మెట్లెక్కి నడుస్తుంటే..

ఎక్కడినుండో ఏడుపులు....

హృదయం కంపిస్తోంది....

"ఓ శకం ముగిసింది"

ఎవరది....ఆ మాటలంటోంది.

మరింత ముందుకు నడిస్తే—

గది ముందు కూలిపోయిన అక్క!

"అంతా అ....యి....పో....యి....ం....ది"

హరీంద్ర అలానే నిలబడిపోయాడు.

* * *

విశ్వామిత్రుడికి తెలియని రహస్యం రాజేశ్వరరావు తనలో తాను నిక్షిప్తం చేసుకున్నాడు.

ఎప్పుడయితే తిరిగి తాను త్రాగుడికి తిరిగి లొంగి పోయాడో ఆనాడే తన బలహీనత మీద రాజేశ్వరరావుకు అసహ్యం వేసింది. అందుకే తన జీవితాన్ని స్వయంగా మృత్యువు కర్పించాడు....

త్రాగుతూ తన ఎగ్రిమెంటుమీద సంతకం పెడతాడని విశ్వామిత్రుడు ఆశించాడేగాని...ఆయన మృత్యువును ఆహ్వా నిస్తున్నాడని తెలియదు. తన కుటుంబాన్ని ఎంతగా ద్వేషించినా విశ్వామిత్రుడ్ని దెబ్బ కొట్టాడేగాని, ఒక్క చిన్న కాయితం కూడా అతనికి దక్కనీయలేదని, విశ్వామిత్రుడు ఆలస్యంగా గ్రహించాడు.

రాజేశ్వరరావు మరణిస్తాడనే నిజం—పదిహేనువేల బిల్లు చేసిన హాస్పటల్ యాజమాన్యానికి ఖచ్చితంగా తెలిసిన నిజం!!

□

కదిలించే కథ

జొన్నలగడ్డ రామలక్ష్మి

క్రటకటాల వెనుక అతడు పులిలా అటూయిటూ తిరుగుతున్నాడు. ఆ తిరగడంలో కసి, ఆవేశం వున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.

సెంట్రీ నాగిరెడ్డి ఆ ఖైదీని భయంభయంగా చూస్తు

న్నాడు. ఖైదీ లతడికి కొత్తకాదు కానీ ఈ ఖైదీని చూస్తూంటే అతడికి భయంగా వుంది. ఎందుకంటే ఈ ఖైదీ తనవంక అదోలా చూస్తున్నాడు. ఆ చూపుల కర్థం తెలియ డంలేదు కానీ వాటిలో ఆకలి కనబడుతోంది

ఆ ఖైదీ జైల్లోకి వచ్చి నాలుగు రోజులైంది. అతడిని చాలా ప్రమాదకరమైన మనిషిగా వర్ణించి చెప్పారు పై అధికారులు.

అతడొక మనిషిని అతి క్రూరంగా అత్యంత ఘోరంగా హత్యచేశాడు. అందుకు కారణం ఆవేశం. ఆవేశానిక్కా రణం అవమానం. అవమానమంటే అతడి భార్యకు మాన భంగం.

రాజు భార్య దేవిక. రాజు ఇంట్లోవుండగా భానుమూర్తి ఆ యింట్లో ప్రవేశించాడు. కత్తి చూపి బెదిరించి దేవిక చేత రాజుకు కాళ్ళూ చేతులు కట్టించాడు. అప్పుడు రాజు చూస్తూండగా దేవికకు మానభంగం చేశాడు. ఆ దృశ్యం రాజులో ఆవేశాన్ని పుట్టించింది. ఆ ఆవేశం అతడికి కట్లు తెంచుకునే బలాన్నిచ్చింది. అప్పుడతడు భానుమూర్తిని అతడు తెచ్చుకున్న కత్తితోనే వళ్ళంతా కుళ్ళబొడిచాడు. కళ్ళు రెండూ పొడిచేశాడు. కడుపులోంచీ ప్రేగులు బయ టకు లాగాడు.

భానుమూర్తి చేసిన ఘోరానికి తగిన శిక్ష పడింది. ఆ శిక్షను అమలు చేసిన నేరానికి రాజు ఇప్పుడు ఉరికంబమెక్క బోతున్నాడు.

ఇంకా అతడి కళ్ళలో కసి, పగ, ద్వేషం!

ఎవరిమీదనో అదంతా?

రాజు ఎవరివంక చూసినా ఇంకా కళ్ళలోని ఆ భావాలను వదలలేకపోతున్నాడు. అందుకే ఆ చూపులు నాగిరెడ్డికి

భయాన్ని కలిగిస్తున్నాయి.

మొదటి నాలుగురోజులూ నాగిరెడ్డి రాజుతో మాట్లాడలేదు. కానీ అదో రకంగా చూస్తున్నాడు. ఈరోజు చూపులింకో రకంగా వున్నాయి. మనిషి తనతో మాట్లాడాలనుకుంటున్నాడా అనిపిస్తుంది. అయితే నాగిరెడ్డికి మాత్రం అతనితో మాట్లాడానినిలేదు.

రాజు బోనులో పులిలా అటూ యిటూ తిరుగుతూంటే నాగిరెడ్డి చూడనట్లు నటిస్తూనే అతణ్ణి చూస్తున్నాడు—ఓర కంటితో.

మొత్తంమీద ఆరోజు రాజు ఆతణ్ణి పిలవనే పిలిచాడు.

"సెంట్రీ!" అన్నాడతడు

"ఊఁ" అన్నాడు నాగిరెడ్డి భయంగా.

"ఇలా దగ్గరగా వస్తావా?"

నాగిరెడ్డి అతడు కటకటాల్లోంచీ చేతులు చాపినా అందనంత దగ్గరలోకి వెళ్ళి—"ఏమిటీ?" అన్నాడు.

"నన్ని ఖైదునించి విడిపించవూ?" అన్నాడు.

ఆ మాటలో ఆవేశం లేదు. కసిలేదు. పసిపిల్లవాడు వేడుకుంటున్నట్లుగా వుందామాట.

నాగిరెడ్డికు యాభై ఏళ్ళ వయసుంటుంది. అతడిలోవి వృద్ధుడా పసిపలుకులకు చలించాడు. ఆ ఒక్క మాటలో అతడికి రాజంటే వున్న భయం పోయింది.

"ఈ ఖైదులోకి నీ అంతట నువ్వే వచ్చావు-తెలుసా?" అన్నాడు నాగిరెడ్డి గంభీరంగా. అతడి మాట రాజును మందలిస్తున్నట్లుగా వుంది.

"నా అంతట నేనిక్కడికి రాలేదు. అంతా మోసం, దగా! అన్యాయంగా నేనిందులో ఇరుక్కున్నాను...." రాజు అరిచాడు.

"ఇక నీకెంతో ఆయువులేదు-ఇప్పుడైనా నిన్ను నీవు మోసం చేసుకోకు-" అన్నాడు నాగిరెడ్డి.

"నీ నీతులెన్నైనా వింటాను. ముందు నా కథ వింటావా?"

"కథలు కల్పించకు...."

"కల్పనకాదు—నిజం!"

నాగిరెడ్డి మాట్లాడలేదు. కల్పనైతే తనకెందుకు. నిజమైతే తనకెందుకు-తను చేయగలిగిందేమీ లేనప్పుడు వినడంలో నష్టమేముంది?

"చెప్పు!" అన్నాడు నాగిరెడ్డి.

రాజు చెప్పడం ప్రారంభించాడు

సురేంద్రనాథ్ దగ్గర పనిచేస్తున్నాడు రాజు. ఇంచు మించు అతడికి ప్రైవేట్ సెక్రటరీ వంటివాడతడు. సురేంద్రనాథ్ కిద్దరు సెక్రటరీలు. ఒకడు అందరికోసం. మరొకడు కేవలం తనకోసం.

రాజును అందరికోసం అనే పెట్టుకున్నాడు సురేంద్రనాథ్. రాజు నీతికీ నిజాయితీకి విలువనిచ్చే మనిషి. న్యాయంకోసం పోరాడే మనిషి. సురేంద్రనాథ్ అన్యాయాల నెన్నో చేసినప్పటికీ నలుగురికీ తెలిసేలా చేయడు. నలుగురికీ తెలిసేలా అతడు చేసే పనులకోసం రాజు సెక్రటరీగా ఉంటున్నాడు. రెండో సెక్రటరీ శోధన్ సురేంద్రనాథ్‌కు అసలైన సెక్రటరీ అని తెలుసుకుందుకు రాజుకు కొంత కాలం పట్టింది. అది తెలిసేక రాజుకు మరికొన్ని రహస్యాలు తెలిశాయి. అతడు కలవరపడి సురేంద్రనాథ్‌కు తనకు తెలిసిన విశేషాలు చెప్పాడు.

సురేంద్రనాథ్ మండిపడి—"నీ జీతం నువ్వు తీసుకుని నీకు చెప్పిన పనులు చేయి. నా విషయాల్లో జోక్యం చేసు

కోను-" అన్నాడు.

రాజందుకు అంగీకరించలేదు. అప్పుడు సురేంద్రనాధ్ రాజు నుద్యోగం వదిలిపొమ్మన్నాడు. రాజందుకూ అంగీకరించలేదు. సురేంద్రనాధ్‌కు కొంత డైమిచ్చి ఆయన పద్ధతులు మార్చుకోమన్నాడు.

సురేంద్రనాధ్ రాజిచ్చిన డైముపయోగించుకుని అతడికి తెలిసిన రహస్యాలవల్ల తనకు ప్రమాదం లేకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకున్నాడు ఒకరాత్రి ఇద్దరు మనుషులతో రాజింటికి వెళ్ళాడు వాళ్ళు రాజును బంధించి వెళ్ళిపోయారు. సురేంద్రనాధ్ రాజు ఎదుట అతడి భార్య దేవికను మానభంగం చేశాడు.

ఆ తంతు పూర్తయ్యేసరికి సురేంద్రనాధ్ మనుషులిద్దరూ ఇంకో వ్యక్తినక్కడకు తీసుకుని వచ్చారు. రాజు స్నేహితుడతడు. రాజు సురేంద్రనాధ్ విషయమై కనుక్కున్న రహస్యాలకు ముఖ్య సాక్షి అతడు సురేంద్రనాధ్, అతణ్ణి అపహాయుణ్ణి చేసి ఘోరంగా చంపాడు.

"నాతో గొడవపెట్టుకున్న ఫలితమిది. సాక్షి చచ్చాడు. నీ భార్య చెడింది. నువ్వు హంతకుడివి. ఈ విధంగా నీ కథ ముగుస్తుంది...." అన్నాడు సురేంద్రనాధ్.

ఆయన తన మనుషులతో అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

ఆ రాత్రికి రాత్రే దేవిక ఆత్మహత్య చేసుకుంది. రాజు తనే స్వయంగా వెళ్ళి పోలీసులకు జరిగినదంతా చెప్పుకున్నాడు. అయితే అతడికథ అతడినే హంతకుణ్ణి చేసింది. సురేంద్రనాధ్‌కి బలమైన ఎలిబీ వుంది.

"జీవితంలో ఎప్పుడూ ఆవేశపడలేదు నేను. కానీ ఇలా హంతకుడిగా జైల్లో వున్నందు కావేశం వస్తోంది. నా భార్య నాక్కాకుండా పోయింది. నా స్నేహితుడు

చచ్చిపోయాడు. చెయ్యని నేరానికి నాకు శిక్షపడబోతోంది. ఉరిశిక్ష నా కెలాగూ తప్పదు. అన్యాయంగా నన్ను శిక్షిస్తున్న పాపం ప్రభుత్వాన్నంట కూడదు. ఒక్కసారి ఈ ఖైదునించి బయటపడితే—ఆ సురేంద్రనాథ్‌ని నిజంగానే హత్యచేసి మళ్ళీ పోలీసులకు దొరికిపోదామనుకుంటున్నాను...."

నాగిరెడ్డి నిట్టూర్చి—"నీ కథ నిజంలాగే అనిపిస్తోంది. ఈ నిజం కోర్టు కూడా నమ్మిఉంటే బాగుండేది—" అన్నాడు.

"కోర్టుల్ని నిజం నమ్మించలేదు. సురేంద్రనాథ్ లాంటి వాళ్ళే కోర్టుల్ని నమ్మించగలరు. ఇప్పుడు నా కనిపిస్తోంది-నాకులా ఎందరు—అన్యాయంగా వురికంబ మెక్కుతున్నారోనని!" అన్నాడు రాజు.

"ఏది ఏమైనా విధి ముందు మనం తలవంచక తప్పదు...."

రాజు దీనంగా—"నువ్వు నన్నొక్కసారి విడిపించవూ? బదులుగా నీకు ప్రత్యుపకారం చేస్తాను—" అన్నాడు.

"ఏం చేస్తావు?" అన్నాడు నాగిరెడ్డి సరదాకి.

"నీకేం కావాలో చెప్పు. అదిస్తాను...." అన్నాడు రాజు.

"నా కూతురు కామాక్షి చాలా అందంగా వుంటుంది. దాన్నో బ్యాంకులో చేస్తున్న కుర్రాడు ప్రేమించానంటున్నాడు. అయితే వాళ్ళమ్మా నాన్నా పదివేలు కట్నం కావాలంటున్నారు. ప్రేమించడమైతే చేతనైంది కానీ ఆ కుర్రాడికి వాళ్ళమ్మా నాన్నలకు నచ్చచెప్పడం చేతకాలేదు. ఆర్నెల్లలో కట్నమిచ్చుకుంటే పెళ్ళి జరుగుతుందన్నాడు.

పిల్ల సుఖపడుతుందని నాకూ మా ఆవిడకీ వుంది. కానీ ఆర్నెల్లు కాదు—ఆరేళ్ళెదురుచూసినా ఆ డబ్బు పోగు చెయ్యడం నావల్లకాదు. ఎలాగో అలా డబ్బు కూడపెట్టి పెళ్ళిచేస్తే బాగుండునని కామాక్షికీ వుంది. కానీ ఇది జరిగే పని కాదు ...”

“నన్ను వదిలిపెట్టు నీకా డబ్బు నే నిస్తాను....”

నాగిరెడ్డి నవ్వి—“నే నిక్కడ నేరస్థులు పారిపోకుండా చూడ్డానికేగాని—పారిపోవడానికి సహకరించడానికి వున్నా ననుకున్నావా?” అన్నాడు.

“నాలో మంచివుంది, న్యాయముంది. నేను తలపెట్టిన పనికి దేవుడు నాకు తప్పక సహకరిస్తాడు. నువ్వు కాక పోతే ఇంకొకరు నన్ను తప్పిస్తారు....” అన్నాడు రాజు.

“అయితే ఇంకేం—నన్నడగడ మెందుకు?” అన్నాడు నాగిరెడ్డి.

“నేను నిన్ను వేడుకోవడంలేదు. హెచ్చరిస్తున్నాను.”

“హెచ్చరికా?” అన్నాడు నాగిరెడ్డి ఆశ్చర్యంగా.

“అవును—హెచ్చరికే!”

“ఏమిటది?”

“నువ్వు నన్ను వదిలిపెట్టావా—నేను నీకు సాయం చేస్తాను. లేదా—జైల్లోంచి బయటకు వచ్చాక నీ అంతు చూస్తాను....” అన్నాడు రాజు.

ఆ మాటలకు నాగిరెడ్డి కాస్త భయపడ్డాడు. కానీ—“చూద్దాంలే—నువ్వు బయట పడినప్పటిమాట కదా!” అన్నాడు రాజుతో.

2

నాగిరెడ్డికు ఫ్లూ వచ్చింది. నాలుగు రోజుల్నించి అతడు డ్యూటీకి వెళ్ళడం లేదు.

ఈరోజే అతడికి కాస్త తేలిగ్గావుంది. వళ్ళు నొప్పులు పూర్తిగా తగ్గకపోయాయి. జ్వరం లేదు. తిన్నవి సహిస్తున్నాయి.

సరిగ్గా ఆ రోజునే అతడి సహోద్యోగి రమణయ్యవచ్చి—"ఇది విన్నావా నాగిరెడ్డి! రాజు జైల్లోంచి తప్పించుకున్నాట్ట...." అన్నాడు.

"ఆఁ" అని నాగిరెడ్డి నోరు తెరిచాడు పోయిన జ్వరం తిరిగొచ్చిందా అన్నంతలా అతడి వళ్ళు వేడెక్కింది.

"అవును — నిన్ననే పారిపోయాట్ట...."

"అదెలా జరిగింది?"

"మనవాళ్ళ సాయంలేనిదే ఈ పనెలా జరుగుతుందిలే..." అన్నాడు రమణయ్య అదోలా. అసలు విషయమేమిటో చెప్పమని నాగిరెడ్డి అడగ్గానే రమణయ్య గొంతు సవరించుకుని—"నీ వంట్లో బాగోలేదని సెలవెట్టగానే డ్యూటీకి విఠలరావుని వేశారు. అప్పుడే అనుకున్నాను నేను—ఇందులో ఏదో తిరకాసుందని...." అన్నాడు.

విఠలరావు కాస్త వున్నవాడే! అతడి కీ వుద్యోగమెందుకో తెలియదు. డిపార్టుమెంట్లో అతడికి మంచిపేరు లేదు. అతడు కాపలాగా వున్నప్పుడు ఖైదీలు తప్పించుకుపోయిన సందర్భాలు చాలా వున్నాయి. అలా జరిగినప్పుడల్లా అతడిని సస్పెండు చేస్తూంటారు. ఓ చిన్న ఎంక్వయిరీ కమిటీనివేసి అతడి తప్పేమైనా వుందా అని శోధిస్తారు. కమిటీ అతడి పాత్ర లేదని చెబుతుంది.

అసలు విషయమేమంటే—ఖైదీలను తప్పించాలనుకున్నప్పుడే విఠలరావును సెంట్రీగా వేస్తారని! అతడందుకే ఆ డిపార్టుమెంట్లో వున్నాడనీ, కొందరు ప్రముఖుల అండ అతడికున్నదనీ అంతా చెప్పుకుంటారు.

"చూడు—సురేంద్రనాధ్ అనే గొప్పవాడి కారణంగా ఆ రాజు జైల్లోపడ్డాడు. అంత గొప్పవాడికి అయిష్టుడైన వాణ్ణి—జైల్లోంచి తప్పించాలని ఎవరనుకుంటారు?" అన్నాడు నాగిరెడ్డి.

"ఏమో—ఏం చెప్పగలం? ఈమధ్య జైల్లోంచి ఖైదీలు పారిపోవడం—వాళ్ళే బ్యాంకునో దోచుకోవడం జరుగుతోంది. అంటే దీని వెనుక ఏదో పెద్ద ముఠా ఉండి వుండవచ్చు. లేదా రాజు విఠలరావు కేమైనా ఆశపెట్టి వుండవచ్చు. పదిమందికోసం కానిపనులు చేసేవాడు—తనకోసం మాత్రం కానిపనులు చేయడని లేదు కదా!"

"కానీ—మన డిపార్టుమెంట్లో ఇలాంటి లొసుగులుండడం మంచిది కాదు...." అన్నాడు నాగిరెడ్డి.

"మన డిపార్టుమెంట్లోనే ఏమిటీ—ఈ దేశంలో లొసుగుల్లేని డిపార్టుమెంట్లెక్కడా లేవు...." అన్నాడు రమణయ్య.

"అది సరేననుకో—నేరస్థుల నలా వదిలిపెట్టడం ప్రమాదం కాదా?"

"నేరస్థులవల్ల ప్రమాదమున్నవాళ్ళు కూడా నేరస్థులే అవుతారు. నీకూ నాకూ అలాంటివాళ్ళ వల్ల ప్రమాదమేముంటుంది చెప్పు!" అన్నాడు రమణయ్య.

అప్పుడు నాగిరెడ్డికి రాజు మాటలు చెవుల్లో గింగురుమన్నాయి.

"నువ్వు నన్ను వదిలిపెట్టావా—నేను నీకు సాయం చేస్తాను. లేదూ జైల్లోంచి బయటకు వచ్చాక నీ అంతు చూస్తాను...."

ఆ మాటలే చెవుల్లో గింగురు మంటూంటే నాగిరెడ్డి

శరీరమంతా భయంతో వణికింది.

అతడి అవస్థచూపి—"అదేంటి నాగిరెడ్డీ! అలా చూస్తున్నావు?" అన్నాడు రమణయ్య ఆశ్చర్యంగా.

తన భయాన్నతడికి చెప్పుకోవాలా వద్దా అని ఒక్క క్షణం తటపటాయించి—"ఆ రాజు నన్ను జైల్లోంచి పారిపోవడానికి సాయం చేయమన్నాడు. అందుకు నిరాకరించానని కోపంలో—జైల్లోంచి బయటపడితే నా అంతు చూస్తానని హెచ్చరించాడు. అంత సులభంగా అతడు జైల్లోంచి తప్పించుకుంటాడని తెలియక నేనతడిమాటలు లెక్కచెయ్యలేదు...." అన్నాడు నాగిరెడ్డి.

"ఓహో—అయితే ఇంకేం.... నీ రొట్టె విరిగి నేతిలో పడిందన్న మాట." అన్నాడు రమణయ్య.

నాగిరెడ్డికి అర్థం కాలేదు.

"ఆ రాజును పట్టుకుని పోలీసుల కప్పగిస్తే పదివేలు బహుమతి ఇస్తామని డిపార్టుమెంటు ప్రచురించింది. ఇప్పుడా రాజు వెతుక్కుంటూ నీ దగ్గరకు వచ్చాడంటే పట్టుకోవడం మరింత సులభం. పదివేలు వస్తాయి..." అన్నాడు రమణయ్య.

నాగిరెడ్డి తనింకేమీ చెప్పకూడదనుకున్నాడు. రాజు తన మీద పగతో వస్తాడేమోనని తను భయపడుతున్నాడు. రాజును పట్టుకోవచ్చుగదా అని రమణయ్యంటున్నాడు. మనుషుల్లో పిరికివాళ్ళొక విధంగానూ, ధైర్యవంతులొక విధంగానూ ఆలోచిస్తారనడానికింతకంటే సాక్ష్యమేం కావాలి.

నాగిరెడ్డి తన పిరికితనాన్ని రమణయ్యముందు ప్రదర్శించ దల్చుకోలేదు.

3

"నీ మూలంగా నే నిబ్బందిలో పడ్డాను—" అన్నాడు నాగిరెడ్డి.

"మధ్య నేనేం చేశాను?" అన్నాడు విఠలరావు.

"ఆ రాజు పారిపోవడానికి నన్ను సాయం చేయ మన్నాడు. చేయనన్నానని నామీద పగబట్టాడు. చావబోయే వాడి అన్యాయపు పగ నన్నేమీ చేయదనుకున్నాను. తీరా చూస్తే నీ హయాంలో అతడు తప్పించుకునిపోయాడు." అన్నాడు నాగిరెడ్డి.

"అయితే ఏమంటావు?"

"నేను లొంగనట్లే నువ్వూ ఆ రాజు చూపిన ఆశలకు లొంగకుండా వుండాల్సింది." అన్నాడు నాగిరెడ్డి.

"నీకూ నాకూ తేడా వుంది—" అన్నాడు విఠలరావు.

"ఏమిటది?"

"నీ యింటికీ, నా యింటికీ వున్నలాంటిదే!"

నాగిరెడ్డిది పెంకుటిల్లు. అదీ స్వంతంకాదు. నెలకు వందరూపాయల అద్దె యిచ్చి అందులో వుంటున్నాడు. విఠలరావుది డాబా యిల్లు. ఇంట్లో సకల సదుపాయాలూ వున్నాయి. ఆ యిల్లతడి స్వంతం.

"ఆశలకు లొంగినవాడిని ఐశ్వర్యం వరిస్తుంది. ఆ విషయం నాకు తెలుసు. కానీ అందువల్ల నేరస్థులు బయట పడతారు. సమాజానికి ప్రమాదం. నువ్వూ ఆ సమాజంలో ఒకడివి." అన్నాడు నాగిరెడ్డి.

"నాగిరెడ్డీ! నువ్వు చాలా అమాయకుడివి. జైల్లో వున్న నేరస్థులకంటె ప్రమాదకరమైన నేరస్థులు బయట వున్నారు. జైళ్ళలోకి నేరస్థుల్ని పంపించేదీ, జైల్లోంచి

నేరస్థుల్ని తప్పించేదీ—వాళ్ళే! మన మందరం వాళ్ళ చేతుల్లో ఆడే ఆట బొమ్మలం.” అన్నాడు వితలరావు గంభీరంగా.

“మనం అంటూ కలపకు. నువ్వూ ఆడించేవాళ్ళలో ఒకడివి....” అన్నాడు నాగిరెడ్డి కోపంగా.

“రాజు కథ విన్నావుగా.” అన్నాడు వితలరావు.

“ఊఁ”

“రాజు ఒక ప్రమాదకర వ్యక్తికి ఎదురు తిరిగాడు—తను నమ్మిన న్యాయంకోసమని! ఫలితంగా చేయని హత్యకు హంతకుడయ్యాడు. రాజులాంటి వాళ్ళను నేను చాలా మందిని ఎరుగుదును. అందుకే అలాంటి గతి నాకూ పట్ట కుండా జాగ్రత్త పడుతున్నాను.” అన్నాడు వితలరావు.

“అంటే?”

“అవినీతి ఐశ్వర్యాన్నిస్తుందికదా అని అందరూ అవి నీతిని ఆశ్రయించి ఆనందంగా వుండలేరు. సమాజం బయటవున్న కొందరు నేరస్థులకు సహకరించడం నాకు తప్పనిసరయింది. అందువల్ల ప్రస్తుతం నాపని బాగుంది. కానీ ఇలాగే ఎల్లకాలం గడవదని నాకు తెలుసు. ఎటొచ్చీ నాకిది తప్పదు....”

“ఇప్పుడు రాజేం చేస్తాడు?”

“మరీ ఎక్కువ వివరాలడగొద్దు. ఈవేళ్టికి సరిగ్గా నాలుగు రోజుల తర్వాత బ్యాంకు దోపిడీ ఒకటి జరుగు తుంది. అందులో పాల్గొనడానికి అంగీకరించాడు కాబట్టే రాజుకు జైలునుంచి విముక్తి లభించింది.” అన్నాడు వితల రావు.

రాజు బ్యాంకు దోపిడీకి ఒప్పుకున్నాడంటే నాగిరెడ్డి

కాశ్చర్యం వేసింది. అయితే అందుక్కారణం కూడా అత డూహించగలడు. సురేంద్రనాథ్‌పై పగతీర్చుకోవడం కోసం అతడు దేనికైనా తెగించి వున్నాడు.

"ఇప్పుడు నేనేం చేయాలి?" అన్నాడు నాగిరెడ్డి. అతడు తనకున్న ప్రమాదం గురించి విఠలరావుకు వివరించాడు.

విఠలరావు సాలోచనగా—"రాజువల్ల నీకు ప్రమాద ముందనడంలో సందేహం లేదు. నీకు నీవై ఈ ప్రమాదం నుంచి తప్పించుకోలేవు. రాజువల్ల ప్రమాదముందంటున్న ఆ సురేంద్రనాథ్‌ను పట్టుకుంటే అతడు నిన్ను రక్షించవచ్చు...." అన్నాడు.

"అతడు తన ప్రాణాల సంగతి చూసుకుంటాడు కానీ నన్నెందుకు రక్షిస్తాడు?"

"తప్పకుండా నిన్ను రక్షిస్తాడు...." అన్నాడు విఠలరావు. "రాజు ప్రమాదకరమైన వ్యక్తి. అతడు సురేంద్రనాథ్‌పై పగబట్టి వున్నాడు. అయితే సురేంద్రనాథ్‌కు మందీమార్బలం వుంది. అతడిపై దెబ్బతీయడం రాజుకంత సులభం కాదు. అందుకని రాజు ముందుగా నీ పని పడతాడు. సురేంద్రనాథ్ మనుషులు నీ యింట్లో మకాం పెడతారు. రాజెప్పుడక్కడికి వచ్చినా పట్టేస్తారు...."

"నీ అయిడియా బాగానేవుంది." అన్నాడు నాగిరెడ్డి సాలోచనగా.

"ఇందులో ప్రమాదమూ వుంది" అన్నాడు విఠలరావు. "నువ్వు రాజునుంచి రక్షించబడతావు, కానీ సురేంద్రనాథ్ గుప్పిట్లో ఇరుక్కుంటావు."

నాగిరెడ్డికి అర్థమైంది. తను సురేంద్రనాథ్ వద్దకు వెళ్ళలా వెళ్ళకూడదా అన్న మీమాంసలో పడ్డాడతడు.

4

"మీరేంచెప్పినా చేస్తాను. ముందు సురేంద్రనాథ్ మీద నా పగ తీరాలి." అన్నాడు రాజు. అతడికెదురుగా వున్న మనిషి ముఖంగుర్తు తెలియకుండా ముసుగులో వున్నాడు.

"సురేంద్రనాథ్‌ను చంపడం నీవల్లకాదు. ఆ ప్రయత్నంలో నువ్వు దొరికిపోతావు. కావాలంటే సురేంద్రనాథ్ చావుకు నేనేర్పాట్లు చేస్తాను."

"వద్దు....అతడిని స్వయంగా నేను చంపితేనే నాకు తృప్తి...."

"అయితే ముందు బ్యాంకుదోపిడీ....తర్వాతే సురేంద్రనాథ్ హత్య".

రాజు కాసేపాలోచించి —"సరే!" అన్నాడు.

అతడిముఖం ఎర్రగా వుంది.

ఇది తన కలవాటు లేని పని. కానీ ప్రతిఫలం చాలా ఎక్కువగా వుంది. ప్రతిఫలానికి మించిన రక్షణవుంది. తానెప్పటికీ పట్టుబడనన్న ఆశ అతడికి కలిగిందంటే ఆ ముసుగుమనిషే కారణం.

సరిగ్గా అనుకున్నరోజున ఒక వ్యానులో రాజు-అలాంటి మరో నలుగురు ఓ బ్యాంకుకువెళ్ళారు. అది ఓ కాలనీలో వుంది. చుట్టూ జనసమ్మర్దంలేదు.

ఒకడు బైట నిలబడ్డాడు— హెచ్చరిక కోసం....

ఒకడు వాచ్‌మన్‌ని లొంగదీసి ఆపాడు. ముగ్గురు లోపలకు వెళ్ళారు. వాళ్ళచేతిలో పిస్టల్సు చూపి అంతా తలవంచారు. మొత్తం క్యాషు ఎనిమిదిలక్షలుంది.

"బాస్ ఆశించినకంటే బాగా తక్కువుంది." అని రాజు అనుకుంటూండగా బ్యాంకులోకి సురేంద్రనాథ్ అడుగు పెట్టాడు.

అతడికక్కడున్న పరిస్థితి తెలియదు.

వ్యాన్ బయట ఆగివుంటే మామూలే అనుకున్నాడు. వాచ్‌మన్ పక్కనేవున్న దొంగనుచూసి వాళ్ళిద్దరూ ఒకరికొకరు కావలసినవాళ్ళనుకున్నాడు. వాచ్‌మన్ అతడిని హెచ్చరించే పరిస్థితిలోలేడు.

బ్యాంకులోపలకు బ్రీఫ్‌కేసుతో అడుగుపెట్టిన సురేంద్రనాధ్‌ని తిరుగుముఖంలోవున్న రాజు చూశాడు. చటుక్కున అతడినుంచి బ్రీఫ్‌కేసును లాక్కుని "అరవకు"...." అన్నాడు.

సురేంద్రనాధ్ రాజు చేతిలోని పిస్టల్ చూశాడు. రాజునతడు గుర్తుపట్టే అవకాశంలేదు. అతడు మారువేషంలో వున్నాడు.

మరో యిద్దరు సురేంద్రనాధ్‌ను సమీపించారు.

రాజు బ్రీఫ్‌కేసు తెరిచాడు. దాన్నిండా నోట్లకట్టలు....

ఒకటికాదు....రెండుకాదు....పద్దెనిమిది లక్షలున్నాయి.

సురేంద్రనాధ్ ఆ డబ్బును బ్యాంకులో డిపాజిట్ చేయాలని తెచ్చాడు. డిపాజిట్ కాకుండానే అది రాజు చేతిలో పడింది.

సురేంద్రనాధ్‌ని చూస్తూంటే రాజు శరీరం ఉడికిపోతోంది. కానీ ఆవేశాన్నణచుకున్నాడు. గదిలో ఓ బాంబును పేల్చి ముక్కు మూసుకున్నాడు.

బయటనున్న వ్యక్తి వాచ్‌మన్‌ని లోపలకు తోశాడు. రాజు అతడి అనుచరులు ముక్కులు మూసుకుని బయటకు

వచ్చారు. త్వరగా వ్యానెక్కారు. కొంతదూరం వెళ్ళి ఓ సందు చేరుకున్నాక వ్యానుకు నెంబర్ ప్లేట్ మార్చారు.

అక్కణ్ణించి ఒకడు వ్యానులో వెళ్ళిపోయాడు. మిగతా నలుగురూ కాలినడకన కొంతదూరం వెళ్ళారు. అక్కడ ఓ కారు వారికోసం ఎదురుచూస్తోంది. అంతా కారెక్కారు. కారు ఓ బంగళాచేరుకుంది.

రాజుకెంతో ఆశ్చర్యంగావుంది- "బ్యాంకు దోపిడీ ఎంత సులభం?"

బ్యాంకు దోపిడీ సులభం కావడానికి వెనుక ఎటువంటి అండదండలుండాలో ఏ శక్తి ఆ పని సులభం చేసిందో కూడా అతడికి స్ఫురించకపోలేదు.

5

"అయాం రియల్లీ వెరీ హాపీ!" అన్నాడా ముసుగు మనిషి. అప్పుడాగదిలో అతడి ఎదుట రాజు ఒక్కడే వున్నాడు.

"థాంక్స్!" అన్నాడు రాజు.

"నీకు నేను ప్రత్యేకంగా యాభై వేలు బహూకరిస్తున్నాను. ఎందుకంటే - పనికితగ్గ ప్రతిఫలం మనిషికి ప్రోత్సాహాన్నిస్తుంది. నువ్వింకా యింకా గొప్ప వ్యవహారాల్లో పాల్గొనాలని నా ఉద్దేశ్యం."

రాజు డబ్బందుకున్నాడు. మళ్ళీ- "థాంక్స్!" అన్నాడు.

"నీకింకో శుభవార్త. నువ్వు సురేంద్రనాథ్‌ని చంపాలనుకుంటే అందుకన్ని ఏర్పాట్లూ చేస్తున్నాను...." అన్నాడు ముసుగుమనిషి.

సురేంద్రనాథ్‌కి ఊరిచివర బంగళా ఒకటుంది. అక్కడతడు రహస్య సమాలోచనలు జరుపుతూంటాడు. ఈ

రోజతడు ఒంటరిగా రాత్రికక్కడ గడపబోతున్నాడు. స్పృహ తప్పించడానికి బ్యాంకులో అవలంబించిన పద్ధతు లక్కడా అమలుజరపవచ్చు. సురేంద్రనాథ్‌ను కలుసుకుని మాట్లాడ్డానికి కొందరు పెద్దలక్కడికి రావచ్చు. వాళ్ళు వెళ్ళ కుండా ముసుగుమనిషి ఏర్పాట్లు చేస్తున్నాడు.

"ఇవన్నీ చేయడంవల్ల మీకేమిలాభం?"

"సురేంద్రనాథ్ నిన్నేకాదు—నన్నూ మోసగించాడు."

"ఎప్పుడు?"

"బ్యాంకుకు తెచ్చిన పద్దెనిమిది లక్షలూ ఆ మోసానికి సంబంధించినవి. అంత డబ్బూ నన్ను మోసం చేసి బ్యాంకులో వేద్దామనుకున్నాడు. అతడు చెప్పినప్రకారం—మా రహస్య వ్యాపారంలో రావాల్సిన లాభం పద్దెనిమిది లక్షలు తగ్గింది. అది నిజమేనని నమ్మాను. కానీ నిజం ఈ దోపిడీలో బయటపడింది."

రాజు ఆలోచనలో పడ్డాడు.

"నీ కేమీ భయం లేదు. అతడిని కత్తితో హత్య చేయి." అంటూ కత్తి ఒకటి అందించాడు ముసుగు మనిషి.

రాజా కత్తినందుకున్నాడు.

"జాగ్రత్త! పద్దెనిమిదిలక్షల మోసాన్ని బైటపెట్టావనే నీకు యాభై వేలిచ్చాను. మిగతావాళ్ళకు ఇరవయ్యేసివేలే ఇచ్చాను...."

రాజు ముసుగుమనిషినుంచి సెలవు తీసుకుని అక్క ణ్ణించి బైటపడ్డాడు. మెడకు వ్రేలాడుతున్న ఓ గుడ్డ సంచీలో ఉన్నాయి యాభై వేలూ. కత్తినతడు జేబులోకి తోసేశాడు.

అతడి మనసునిండా కసి, పగ, ద్వేషం....

ఇప్పుడెక్కడి కెళ్ళాలో అతడికి తెలుసు ...

6

మంచి నిద్రలోవున్న నాగిరెడ్డి ఉలిక్కిపడి లేచాడు. ఎవరో అతణ్ణి తట్టిలేపారు. లేవగానే అతడికి కళ్ళువిడలేదు. ఒక్కసారి గట్టిగా కళ్ళు నులుముకుని ఎదురుగా చూసేసరికి తళతళలాడే కత్తిఒకటి కనబడింది.

నాగిరెడ్డి మళ్ళీ కళ్లు నులుముకున్నాడు. ఇప్పుడతడి నిద్ర పూర్తిగా తేలిపోయింది. కత్తిని పట్టుకున్న చేతినీ— ఆ చేయి తాలూకు మనిషినీ కూడా అతడు చూశాడు.

ఆ మనిషి రాజు!

నాగిరెడ్డి భయంతో అరవబోయాడు.

"అరవకు—అరిచావంటే చంపేస్తాను...."

అప్పుడు నాగిరెడ్డికి కాస్త ధైర్యం వచ్చింది-"అరవక పోతే చంపవా?"

"ఇంట్లో మీవాళ్ళంతా మత్తులోవున్నారు. నువ్వరిస్తే ఇంట్లోవాళ్లెవ్వరూ ఇక్కడకురారు...."

"నీకు పగ సురేంద్రనాధ్ మీదకదా....నా దగ్గర కెందుకు వచ్చావ్?" వణుకుతూ అన్నాడు నాగిరెడ్డి అయితే అతడి మనసులో రాజును పట్టిస్తేరాగల పదివేల రూపాయల గురించిన ఆలోచనలు కూడా వస్తున్నాయి.

"అక్కణ్ణించే యిక్కడకొస్తున్నాను...."

నాగిరెడ్డి కప్పుడు కలిగిన భయమింతా అంతాకాదు- "నేను నీకే మపకారంచేశాను?" అన్నాడు.

రాజతడి ప్రశ్నకు బదులివ్వకుండా—"నీకోసమే నేను జైల్నించి తప్పించుకుని వచ్చాను. నీ కోసమే నేనే నేరాని

కైనా ఒప్పుకున్నాను" అన్నాడు.

"ప్లీజ్ నన్నేమీచేయకు" అన్నాడు నాగిరెడ్డి.

రాజదోలానవ్వి-"పాపం-పూర్ సురేంద్రనాధ్! అలా అనేస్థితిలో కూడా లేడు" అన్నాడు.

"ఏంచేశావ్ సురేంద్రనాధ్‌ని...."

"సురేంద్రనాధ్ ఒక్కడూ మంచంమీద స్పృహ లేకుండా పడివున్నాడు. నీ యింట్లోకి ప్రవేశించినట్లే అతడింట్లోకీ ప్రవేశించాను. అతణ్ణి సమీపించి కత్తినెత్తాను."

"ఊఁ" అన్నాడు నాగిరెడ్డి.

"కానీ నేనతణ్ణి చంపలేదు. నేను మనుషుల్ని చంపలేను. జైల్లోంచి పారిపోయే ముందే నాకా అనుమానముంది."

"అయితే ఎందుకు పారిపోయావు?"

"చెప్పానుగా నీ కోసమని!" అన్నాడు రాజు.

"నేనేం చేశాను?"

రాజదోలానవ్వాడు "మిస్టర్ నాగిరెడ్డి! నాకీ లోకంలో ఎవ్వరూ మిగలలేదు. కానీ ఇంతకాలం నీతిగా బ్రతికాను. చచ్చేముందా నీతి తప్పడమెందుకూ అనిపించింది అయితే ఆ నీతిని శాపిస్తున్నది అవినీతేనని నేను జైల్లోంచి బైట పడ్డాక అనిపించింది. ఈ దేశంలో ఒకడు కాదు—ఇద్దరు కాదు. వేలాది సురేంద్రనాధ్‌లున్నారు. వాళ్ళను మౌనంగా ఈ సమాజం భరిస్తోంది. అలాంటప్పు డలాంటివాడినొకణ్ణి మట్టుపెట్టి నేనీ సమాజానికెందుకు సాయపడాలి? నేను సాయపడడంవల్ల నాకేమీ ఒరగదు. అందుకే జైల్లోంచి పారిపోవడం నేరంగా అంగీకరించి పోలీసులకు పట్టుబడదలిచాను."

"అయితే ...."

"ఈలోగా నీతిపరుడవైన నీకు సాయపడాలని నా కిష్టం లేని నేరానికి పాల్పడ్డాను. ఏమి నేరమని అడక్కు. ఎలా వచ్చిందని అడక్కు. నేను మీ యింటికి వచ్చేననిమర్చిపో. మనమిలా కలుసుకున్నామని మర్చిపో. నేను మళ్ళీ నీ సెల్‌లో నేవుంటే నువ్వే నాకు సెంట్రీవైతే ఆశ్చర్యపడు. నేను సంతోషంగా ఉరిశిక్షకు సిద్ధపడుతున్నాను" అని తన మెడలోవున్న సంచీలోంచి నోట్లకట్టలు తీసి అతడి ముందుంచి- "నీకథ నన్ను కదిలించింది. అందుకే జైల్లోంచి పారిపోయి ఈ డబ్బు సంపాదించాను. దీనితో నీ కష్టాలన్నీ గడిచినట్లే!" అంటూ అక్కణ్ణించి వెనక్కి తిరిగాడు.

అప్రయత్నంగా నాగిరెడ్డి ఆ డబ్బు లెక్కపెట్టాడు. మొత్తం యాభై వేలుంది. అతడికి కళ్ళుతిరిగి నట్లయింది. తమాయించుకుని "రాజూ!" అన్నాడు. అతడికి మళ్ళీ రాజు కనపడలేదు.

మర్నాడు రమణయ్య వార్తతెచ్చాడు-"రాజు నిజాన్ని హత్యచేసిన సురేంద్రనాథ్‌ని చంపాలని పారిపోయాట్ట. కానీ తను మనిషిని చంపలేక తిరిగి పోలీసులకు దొరికి పోయాడు."

నాగిరెడ్డి ఆ మాటవిని కళ్ళనీళ్ళు తుడుచుకున్నాడు.

రాజూ—"నీ కథ నన్ను కదిలించింది" అన్న అతడి మాటలు చెవుల్లో గింగురుమంటూంటే—"అతడినా ఈ సమాజం హంతకుడన్నది!" అని బాధపడ్డాడు. రాజు కథ ఎవరినైనా కదిలిస్తుంది. కానీ నాగిరెడ్డి చెబితేనేకదా ఎవరికైనా తెలిసేది? □

వగాబంద్ పేచీలాల్

బి. రాజేశ్వరి

శేషు కాఫీతాగి లేచాడు. బేరర్ బిల్లు తెచ్చియిచ్చాడు. నాలుగు రూపాయల నలభై పైసలు.

శేషు బిల్‌తో కౌంటర్ దగ్గరకొచ్చాడు. అతని ముందు ఓ లావుపాటి మనిషి ఏభై రూపాయలనోటు, బిల్లుయిచ్చాడు. కౌంటర్లో కూచున్నతను సరికొత్త పదిరూపాల నోట్లు

నాలుగు, ఓ అయిదురూపాయలనోటు, సగానికి చిరిగి పోయిన రూపాయినోటు. పదిపైసల నాణెం యిచ్చాడు.

లావుపాటి మనిషి వెళ్ళిపోయాడు.

శేషు ముందునుంచి వచ్చి మరోవ్యక్తి బిల్ చెల్లిస్తున్నాడు. అతను యిరవైరూపాయలనోటు, బిల్లుయిచ్చాడు. కౌంటర్లో వ్యక్తి మళ్ళీ సరికొత్త పదిరూపాయలనోటు అయిదురూపాయలనోటు, తక్కిన చిల్లరయిచ్చాడు.

శేషు వంతువచ్చింది. శేషు హడావిడిగా జేబుచూసుకుని, "బిల్ ఎగిరిపోయినట్టుంది!" అన్నాడు.

కౌంటర్లోనివ్యక్తి, "పోనీ బిల్లెంతో యిచ్చెయ్యండి. బిల్ లేకపోయిన ఫరవాలేదు" అన్నాడు.

"ఎంతో గుర్తులేదే! బేరర్‌ని పిలుస్తానుండండి" అన్నాడు శేషు అటు యిటు చూస్తూ. బేరర్ ఆర్డరు తీసుకుని కిచెన్‌లోకి వెళ్ళినట్టున్నాడు. హాల్లో లేడు.

ఈ లోపల నలుగురు బిల్లు చెల్లించారు. అందులో యిద్దరు పదిరూపాయలనోటిస్తే, ఒకతను ఏభై నోటు, మరొకతను యిరవై నోటు యిచ్చారు. కౌంటర్లోవ్యక్తి ఏభైకి చిల్లరయిస్తూ సరికొత్త పదినోట్లు నాలుగు, తక్కిన చిల్లరయిచ్చాడు.

శేషు క్రీగంట యిదంతా గమనిస్తూనేవున్నాడు.

ఈ లోపల బేరర్ రావటం, మళ్ళీ శేషుకి మరో బిల్ యివ్వటం జరిగింది. శేషు-బిల్లు, అయిదురూపాయల నోటు కౌంటర్లో యిచ్చాడు. అరవై పైసలు తిరిగి యిచ్చాడతను.

శేషు ఓ నిమిషం నిలబడ్డాడు. ప్రశ్నార్థకంగా చూశాడు కౌంటర్లోనివ్యక్తి.

"చిల్లర యివ్వలేదు" అన్నాడు శేషు తాపీగా.

"అదేమిటి? అరవై పైసలు యిచ్చేశానుగా!" అన్నా డతను ఆశ్చర్యంగా, ముఖం గంటుపెట్టుకుని,

"తక్కిన తొంభై అయిదు రూపాయలు యివ్వరా?"

"తొంభై అయిదేమిటి? మీరిచ్చింది అయిదు నోటేగా!"

"కాదు, వందనోటు!"

"అబద్ధం. అసలు నా దగ్గిర వందనోట్లేలేవు."

"బుకాయించకండి. మర్యాదగా చిల్లరనోట్లివ్వండి"

కౌంటర్ దగ్గిర జనం పోగయ్యారు.

కౌంటర్లోవ్యక్తి పౌరుషంగా కేష్‌వున్న సొరుగు బయటకు లాగి జనానికి చూపించాడు.

నిజంగానే అందులో వందరూపాయలనోట్లు లేవు.

కాని అన్నీ పదిరూపాయల నోట్లకట్టలు - సరికొత్తవి, వరసగా సొరుగులోపల పేర్చబడివున్నాయి. శేషు ఒక్క క్షణంలోనే ఆ నోట్లకట్టలమీది సీరియల్‌నంబరు, సిరీస్‌ని మెదడులో రికార్డు చేసుకున్నాడు.

కౌంటర్లోవ్యక్తి గర్వంగా, కోపంగా శేషువంకచూశాడు, యిప్పుడేమంటావన్నట్టుగా.

కౌంటర్ చుట్టూవున్న జనం శేషుని వింత మృగాన్ని చూసినట్టు చూస్తున్నారు.

శేషు చటుక్కున నేలమీదకు ఒంగి వందరూపాయల నోటు, మొదట బేరర్ యిచ్చినబిల్లు రెండూ తీసి కౌంటర్ మీదపెట్టి, "సారీ, ఇందాకా బిల్లుకోసం వెతికినప్పుడు వంద నోటు నేలమీద పడిపోయినట్టుంది. మీకిచ్చాననుకున్నాను" అన్నాడు.

కౌంటర్లో వ్యక్తిముఖం వికసించింది. ఇందాకాబిల్లు కనపడలేదని శేషు రెండోబిల్లు రాయించటం అక్కడ గుమికూడిన వాళ్ళలో కొందరు చూశారు కూడా. కౌంటర్

వ్యక్తి "ఫరవాలేదు. మీరిందాకా బిల్లుకోసం వెతుక్కోవటం నాకు తెలుసు. అప్పుడు పడిపోయుంటుంది." అన్నాడు నవ్వు ముఖాన పులుముకుంటూ.

"కెన్ ఐ గెట్ ఛేంజ్ ఫర్ హండ్రెడ్?" అన్నాడు శేషు.

"వై నాట్? విత్ ప్లజర్!" అంటూ కౌంటర్లోవ్యక్తి సరికొత్త పదినోట్లు పది తీసిచ్చాడు శేషుకి.

శేషు థాంక్స్ చెప్పి నోట్లు జేబులో పెట్టుకుని బయటికి వచ్చేశాడు.

2

డిటెక్టివ్ వాసు పాత న్యూస్ పేపర్లోని నోట్లబొమ్మలను నంబర్లను శేషు తెచ్చిన నోట్లతో సరిచూపి, "రైటే! ఇవి దొంగనోట్లు" అన్నాడు.

శేషు గర్వంగా చూశాడు వాసువంక.

"గుడ్ డిటెక్షన్! అయితే ఆ హోటల్ ప్రొప్రయిటర్ని వెంటనే కటకటాల వెనక్కి నెట్టాల్సిన సమయం ఆసన్న మయిందన్నమాట!"

శేషు వెంటనే మాట్లాడలేదు. వాసు రెట్టించాడు.

"మనం తొందరపడితే హోటల్ యజమానినిమాత్రమే పట్టించగలం! ఈ భాగోతం వెనక ఎంతోమంది పెద్ద పెద్ద వాళ్ళ అదృశ్యహస్తాలు వుండొచ్చు. అవి అదృశ్యమయి పోయే ప్రమాదముంది. తాపీగా వల పన్నాలి" అన్నాడు శేషు.

"అదీ నిజమే! కాని మన క్లయింటు కొడుకుని కేసు నించి తప్పించటం మన ప్రధాన ధ్యేయంగా పెట్టుకోవాలి కదా!" అన్నాడు వాసు.

క్రితంరోజు వాసు అండ్ శేషు డిటెక్టివ్ ఏజెన్సీకి ఓ

ముసలాయన ఆదరాబాదరా పరుగెత్తుకొని వచ్చాడు.

లోపలికి అడుగుపెడ్తూనే, "నా కొడుకుని రక్షించండి బాబూ! వాడిని పోలీసులు పట్టుకుపోయారు." అన్నాడు రుద్ధమైన కంఠంతో.

వాసు, శేషు ఆయన్ని స్థిమితంగా కూచోమని, జగ్‌లో నుంచి మంచినీళ్ళు వంచియిచ్చి సేద తీర్చారు.

"బాబూ! నాకు వాడొక్కడే కొడుకు. ఈ ముసలి వయసులో నన్ను కనిపెట్టుకునివుంటూ, నాకింత అన్నం పెడ్తున్నాడు. వాడ్ని అన్యాయంగా అరెస్టుచేసి జైల్లో పెట్టారు. వాడి భార్యాబిడ్డలు, నేను దిక్కులేని పక్షులమయి పోయాం. నేను రెండేళ్ళక్రితమే రిటైరయిపోయాను. నాకొచ్చే పెన్షను అంతంతమాత్రమే...." ముసలతను గుక్క తిప్పుకోవటానికన్నట్టు ఆగాడు.

"తాతగారూ! మీ కొచ్చిన భయమేంలేదు. అసలు జరిగిందేమిటో చెప్పండి." అన్నాడు వాసు అను నయంగా.

"చెప్తానుబాబూ! నా కాళ్ళు చేతులు ఆడటంలేదు. నా కొక్కగానొక్క కొడుకు గిరి. వాడు సుల్తాన్‌బజార్లో దాగాచంద్ సేఠ్ బట్టలషాపులో పనిచేస్తున్నాడు. దాదాపు పదేళ్ళనుంచి నమ్మకంగా పనిచేస్తున్నాడు. సేఠ్ తర్వాత ఆ షాపుకి వాడే యజమానిలా వ్యవహరిస్తున్నాడు. బొంబే వెళ్ళి గుడ్డలు ఖరీదుచేసి బుక్ చేయించి రావటం, కేష్ విషయాలు చూడటం, రిటైల్‌షాపులకి సరుకు పంపిణీ చేయటం యివన్నీ చాలా సమర్థవంతంగా చూసుకుంటాడు బాబూ! అలాంటి నమ్మకస్థుణ్ణి సేఠ్ యీ రోజు తన స్వహస్తాలతో పోలీసుల కప్పగించాడు!" ముసలతని గొంతు దుఃఖంతో పూడుకుపోయింది.

శేషు ముసలతనివంక జాలిగా చూశాడు.

"తాతగారూ! సంబాళించుకోండి మీ అబ్బాయి ఏ నేరమూ చెయ్యకపోతే విడిపించే బాధ్యత మాది. ఏ విషయమూ దాచకుండా చెప్పాలి మరి!" అన్నాడు.

"అలాగే బాబూ, విన్న జీతాలరోజు. సేఠ్ క్లాత్‌షాపులోను. హోటల్లోను. వర్కుషాపులోను పనిచేసే సిబ్బందికి నా కొడుకు గిరే జీతాల్ని పంచుతాడు. సేఠ్‌కి క్లాత్‌షాపు మాత్రమేగాక, అబిడ్స్‌లో ఓ హోటల్, నాంపల్లిస్టేషన్ రోడ్‌లో మరో హోటల్, స్టెయిన్‌లెస్‌స్టీల్ షాపువున్నాయి. వర్కర్సందరికీ గిరే క్లాత్‌షాపు దగ్గిరే జీతాలు పంపిణీ చేస్తాడు. శేఠ్ సుల్తాన్‌బజార్లోని షాపులోవుంటాడు. అందుచేత జీతాల పంపిణీ అక్కడే జరుగుతుంది.

జీతాలు పంపిణీలో దొంగ పదిరూపాయల నోట్లు కలిసినట్టు పోలీసులు కనిపెట్టారు. వర్కర్సు నిత్యావసర వస్తువులు కొనుక్కోవటానికి జీతాల్లో యిచ్చిన నోట్లు మారుస్తుండగా షాపువాళ్ళు అనుమానించి పోలీసులకి పట్టించారు.

పోలీసులు సేఠ్‌ని కల్సుకున్నారు. జీతాలు తమ గుమాస్తా గిరి పంచాడని, అతన్ని అడగండని సేఠ్ దగాచంద్ తప్పించుకున్నాడు. గిరి తను సేఠ్ యిచ్చిన డబ్బేపంచానని చెప్పాడు. కొత్త పదినోట్లు పంచావా అంటే పంచానని చెప్పాడు. సేఠ్ ప్లేటు ఫిరాయించాడు. తను అసలు కొత్త పదినోట్లే యివ్వలేదని, గిరి కొత్తనోట్లు పంచటం వింతగా వుందనీ ఆశ్చర్యం వెలిబుచ్చాడు.

అంతే. పోలీసులు నా కొడుకును అరెస్టుచేశారు. వాడికి దొంగనోట్లు మార్పిడీ చేసే ముఠాతో సంబంధముందనీ, జీతాల సమయంలో సేఠ్ యిచ్చిన మంచినోట్లు దాచేసి, వాటిస్థానే దొంగ పదినోట్లు సరికొత్తవి పంపిణీచేశాడనీ,

ఇరవై నోట్లు, ఏభై నోట్లు పంచివేననీ, వాటి మధ్య దొంగనోట్లు కలిపి చాలా తెలివిగా పంపిణీ చేశాడనీ వాడి మీద కేసుపెట్టారు. సేఠ్ మావాడ్ని కేసులో యిరికించేసి, తను తెలివిగా తప్పుకున్నాడు.

నమ్మకంగా యజమాని దగ్గిర రాత్రింబవళ్ళు ఊడిగం చేసినందుకు మావాడికి ఎలాంటి సన్మానం జరిగిందో చూశారా! ఈ పెద్ద వయసులో నా కడుపున చిచ్చుపెట్టాడు బాబూ!" ముసలతని కంఠం దుఃఖంతో మళ్ళీ పూడుకు పోయింది.

వాసు, శేషు అతను చెప్పిందంతా పొల్లుపోకుండా విన్నారు. సేఠ్ మోసంచేసి, గిరిని కేసులో యిరికించాడని స్పష్టంగా తెలుస్తోంది. కోటీశ్వరుడైన సేఠ్ మాటకున్న విలువ ముందు, పేదవాడైన గిరి మాటకు గడ్డిపరకంత విలువ కూడా వుండదు. సహజంగానే, సేఠ్ చెప్పింది నిజమని పోలీసులు నమ్మేశారు. అవసరమైతే సేఠ్ న్యాయాన్ని కొనేయగలడు. గిరి జైలు గోడలమధ్య మగ్గి పోవాల్సిందే!

"తాతగారూ! మీ కొడుకు నిర్దోషి అని మేము నమ్ముతున్నాం. మీ పేరేమిటి?" అన్నాడు వాసు.

"నన్ను వెంకట్రామయ్యంటారు బాబూ!"

"మీ పూర్తి అడ్రసు, మీ అబ్బాయి పనిచేసే షాపు వివరాలు, ఆ సేఠ్‌కున్న షాపులపేర్లు హోటల్స్‌పేర్లు, వాటి వివరాలు అన్నీ చెప్పండి" అన్నాడు శేషు నోట్ బుక్ పెన్ సిద్ధంగా పెట్టుకుని.

వెంకట్రామయ్య చెప్పిన వివరాలన్నీ జాగ్రత్తగా రాసుకున్నాడు శేషు. దగాచంద్ కోటికి పడగలెత్తినవాడు.

3

"నువ్విప్పుడు చూపివచ్చిన హోటల్‌ని సేఠ్ రెండో కొడుకు మెయిన్‌టెయిన్ చేస్తున్నాడు. ముందువాడ్ని పోలీసుల కప్పగిస్తే, వాళ్ళే నిజాన్ని కక్కిస్తారు. గిరి విడుదలవుతాడు" అన్నాడు వాసు.

"నువ్వు చెప్పింది కరెక్టే! ఎలాగూ రంగంలోకి దిగాం కదా, తక్కిన పనికూడా మనమే చేసేద్దాం. అసలు యీ దొంగనోట్లు ఎక్కడ్నుంచి సరఫరా అవుతున్నాయో కని పెడదాం. ఇంకా ఎంతమందికి యీ గూడుపుఠాణితో సంబంధముందో, వాళ్ళందర్ని చట్టానికి అప్పగిద్దాం." అన్నాడు శేషు ఆవేశంగా.

"ఈ లోపలవాళ్ళు జాగ్రత్తపడిపోతే, మొదటికే మోసం వస్తుంది. శాశ్వతంగా గిరి కటకటాల వెనక జీవితం గడపాల్సి వుంటుంది."

"అలా ఎన్నటికీ జరగనివ్వను. ఇప్పటికి ఒక హోటల్లో యీ దొంగనోట్లు చలామణీ కనిపెట్టాను. ఇంకా తక్కిన హోటలు, స్టెయిన్‌లెస్‌స్టీలుషాపు, వర్కుషాపు, క్లాత్‌స్టోర్సు అన్నీ అబ్జర్వ్ చేస్తాను. వీలైతే వాళ్ళు దొంగనోట్లు ముద్రిస్తున్నస్థలం కూడా కనిపెడతాను. అన్ని సాక్ష్యాధారాలతోను పకడ్బందీగా సేఠ్‌ని చట్టాని కప్పగిస్తాను."

"ఆవేశం ఒద్దు. దొంగ వ్యాపారస్థులు చాలా ప్రమాదకారులు. వాళ్ళ రహస్యాలు బయడపడకుండా చేయటంకోసం అధికారుల్ని పెద్ద పెద్ద వాళ్ళని నిర్దాక్షిణ్యంగా చంపేస్తారు. శవాన్ని కూడా కనపడనివ్వరు."

"ఇలాంటి దేశద్రోహుల ఆట కట్టించటానికి నా ప్రాణాలుపోయినా లెక్కచెయ్యను. ఈ వృత్తిలో రిస్కు నెదుర్కోవటానికే నేను బ్రహ్మచారిగా వుండిపోయానని

నీకు తెలుసు."

వాసు వెంటనే ఏం మాట్లాడలేకపోయాడు.

కొంతసేపటి తర్వాత తను చేయదల్చుకున్న పరిశోధన గురించి వాసుతో వివరంగా చర్చించాడు శేషు. వాసు కొన్ని సూచనలు చేశాడు.

శేషు నాంపల్లిలో స్టేషన్ రోడ్ లోవున్న సేఠ్ హోటల్ ని, స్టెయిన్ లెస్ స్టీలు షాపును గమనించాడు. అక్కడ కూడా పది రూపాయలనోట్లు సరికొత్తవి జనాలకి యధేచ్ఛగా చలామణీ చేయటం గమనించాడు. అయితే పదినోట్లు యిచ్చేటపుడు అన్నీ కొత్తవే కాకుండా, మధ్య మధ్య పాత పది నోట్లతో కలిపి కస్టమర్సుకిస్తున్నారు.

శేషు సుల్తాన్ బజార్లోని సేఠ్ దగాచంద్ వుండే క్లాత్ స్టోర్సు దగ్గర్లోవున్న మరో క్లాత్ స్టోర్సులోకి అడుగుపెట్టాడు. కౌంటర్లో కూచున్నవ్యక్తి శేషును సాదరంగా ఆహ్వానించి కూచోమని మర్యాద చేశాడు.

శేషు అతనివంక నవ్వుతూ చూశాడు.

అతను తన సేల్స్ మన్ వైపు చూసి, "అయ్యగారికేం కావాలో చూడండిరా!" అన్నాడు.

శేషు ఆశ్చర్యంగా చూశాడతనివంక. షాపులవాళ్ళు నూటికి తొంభై మంది ఉర్దూలోనే మాట్లాడతారు. తమ పనివాళ్ళతోను, కొండొకచో కస్టమర్సుతోను ఇతను అచ్చ తెలుగులో, కనీసం తెలంగాణాలో కూడా కాకుండా, గోదావరిజిల్లా భాషవాడటం చాలా చిత్రంగా తోచింది.

అతని ఆశ్చర్యాన్ని గమనించిన షాపతను "నేను పశ్చిమ

గోదావరిజిల్లా పాలకొల్లు వాడినిసార్! మిమ్మల్ని చూడగానే మన ప్రాంతం వారిలాగా కనిపించారు. అందుచేత తెలుగులో పలకరించాను, అంతే!" అన్నాడు.

శేషు ఆనందంగా చూశాడతనివైపు. "ఇక్కడ తెలుగువాళ్ళు ఉర్దూలో మాట్లాడటమే తమ జీవితాశయంలాగా, తెలుగు మాట్లాడటమే మహా పాపంలాగా భావిస్తుంటారు. కాని తమ మాతృభాషకే ద్రోహంచేస్తున్నామని తెలుసుకోరు. ఉర్దూలో మాట్లాడని సందర్భాల్లో మూడొంతులు ఉర్దూలో ఓ వంతు తెలుగును కలగలిపి, కలగా పులగంగా మాట్లాడుతూ వినేవాడి సహనాన్ని పరీక్షిస్తుంటారు. మీరు నాకు నచ్చారు" అన్నాడు.

షాపతను నవ్వి "నన్ను క్షమించాలి! స్థానికులు వచ్చినపుడు నేను దాదాపు పూర్తిగా ఉర్దూలోనో, మీరు యిప్పుడు చెప్పిన కలగూరగంప భాషలోనో మాట్లాడక తప్పదు. వృత్తి ధర్మం!" అన్నాడు.

పది నిముషాల్లోనే షాపతను శేషుకి చాలా ఆత్మీయుడైపోయాడు. ఆ షాపులోకి శేషు అడుగుపెట్టడానికి ముందు అతని వుద్దేశ్యం వేరు. సాటి బట్టల వ్యాపారస్థుడు కదా. సేల్ విషయాలు మెల్లగా ఆరాతీయొచ్చునని భావించాడు. వృత్తి శత్రుత్వం వల్ల ఖచ్చితంగా అదే వృత్తిలోని వ్యక్తుల గురించి తెలుసుకోవటం తేలిక. శేషుకి ఆ టెక్నిక్ బాగా తెలుసు.

అంతగా అయితే ఆ షాపతని దగ్గర ఓ రెండు జతల గుడ్డలు తీసి, మెల్లగా పరిచయం పెంచుకుని మెల్లగా అసలు విషయం రాబట్టాలని మొదట్లో అనుకున్నాడు. కాని,

యిప్పుడు గుడ్డలు తీసుకోవలసిన అవసరం లేకుండానే, ప్రాంతీయభిమానంతో అతను తనకి బాగా దగ్గరయి పోయాడు.

"మీతో కొద్ది నిమిషాలు పర్సనల్‌గా మాట్లాడటానికి వీలవుతుందా?" అనడిగాడు శేషు.

"తప్పకుండా, మీవంటి వారితో అప్పుడప్పుడు మనసు విప్పి మాట్లాడుకుంటుంటే ప్రాణం లేచివచ్చినట్టుంటుంది ....రండి, లోపలి గదిలోకి వెళ్దాం." అంటూ లేచి శేషును వెంటబెట్టుకుని లోనికి వెళ్ళాడు.

శేషు అతన్ని అనుసరించాడు.

ఇద్దరు కూచున్నాక శేషు, "దగాచంద్ గురించి కొన్ని వివరాలు కావాలి." అన్నాడు ఉపోద్ఘాతంగా.

షాపతను చిరునవ్వుతో తలాడించి "క్లాత్ స్టోర్స్ దగా చంద్ విషయమేగా మీ రంటున్నది! అన్నీ చెప్తాను. బై దిబై, నాపేరు సూర్యనారాయణ." అన్నాడు. శేషు తన పేరు చెప్పాడు.

ఓ అరగంటపాటు దగాచంద్ గురించిన అన్ని వివ రాలు శేషుకి చెప్పాడు సూర్యనారాయణ. ముఖ్యంగా గిరి లాంటి నిజాయితీపరులు చాలా అరుదుగా వుంటారని, దగా చంద్ కన్న ఎక్కువ జీతం ఆఫర్ చేసినా, అతన్ని వదిలి తన దగ్గరకు రావటానికి గిరి అంగీకరించలేదనీ, అలాంటి వాణ్ని దగాచంద్ జైలుకి పంపాడనీ, దగాచంద్ కృతఘ్ను డనీ మనసులేనివాడనీ చెప్పాడు సూర్యనారాయణ.

"అయితే, ఆ దొంగనోట్ల విషయం నిజమేనంటారా?" శేషు గొంతు తగ్గించి అడిగాడు.

సూర్యనారాయణ మందహాసం చేశాడు. "సేఠ్ దగా చంద్ కి తెలియకుండానే అతని వర్క్ర్సుకి జీతాలపంపిణీ జరుగుతుందంటే నమ్మ శక్యమేనా?" అన్నాడు.

"మరి, పోలీసులు కనీసం సేఠ్ షాపులుగాని, నివాసం గాని రైడ్ చేస్తే నిజం బయటపడేది కదా!" కావాలనే అమాయకంగా నటిస్తున్నాడు శేషు.

"అసలు రైడ్ చేసేదెవరు? పోలీసులు సేఠ్ గీచిన గీటు దాటరు. అన్నిటికన్నా మించినది—సేఠ్ దగా చంద్ కి యీ దొంగనోట్ల వ్యవహారంలో సహాయపడే వ్యక్తి వేరే వున్నారు."

"ఎవరతను?"

"అధికారంలోవున్న ఓ మంత్రి."

"పేరు?"

సూర్యనారాయణ చెప్పాడు. శేషు నిర్ఘాంతపోయాడు.

"అతనా?....అతను...."

"అవును అవినీతి పనులకు పేరొందినవాడు. బిగ్ హేండ్!"

"అయితే, యీ దొంగనోట్లు సేఠ్ నివాసంలోనో, అతనికి సంబంధించిన షాపుల్లోనో, హోటల్స్‌లోనో ఎక్కడో ముద్రింపబడుతూ వుండొచ్చునంటారా?"

"ఆ విషయం ఎవరికీ తెలియదు. ఈ నోట్లు ఎక్కడ ప్రింటవుతున్నాయో, ఏ షాపులో ఏ సమయంలో ఎలా మార్పిడి జరుగుతున్నదో ఎవరికీ తెలీదు. ఇదివరలో ఓ పిన్సిపయర్ అండ్ స్ట్రిక్ట్ పోలీసాఫీసరు సేఠ్ క్లాత్‌స్టోర్సు మీద నిఘావేసి రైడ్ చేశాడు. అంతకి రెండు నిమిషాల

క్రితమే దొంగనోట్లు చిల్లర కస్టమర్స్ కిస్తూనేవున్నాడు దగాచంద్.

సరిగ్గా రైడ్ చేసిన సమయంలో అతని దగ్గర చూద్దామంటే ఓ దొంగనోటు దొరకలేదు. దగాచంద్ ఆఫీసర్ మీద ఉగ్రుడైపోయి చిందులు వేశాడు. ఆఫీసర్ సారీ చెప్పి వెళ్ళిపోయాడు. వారం తిరిగేలోపల మంత్రిగారి పుణ్యమా అని ఆ ఆఫీసర్ ఖమ్మం జిల్లాలోని ఏదో ఏజెన్సీకి ట్రాన్స్‌ఫర్ మీద వెళ్ళిపోయాడు. దగాచంద్ అంత పవర్‌ఫుల్ మనిషి."

శేషు తలూపాడు. దగాచంద్ నోట్ల చలామణీ అంత ధైర్యంగా, బాహాటంగా చేయగలుగుతున్నాడంటే అతని వెనక యింత కథ వున్నదన్నమాట!

ఈలోపల కూల్‌డ్రింక్స్ వచ్చాయి. సూర్యనారాయణ స్వయంగా తనే డ్రింక్ శేషుకి సర్వ్ చేశాడు ఆప్యాయంగా. శేషు థాంక్స్ చెప్పి తీసుకున్నాడు.

4

"రండి రండి!" అంటూ ఆహ్వానించాడు కౌంటర్లో కూచున్న సేఠ్ దగాచంద్ కొడుకు.

వంద రూపాయలకి చిల్లర నోట్లు యిచ్చిన సేఠ్ కొడుకు పేరు పేచీలాల్ అని సూర్యనారాయణ చెప్పాడు.

"మీతో రహస్యంగా మాట్లాడాలి" అన్నాడు శేషు హిందీలో.

సేఠ్ పేచీలాల్ ఆశ్చర్యంగా చూశాడు. అతనికి మాత్రమే కనిపించేలా పర్స్‌లోనించి ఓ ఫోటో బయటికి

తీసి చూపించాడు. అందులో శేషు మంత్రిగారితో—దగా చంద్ మద్దతుదారైన మంత్రితో—ఎంతో సన్నిహితంగా వున్న పోజ్‌లో వున్నాడు.

పేచీలాల్ మొహంలో శేషు ఆశించిన మార్పు కనిపించింది.

"మీ పేరు?" అడిగాడు పేచీలాల్.

"షేక్ హుస్సేన్" అన్నాడు శేషు.

పేచీలాల్ ఏదో చెప్పబోతుండగా ఫోన్ మోగింది.

రిసీవర్ ఎత్తి చెవిదగ్గిర పెట్టుకున్నాడు. "హల్లో!" అన్నాడు.

"నేను .... మాట్లాడుతున్నాను. షేక్ హుస్సేన్ అని మనవాడి నొకడ్ని పంపించాను. అతని కెంతకావాలో యిచ్చి పంపించు. ఎక్స్‌ఛేంజ్ మన లెక్క ప్రకారం తీసుకో. మీ పితాజీ దగాచంద్‌తో ఫోన్‌లో మాట్లాడాను. ఓ-కే....!?" అని వినిపించింది అవతల్నుంచి.

పేచీలాల్ వినయంగా తలవంచి మరీ విన్నాడు. రిసీవర్ క్రేడిల్‌మీదుంచి శేషువంక నవ్వుతూ చూశాడు.

"మున్షీ!" అంటూ పిలిచాడు పేచీలాల్. ఎర్రగా పొట్టిగా పిద్దీలావున్న పాతికేళ్ళ కుర్రాడొచ్చాడు.

"కౌంటర్ మే బైఠో!" అన్నాడు పేచీలాల్ లేస్తూ, శేషువంక చూసి "ఆయియే సాబ్!" అన్నాడు నమ్రతగా. శేషు చేతిలో బ్రీఫ్ కేసుంది.

పేచీలాల్ శేషువంక తనవెంట రమ్మన్నట్టు చూసి హోటల్ బయటికి నడిచాడు. శేషు అనుసరించాడు.

దారిన పోతున్న టాక్సీ పిలిచాడు పేచీలాల్. ఇద్దరు కూచున్నాక టాక్సీ ముందు కురికింది.

"రామ్‌నగర్ చౌరస్తా" అన్నాడు పేచీలాల్.

టాక్సీ నడుస్తున్నంతసేపూ ఒక్క మాట కూడా మాట్లాడలేదు పేచీలాల్. చాలా కంట్రోల్డ్‌గా, మౌనంగా వున్నాడు.

రామ్‌నగర్ చౌరస్తా దగ్గిర టాక్సీ ఆపించి దిగాడు. మీటర్ ఫేర్ శేషు యివ్వబోతున్నా వారించి పేచీలాలే యిచ్చి టాక్సీని పంపేశాడు.

"నాతో రండి!" అంటూ కాలినడకన రెండు ఫర్లాంగులు నడిచి సిమెంట్ గొడౌన్స్ అన్న బోర్డున్న గొడౌన్ ముందు నిల్చున్నాడు.

"ఎంత కావాలి?" అన్నాడు మెల్లగా శేషుతో.

"ఎక్స్‌ఛేంజ్ రేటెంత?"

"టెన్ పర్సెంట్. మినిష్టర్‌సాబ్ చెప్పారు. ఆ రేట్‌న మీకెంత కావలసినా తీసుకోవచ్చు."

"అంటే ఓ లక్ష కరెన్సీ కావాలంటే నేను పదివేలు ఎక్స్‌ఛేంజ్ యివ్వాలన్నమాట. అంతే కదూ!"

"ఎగ్జాక్ట్లీ! ఎన్ని లక్షలు కావాలి?"

"రెండు."

"ట్వంటీ థౌజండ్ రియల్ కరెన్సీ."

"తెచ్చాను" బ్రీఫ్‌కేసువంక చూపించాడు.

"ఓ. కే!" పేచీలాల్ గొడౌన్స్ తలుపుమీద టకటక మంటూ కోడ్ భాషలో చప్పుడు చేశాడు.

దాదాపు ఎనిమిది అడుగుల ఎత్తున ఇనప గేటుంది గొడౌన్స్ గోడలో అమర్చబడి.

తలుపు కర్రుమంటూ శబ్దంచేస్తూ తెరుచుకుంది. లోప ల్నుంచి ముఖం మాత్రమే బయటికి కనిపించేలా ఓ వ్యక్తి తొంగిచూశాడు. ఆ తర్వాత తలుపు మరి కాస్త తెరి చాడు. పేచీలాల్ ముందు, అతని వెనుక శేషు లోపలి కడుగుపెట్టగానే ఆ వ్యక్తి తలుపు మూసేశాడు.

శేషు ఆశ్చర్యాన్ని అణచుకుంటూ లోపల దృష్టి సారిం చాడు. లోపల ఎక్కడో మిషను పనిచేస్తున్న శబ్దం విని పిస్తోంది. బహుశా ప్రింటింగ్ మిషను కావచ్చునని ఊహించాడు శేషు.

హాల్లో లైట్లు పట్టపగల్లా వెలుగుతున్నాయి. ఓ పెద్ద టేబిలు, దాని చుట్టూ నాలుగు కుర్చీలు వున్నాయి.

శేషువంక నవ్వుతూ చూసి, కూచోమన్నాడు పేచీలాల్. శేషు కూచున్నాడు.

"అన్నీ టెన్ రుపీ డినామినేషన్. అదయితేనే తేలిగ్గా చెలామణీ చేయవచ్చునని అవే వేస్తున్నాం. ఈ బ్రీఫ్‌కేసు పట్టదు. మా బ్రీఫ్ కూడా యిస్తాను, తీసుకు వెళ్ళండి!" అన్నాడు పేచీలాల్.

శేషు తలూపాడు. పేచీలాల్ యిందాకా తలుపు తెర చిన వ్యక్తివంకచూసి, "దోలాఖ్ లావ్!" అన్నాడు. అతను సలాంచేసి లోపలికి వెళ్ళాడు.

ఇంతలో తలుపుమీద చప్పుడయింది. ఇందాకా పేచీ లాల్ తట్టినట్టే కోడ్ భాషలో వినిపించింది. పేచీలాల్

ఆశ్చర్యంగా లేచి తలుపు దగ్గరకు నడిచి, తెరిచాడు. ఓర వాకిలిగా తెరిచి, వెంటనే త్రుళ్ళిపడి మూసెయ్య బోయాడు.

శేష మెరుపులా పేచీలాల్‌ని పట్టుకుని వెనక్కి లాగే శాడు.

వాసు ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, కానిస్టేబుల్సు బిలబిల మంటూ లోపలికి వచ్చేశారు. అందరి చేతుల్లోను రివాల్వర్సు, తుపాకులు గురిపెట్టబడి వున్నాయి.

పేచీలాల్ నిశ్చేష్టుడై నిలబడిపోయి "మోసం!" అంటూ అరిచాడు. ఈలోపల శ్రీకాంత్ లోపలికి దూసుకు పోయాడు. అవతల గదిలో నోట్లు ప్రింటుచేస్తున్న నలుగురు వ్యక్తులు, తప్పించుకునే దారిలేక లొంగి పోయారు.

వాసు, శేష శ్రీకాంత్ వెనకనే వెళ్ళిచూశారు. లోపల మిషన్‌మీద పదిరూపాయల నోట్లు ముద్రింపబడ్తున్నాయి. గోడకున్న అరల్లో కట్టలకొద్దీ పదిరూపాయల నోట్లు పేర్చ బడి వున్నాయి. కొన్ని నోట్లు నేలమీద పింగాణి బేసిన్సులో ఆరబెట్టబడి వున్నాయి.

శ్రీకాంత్ లాఠీతో పేచీలాల్ పొట్టలో కోపంగా పొడిచి, "బేవకూఫ్! చాలా పెద్ద ఎస్టాబ్లిష్‌మెంటే చేశావు. ఇప్పటికి ఎన్ని లక్షలు లోకంమీదికి వదిలేశావో రాస్కెల్!" అన్నాడు.

మిషన్ పక్కనే టెలిఫోన్ వుంది.

శేష పేచీలాల్‌కి రిసీవర్ అందించి, "మీ మినిష్టర్

సాబ్‌ని అర్జంటుగా యిక్కడికి రమ్మని పిలువ్. కారణం చెప్పొద్దు. అర్జంటుగా మాట్లాడాలని చెప్పు, అంతే!” అన్నాడు.

పేచీలాల్ మొరాయించబోయాడు. శ్రీకాంత్ యీసారి లాఠీతో అతని మోకాళ్ళమీద కొట్టాడు. పేచీలాల్ కుయ్యో! మన్నాడు. పేచీలాల్ నంబర్ డయిల్‌చేసి గొడౌన్స్‌కి వెంటనే రమ్మని తమ మద్దతుదారైన మంత్రికి ఫోన్ చేసి చెప్పాడు. శేషు అతని వీపుకి రివాల్వర్ నొక్కిపెట్టాడు.

శ్రీకాంత్ గొడౌన్స్ బయటవున్న తమ వేన్‌ని దూరంగా తీసుకుపొమ్మని డ్రయివర్‌కి చెప్పాడు. గొడౌన్స్ తలుపులు మూయించి మంత్రిగారి రాకకోసం అరదండాలు పట్టుకుని సిద్ధంగా వున్నాడు.

పేచీలాల్ హీనస్వరంతో, “మరి నా కిందాకా మా మినిష్టర్‌సాబ్ పేరుతో ఫోన్ చేసిం దెవరు?” అన్నాడు.

“నేనే!” అన్నాడు వాసు నవ్వుతూ “మా శేషుకి మీ మినిష్టర్ పాతప్లిల్‌తో ట్రిక్ ఫోటోగ్రఫీ కూడా చేయించింది నేనే! ఎలా వుంది? బాగా వచ్చింది కదూ!” అన్నాడు. పేచీలాల్ గుర్రుగా చూశాడు శేషువంక.

సరిగ్గా అప్పుడే బయట తలుపుమీద కోడ్ భాషలో టక టక శబ్దం. శ్రీకాంత్ తలుపు తెరిచాడు. లోపలికి దర్జాగా అడుగుపెట్టి, నిశ్చేష్టుడై నిలిచిపోయిన మంత్రిగారి చేతులకి ఇనుప సంకెళ్ళు తొడిగాడు ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్. □

చొప్పకి సాక్ష్యం

విపంచి

"ఏమండీ!"

తలెత్తి చూసాడు భోజరాజు.

ఎదురుగా వున్న పందొమ్మిదేళ్ళ అమ్మాయిని చూడ గానే, అప్రయత్నంగానే నోట్లో నుండి ఈలపాట దూసుకు

రాబోయి, ఆఫీసులో వున్నానన్న సంగతి గుర్తొచ్చి ఆగి పోయింది.

"యస్! నేను మీకేం చెయ్యగలను?" పెదవుల మీద మెదులుతున్న చిరునవ్వుతో అడిగాడు భోజరాజు.

"ఎడిటర్‌గా రుండేది ఎక్కడ?" తల దించుకుని ఆ హాల్లోనే కథల్ని చదవటంలో మునిగిపోయిన సబ్-ఎడిటర్‌లని, కుంచెలతో ఇలస్ట్రేషన్స్ వేస్తున్న ఆర్టిస్టుల్ని పరిశీలనగా చూస్తూ అడిగిందా అమ్మాయి.

"ఎడిటర్‌గారు యింకా రాలేదు. ఏమిటో మీ పని చెప్పండి" ఆ అమ్మాయితో మరికాసేపు ముచ్చటించ టానికి వుత్సుకత చూపుతూ అన్నాడు అసిస్టెంటు ఎడిటర్ భోజరాజు.

"నా పేరు మధురిమ. మీ పత్రికలో నావి నాలుగైదు కథలదాకా ప్రచురించబడ్డాయి. యిప్పుడు నేనో నవల వ్రాసాను. స్వయంగా కలిపి యిద్దామని వచ్చాను"చెప్పింది మధురిమ.

"నాలుగు కథలు పడిదేచాలు, నవలకి సిద్ధం" మనసులో గొణుక్కుంటూ, పైకి మటుకు చిన్నగా నవ్వాడు భోజ రాజు.

"అహా, అలాగా! చాలా సంతోషం. కూర్చోండి" ఎదురుగా వున్న కుర్చీ ఆఫర్ చేసాడు.

మ ధు రి మ కొంచెం సిగ్గుపడుతూనే, కుర్చీలో కూర్చుంది.

ఆ కూర్చోవటంలో ఆమె నడుము మీద అందంగా పడ్డ ముడుత భోజరాజు కళ్ళ పరిధిని దాటిపోలేదు.

"వాట్ ఏ బ్యూటీ!" భోజరాజు కళ్ళల్లో కపిజీర తారట్లాడింది.

మధురిమ పేరులోనే కాదు, అంగసౌష్ఠవానికి కూడా మధురంగానే వుంది.

భోజరాజు వయసు ఇరవయి మూడేళ్ళు. పత్రికాఫీసులో సబ్-ఎడిటర్‌గా వుద్యోగం వచ్చి సంవత్సరన్నర కావస్తున్నా పెళ్ళి చేసుకోలేదు. పెళ్ళి చేసుకోకపోయినా వయసొచ్చిన కోరికలు మటుకు అతడ్ని కాల్చేస్తున్నాయి.

"మీరు....?" తననే తదేకంగా చూస్తున్న భోజరాజుని అడిగింది మధురిమ.

"సబ్-ఎడిటర్‌ని! భోజరాజు నా పేరు. అఫ్‌కోర్స్, పత్రికల్లో మా పేర్లు పడకపోయినా, మీరు పంపించే రచన లన్నింటిని ముందుగా పరిశీలించేది మేమే!

సామాన్యంగా ప్రతి రచనని చదివి, ప్రచురించే అలవాట్లున్న ఎడిటర్లు ఒకళ్ళిద్దరు కన్నా ఎక్కువుండరు ఈ రంగంలో. సంతకం పెట్టడం వరకే వాళ్ళ బాధ్యత.

ముందు మాకు నచ్చాలి మీ కథలేవైనా. అప్పుడే అవి సంపాదకుడి దగ్గరికి వెళతాయి." కొంచెం ఆశ్చర్యంతో పెద్దవయిన మధురిమ కళ్ళకేసే చూస్తూ, ఆమెలో తన పట్ల 'ఇమేజ్'ని పెంచడానికి ప్రయత్నించాడు భోజరాజు.

మరో బాణం కూడా విసిరాడు.

"మీరా మధ్య పంపిన 'ప్రేమనే ప్రేమించు' కథ నాకు బాగా నచ్చింది" చెప్పాడు భోజరాజు.

మెరుపు దూసుకొచ్చింది మధురిమ మొహంలోకి.

ఆమె అందమైన పెదాలు ముసిముసినవ్వులు నవ్వాయి.

"ఫైన్!" పెదవి కొరుక్కున్నాడు భోజరాజు.

"ప్రేమ గురించి అంత అద్భుతంగా నిర్వచించి, వివరించిన మొట్ట మొదటి యువ రచయిత్రి మీరే!" అన్నాడు భోజరాజు కాసేపాగి.

మళ్ళీ నవ్వింది మధురిమ-భోజరాజు పిచ్చిని మరో మెట్టు పైకి ఎక్కించేలా.

"అంతటి అద్భుతమైన ఆలోచన మీకెలా వచ్చింది?"

ఓ వారపత్రిక అసిస్టెంట్ ఎడిటర్ తన కథల్ని అలా మెచ్చుకునేసరికి మధురిమలో చిరుగర్వం చోటు చేసుకుని ఏదో చెప్పుకుంటూ రాసాగింది.

భోజరాజుకి నటించడం బాగా వచ్చు.

అందులో అందమయిన అమ్మాయి ఎదుటే అయితే, నటరాజే తన నావహించినంత అద్భుతంగా నటిస్తాడు.

నటిస్తున్నాడు భోజరాజు-వింటున్నట్టు.

అతని కళ్ళు మాత్రం మధురిమలో సౌందర్య నిలయాలని వెతుక్కుంటున్నాయి.

అందంగా వున్నదనిపించిన ఏ ఆడదానిలోనయినా ఆనందాల్ని వెతుక్కోవడం భోజరాజు అలవాటు.

అరగంట కూర్చుంది మధురిమ-అతని ఎదురుగా.

అయినా సంపాదకుడు రాలేదు.

"ఎడిటర్‌గారు రాలేదు. నాకిచ్చి వెళ్ళండి మీరు నవల. వీలయినంతమటుకు మీ నవల ఏమాత్రం బాగున్నా ప్రచురించడానికి ప్రయత్నిస్తాం" చెప్పాడు భోజరాజు.

నవల యిచ్చి వెళ్ళిపోయింది మధురిమ.

"మళ్ళీ మరోమారు మధురిమ కన్పిస్తే బాగుంటుంది. మధురిమలోని మాధుర్యాన్ని చవిచూడవచ్చు" తనలో తానే చెప్పుకున్నాడు భోజరాజు.

అతని కోరిక ఫలించింది.

2

ప్రతి ఆదివారం నగరానికి పది మైళ్ళ దూరంలో వున్న ఆహ్లాదకరమయిన ప్రాంతానికి పిక్నిక్కి వెళ్ళడం భోజరాజు కున్న మరో అలవాటు.

అక్కడ కాటేజీలో ఓ రూమ్ అద్దెకు తీసుకుని తనతో బాటుగా వచ్చిన మిత్రులతో త్రాగుతూ, పేకాడుతూ ఆదివారాల్ని ఖర్చు పెడతాడు.

కాని ఆ ఆదివారం మాత్రం అతని మిత్రు లెవ్వరూ బయలుదేరలేదు పిక్నిక్కి. రేస్‌కోర్స్‌లకి వెళ్ళారు.

తన అలవాటు మానుకోవడం యిష్టం లేని భోజరాజు ఒక్కడూ బయలుదేరాడు.

అప్పుడు కన్పించింది మధురిమ.

కాటేజీ బయట వున్న లాన్స్‌లో పచార్లు చేస్తుండగా, పరుగు పరుగున భోజరాజు ఎదుటి కొచ్చింది మధురిమ.

ఆమెని చూసేసరికి భోజరాజుకి ఎంత ఆశ్చర్యం కలిగిందో, అంతకంటె రెట్టింపు ఆనందం కలిగింది.

"నా నవల ఏమయిందండీ." ఎంతో ఆసక్తితో అడిగింది మధురిమ.

భోజరాజు ఆ ప్రశ్నని పట్టించుకోలేదు.

పరుగు పరుగున రావటంవల్ల కలిగిన అలుపుతో ఎగ

సెగపి పడుతున్న ఆమె గుండెల్ని చూస్తూ, యధాలాపంగా అడిగాడు భోజరాజు.

"ఏమిటి యిలా వచ్చారు? వ్రాసుకోవడానికి యిక్కడి వాతావరణం ప్రశాంతంగా వుంటుందని యిక్కడికి వచ్చారా ఏమిటి?"

"అది పూర్తి నిజం కాదనుకోండి! అది కూడా ఓ కారణమే. ఫ్రెండ్స్‌తో కలిసి సర్దాగా వచ్చాను" చెప్పింది మధురిమ. "నా నవల...." రెండోసారి అడిగింది.

"రండి. అలా నడుస్తూ మాట్లాడుకుందాం" ఆ అవకాశాన్ని అనుభవంగా మార్చుకోవడానికి పధకాలు ఆలోచిస్తూ ఆహ్వానించాడు భోజరాజు.

ఇద్దరూ కలిసి నడవసాగారు.

కాటేజ్ దాటి, పొడవాటి రోడ్డుమీద నడుస్తూ-కొద్ది దూరం నడిచేసరికి బాగా పెరిగిపోయిన చెట్లు ఆహ్వానించాయి. ప్రక్క నుండి సెలయేటి గల గల విన్పిస్తుంది.

ఆ సెలయేటి ప్రక్కన, చెట్ల మధ్యలో తిరుగుతూ భోజరాజు వంటి మరికొంతమంది యాత్రికులు తారసపడ్డారు వాళ్ళకి.

వాళ్ళని దాటుకుంటూ ఇంకొంచెం లోపలికి పోయారు.

భోజరాజు ఎదురు చూస్తున్న ఏకాంతంలోకి నడిచేంత వరకూ మధురిమకు నచ్చేవిధంగా నవల గురించి మాట్లాడాడు. ఇక ఆ తర్వాత అతను నవల గురించి మాట్లాడదల్చుకోలేదు.

"మీరేం చేస్తుంటారు?" అడిగాడు భోజరాజు మధురిమని—పచ్చిక మీద కూర్చున్న తర్వాత.

"డిగ్రీ సెకండియర్ చదువుతున్నాను. సాహిత్యమంటే ఆసక్తి కాబట్టి, కథలు వ్రాస్తున్నాను" నవ్వి, చెప్పింది మధురిమ.

"ఐసీ!" మౌనంగా వుండిపోయాడు భోజరాజు.

అతని హృదయం వణుకుతుంది. గుండె కొట్టుకునే వేగం రెట్టింపు కావటం స్పష్టంగా తెలిపింది భోజరాజుకి.

అయినా తప్పదు

ఇదే అవకాశం.

అందమయిన కన్నెపిల్లని అనుభవించడానికి తను కాస్త ధైర్యం చేస్తే—

ఆ మధ్యాహ్నం మూడు గంటలు. చెట్లమాటులో.... సెలయేటి చప్పుళ్ళల్లో—మధురిమ సౌందర్యాన్ని తను ఆస్వాదించగలడు.

ఒప్పుకుంటుందా?

ధైర్యం చేసాడు భోజరాజు.

"మధురిమా!" పిల్చాడు.

తలెత్తి అతనికేసి చూపింది మధురిమ—ఆమెలో కొంచెం ఆశ్చర్యం భోజరాజు ఏకవచనానికి.

"మీ కథలే కాదు-మీరు కూడా అందంగా వుంటారు" చెప్పాడు వణుకుతున్న స్వరంతో.

మధురిమ అందమైన పెద్ద పెద్ద కళ్ళల్లో అనుమానం లీలగా తారట్లాడింది. "థాంక్యూ."

"నాకు కృతజ్ఞతలు వద్దు నేనే నీకు చెబుతాను కృతజ్ఞతలు—నీ అందం నా కోరికని తీర్స్తే" భోజరాజులో

మార్పు వచ్చింది.

చప్పున ఆమె కాళ్ళమీద పడిపోయి ఆమె కాళ్ళని చుట్టేసాడు. "నాకు నువ్వు కావాలి. నా దాహానికి నీదేహం మంచినీరు కావాలి" భోజరాజు చేతి[్రే]ళ్ళు మధురిమ మోకాళ్ళ మీదుగా ప్రాకుతున్నాయి.

"ఏమిటిది? వదులు!" విపరీతమయిన అసహ్యంతో అసహ్యంతో అతడ్ని విదిలించుకోబోయింది మధురిమ.

"నో! ఈ అవకాశాన్ని వదులుకోను" చెప్పాడు భోజ రాజు మధురిమని తడుముతూ.

వేల వేల గొంగళి పురుగులు ఒంటి మీద పాకుతున్నాయి-చిరాకు, భయం ముంచుకొచ్చింది మధురిమకు.

ఆమె నడుము మీది ముడుతవి కసిగా ముద్దు పెట్టుకున్నాడు భోజరాజు. మధురిమ అందంలోని మృదుత్వం అతడ్ని కాల్చేసింది.

"ఛీ!" మధురిమ విడిపించుకోవటానికి మార్గాలు ఆలోచిస్తుంది.

ఏమీ ఆలోచించే స్థితిలో లేడు భోజరాజు. తను చేస్తున్నది తప్పని అతని కేమాత్రం స్ఫురించలేదు.

కామం భోజరాజు శరీరాన్ని వణికింప జేస్తుంది.

భోజరాజు పెదాలు మధురిమ నడుము భాగాన్ని వదిలి మరి కొంచెం పైకి వెళ్ళాయి. చేతులతో మధురిమ వీపుని గట్టిగా నొక్కేస్తున్నాడు.

సరిగ్గా అదే సమయానికి—

"ఏం జరుగుతుం దక్కడ?" పెద్దగొంతు పురుములా వినబడింది.

సంతోషించింది మధురిమ—ఎవరో వచ్చారు. తనకి ఆపద తొలగినట్లే.

ఉలిక్కిపడ్డాడు భోజరాజు. ఆ చుట్టుప్రక్కల ప్రాంతానికి ఎవ్వరూ రారనే ధీమాతో అతనంతసేపు వున్నాడు.

ఒక్కసారిగా చల్లారిపోయింది అతనిలోని జ్వాల.

ఆ పిలుపు వినబడిన వైపు తలెత్తి చూసాడు.

ఎవరో నలభయ్యేళ్ళ వ్యక్తి అటువేపే వస్తున్నాడు—వేగమయిన నడకతో.

తన గుండెల మీదున్న భోజరాజు తలని విసురుగా వెనక్కి నెట్టింది మధురిమ.

చెమటలు పట్టేసాయి భోజరాజుకి. 'మానభంగ ప్రయత్నానికి శిక్ష తప్పదు!' అనుకుంటుంటే అతనిలో విపరీతమైన భయం.

తప్పించుకోవడానికి ఏమాత్రమైనా అవకాశం వుందేమోనని అటు-యిటూ చూసాడు.

లేదు!

తను చాలా దారుణంగా యిరుక్కుపోయాడు.

ఆ నలభయ్యేళ్ళ వ్యక్తి దగ్గర కొచ్చాడు.

వచ్చీ రాగానే ఆయన ఒక్క ముక్క కూడా మాట్లాడలేదు.

పిడికిలి బిగించి భోజరాజు ముఖం మీద కొట్టాడు.

ఆ దెబ్బలోని విసురుకి భోజరాజు పళ్ళు కదిలిపోయాయి. పెదవి చిట్లి రక్తం తొంగి చూపింది.

"రాస్కెల్! ఏళ్ళున్నాయి, బుద్ధి-జ్ఞానం లేదట్రా నీకు? ఆడపిల్ల అందంగా కనిపిస్తే బలాత్కారం చేయడానికి.

నే నలా వెళుతూ....ఊరికే యిలా తొంగి చూసాను. ఆ అమ్మాయి గింజులాట, నీ అత్యాచారం కనబడింది" కోపంతో కంపించిపోయాడా నలభయ్యేళ్ళ వ్యక్తి-వెంకట రత్నం.

"సమయానికొచ్చి నన్ను రక్షించారు" చెప్పింది మధురిమ. ఆమె కళ్ళ నిండా నీళ్లు.

"ఎవరూ వచ్చి కాపాడరు. మీ ఆడవాళ్ళు-మీ అంతట మీరే తప్పించుకోవాలి" మధురిమతో చెప్పి, ఆ వెంకట రత్నం భోజరాజు వయిపు తిరిగాడు. "నువ్వంతగా నీ నరాలు కొవ్వెక్కి కొట్టుకుంటుంటే, మీ అమ్మా బాబుతో చెప్పి పెళ్ళి చేయించుకో, బాగుపడతావు! ఇద్దరి యిష్టంతో పొందాల్సిన ఓ అందమైన ఆనందాన్ని బలవంతంగా మత్తుకళ్ళతో, కాలి విదిలింపులతో, గోళ్ళ రక్కులతో పొందబూనాలనుకోవడం నిజంగా పైశాచిక మూర్ఖత్వం!" చెప్పాడు వెంకటరత్నం.

తల దించుకుని వుండిపోయాడు భోజరాజు. అతనికి తన మీద తనకే జాలి వేసింది. "ఉద్రేకం తొందరపడేలా చేసింది, మన్నించండి! మరోమారు తప్పు చెయ్యను" గొణిగాడు అస్పష్టంగా.

"వెంటనే పోలీస్ కంప్లయింట్ యివ్వమ్మా! ఇలాంటి వెధవలకి పోలీస్ లాఠీదెబ్బలు తగిల్తేగాని, దార్లో పడరు" అన్నాడు వెంకటరత్నం భోజరాజుని అసహ్యంగా చూస్తూ.

భయపడ్డాడు భోజరాజు-పోలీస్ కంప్లెయింట్ అనే సరికి.

"మధురిమ కంప్లయింట్ యిస్తే, తన వుద్యోగం పోతుంది. పరువు పోతుంది! తల్లిదండ్రులకి తెలిస్తే- అందరికన్నా వాళ్ళే ముందు తనని నరికి పోగులు పెడతారు—"

ఆలోచనలు వువ్వెత్తున ఎగసిపడ్డాయి భోజరాజులో.

మధురిమ కాళ్ళమీద పడ్డాడు. "క్షమించండి! ఏదో తొందరపడ్డాను. మీ చెప్పుతీసి ఆ దవడా, ఈ దవడా వాయించండి! పోలీస్ కంప్లయింట్ మాత్రం యివ్వొద్దు" దీనంగా ప్రాధేయపడ్డాడు భోజరాజు.

మధురిమ సందిగ్ధంలో పడింది. తను ఆడపిల్ల! తనని యితడు మానభంగం చెయ్యబోయాడని రిపోర్టివ్వటం - తన కొంపకి తనే నిప్పెట్టుకోవటం .. అనవసరంగా అల్లరి పాలు కావటం-అదృష్టవశాత్తూ తను పాడుచెయ్యబడలేదు. అటువంటప్పుడు....

మధురిమ వుద్దేశాలని పసికట్టినట్లుగా చెప్పాడు వెంకటరత్నం. "వద్దు! అల్లరవుతుందని. అదని, యిదని ఏమాత్రం జంకినా వీడ్ని వదిలేసినట్లే! ఇప్పుడే యితడు దార్లోకి రావాలి. ఆడవాళ్ళని ఎంతగా అల్లరి చేసినా కంప్లయింట్ యివ్వరన్న అభిప్రాయాన్ని కలిగించారంటే.... మరింతగా రెచ్చిపోతారు యిలాంటి వాళ్ళు. ఆలోచించుకో!"

భోజరాజుని క్షణకాలం చూసింది మధురిమ.

ఆమెకి అతనిలో పశ్చాత్తాపం కన్పించింది.

"నా మీద ఏమాత్రం దయ వున్నా ఈ గొడవని రచ్చకి ఎక్కించకండి!" చెప్పిందామె వెంకటరత్నంతో.

3

భోజరాజు జీవితంలో అదే మొట్ట మొదటి అవమానం!

కారాగారపు పూచలకి బాగా దగ్గరయ్యి, చిటికెలో తప్పించుకున్నాడు - అది తన అదృష్టంకాదు, ఆ అమ్మాయి దయవల్ల.

ఆ రోజు రాత్రి బాధతో దహించుకుపోయాడు భోజరాజు.

తను మానభంగం చెయ్యబోవడానికి కారణ మేమిటి?

ఒకటి—వయస్సు!

రెండు-అదుపులో వుండని తన మనసు!

తన కాంక్షని తీవ్రతరం చేస్తుంటే తను చదివిన పుస్తకాలు-అప్పుడప్పుడు రహస్యంగా చూపిన నీలి నగ్న చిత్రాలు—అవకాశాలు, వాతావరణం.

కోరికలు తీర్చుకునే మార్గం లేక, తను తప్పుదోవ పడుతున్నాడు.

వేశ్యల దగ్గరి కెళ్ళటానికి సుఖరోగాల భయం!

అందుకే యిలా రోడ్డున పడబోయాడు.

రకరకాల ఆలోచనలు భోజరాజు కాలుస్తున్న సిగరెట్ పొగలా అతడ్ని ఆవరించుకొని వున్నాయి.

ఆ రోజు రాత్రి అతను చిత్తుగా త్రాగాడు-తనని తాను మర్చిపోయేంతటి మత్తును కలిగించేంతట చిత్తుగా.

మధురిమను మర్చిపోదల్చుకున్నాడు.

మర్చిపోయాడు.

కాని కుక్కతోక వంకరే!

* * *

ఆమె నవ్వింది.

ఆ నవ్వులో అందముంది-ఆహ్వాన ముంది.

ఆమె నవ్వుని ఆ రోజే చూసాడు భోజరాజు. ఆమె తన కోసమే నవ్విందని కూడా అతనికి అర్థమయింది.

ఆమె నవ్వేతూ పైట సవరించుకొంది.

ఓరగా చూపింది.

ఒక్క-క్షణం జంకాడు భోజరాజు-చుట్టుప్రక్కల ఎవ రయినా చూస్తున్నారేమోనని.

అంతవరకూ ఎవరూ చూడలేదు. మూడు యిళ్ళ ఆవలగా ఓ పెంకుటింటి ముసలాయిన తల తొంగి చూపింది.

గబగబా తన గదిలోకి నడిచాడు భోజరాజు.

సాయంత్రం ఆరున్నర.

వేసవి సంధ్య!

అందుకే చీకటి యింకా సరిగ్గా ముసురుకోలేదు.

మామూలుగా అయితే రూమ్ చేరుకున్న తర్వాత మొహం కడుక్కొని. మళ్ళీ పెంటర్లోకి చేరుకునేవాడు భోజరాజు.

కాని ఆ రోజు అతనలా చెయ్యదల్చుకోలేదు.

దానికి కారణం-ఆ ఎదురింటామె!

ఆమె గత రెండు మూడు సాయంత్రాలుగా తనని చూపి నవ్వటాన్ని అతను గుర్తించాడు.

ఎందుకు నవ్వుతున్నట్లు?

సిగరెట్ వెలిగించి ఆలోచనలో పడ్డాడు భోజరాజు.

కిటికిలోనుండి, ఎదురింటివైపుకి చూసాడు.

ఆమె యింకా యిటుపైపే చూస్తుంది- వయ్యారంగా వీధిగుమ్మానికి చేరగిలబడి.

ఎరుపురంగు ఆర్గండీ రంగుచీర కట్టుకునివుంది. ఆ చీరచాటున భోజరాజు కళ్ళకు కన్పించని అందాలు కన్పిస్తున్నాయి.

తనకి తెలిపి తెలియకుండానే జ్వాల రగిలిస్తున్నాడు భోజరాజు.

భోజరాజు తనకేసే చూడటాన్ని చూపిందామె

ఆట పట్టిస్తున్నట్లుగా, చేతితో సైగచేసింది - రమ్మన్నట్లుగా.

ఈసారి స్పష్టంగా అర్ధమైంది భోజరాజకి ఆమె ఉద్దేశం!

ఆ ఎదురింటామెకి పెళ్ళయ్యింది. మొగుడున్నాడు. కాని పిల్లలున్న దాఖలాలు ఎక్కడాలేవు.

ఆ ఎదురింటామెకి ఇరవై ఏడేళ్ళపైనే వుంటుంది వయసు.

"తను పట్టించుకోలేదుగాని. ఎదురింటామె అందంగానే వుంటుంది"—తొలిసారిగా భోజరాజుకి ఆ అభిప్రాయం కలిగింది.

ఆమె యింట్లోకెళ్ళింది.

వెచ్చగా నిట్టూర్చాడు భోజరాజు. "మరో అవకాశం తన ఇంటి ముంగిటే తారట్లాడుతుంది. తను సద్వినియోగం చేసుకోగిలగాలి" చెప్పుకున్నాడు తనకు తానే.

అయిదునిమిషాలు గడచిన తర్వాత, ఆ ఎదురింటామె మరింత అందంగా అలంకరించుకొని ఇంటికి తాళంవేసి,

ఎక్కడికో బయల్దేరింది.

అది చూసిన భోజరాజు అరక్షణం కూడా ఆలస్యం చెయ్యలేదు.

ఆమె వెనకపడ్డాడు.

తనకి, ఆమెకి మధ్య పదడుగుల దూరం మించకుండా చూసుకొంటూ, ఆమెని అనుసరించాడు భోజరాజు.

భోజరాజు తనని అనుసరిస్తాడని ఆమె ముందే వూహించగలిగినట్లుంది. మధ్యలో తల వెనక్కి త్రిప్పి, వెన్నెల్లా ఆహ్లాదకరంగా నవ్వింది.

భోజరాజు వ్యామోహాగ్నికి అది ఆజ్యం అయ్యింది.

"ఎక్కడిదాకా వెళుతున్నారు?" భోజరాజుకి తెలియకుండానే అతని గొంతు వణికింది.

"గుడికి! వచ్చే జన్మలోనైనా నీలాంటి మంచి కుర్రాడ్ని మొగుడిగా ప్రసాదించమని దేవుడ్ని ప్రార్థిద్దామని" చివరి వాక్యం అతనికి మాత్రమే వినబడేలా గొంతు తగ్గించి, చెప్పిందామె.

భోజరాజు నరాలు జివ్వుమన్నాయి.

ఆమెది హస్కీ వాయిస్!

ఆమెని అనుసరిస్తూనే, గుడికి వెళ్ళాడు భోజరాజు.

గుడి భక్తులతో నిండిపోయి. రద్దీగావుంది.

భోజరాజు గంట కొడుతుంటే, ఆమె అతని ప్రక్కకు వచ్చి, నిలబడింది.

ఆమె భుజాలు అతడి భుజాల్ని తాకాయి.

భోజరాజు శరీరంలో కంపన ప్రారంభమైంది.

దేవుడి విగ్రహం ప్రక్కనే రెండు దీపపు సమ్మె

ఉన్నాయి. జ్యోతులు వెలుగుతున్నాయి.

ఏదో శలభం మిణుగురు పురుగుగా భ్రమించి ఆ కాంతిని చేరింది.

ఆ శలభం ఏమైందో చూడలేదు భోజరాజు.

చూపివుంటే, అతనిలో రవ్వంత అయినా మార్పుకలిగి వుండేదేమో?

గుడిప్రక్కనే వున్న గన్నేరు చెట్టుదగ్గరికి చేరారు భోజరాజు, ఆమె.

ఎవ్వరూ వాళ్ళని పట్టించుకోలేదు.

"ఈరోజే చూసాను—మీరు నాకేసి చూడటం" చెప్పాడు భోజరాజు తడబాటు స్వరంతో.

"నేను మాత్రం చాలారోజుల్నుండి చూస్తున్నాను—మీకేసి" అన్నదామె.

"మీ పేరు?" భోజరాజుకు జంకు కాస్త తగ్గింది.

"భానుమతి!" చెప్పింది ఆమె. "రేపు రాత్రికి మా ఆయన వూరెళ్తున్నాడు. తలుపులుతెరిచే వుంటాయి!"

ఆ రోజు రాత్రి భోజరాజుకి నిద్రపట్టలేదు.

ఆ మరుసటిరోజు రాత్రిని తల్చుకొనేసరికి. భానుమతి తనకిలా లొంగిపోతుందని భోజరాజు ఏ మాత్రం అనుకోలేదు.

మరుసటిరోజు తనాశిస్తున్న అనుభవంలో ఆనందాన్ని పొందగలిగాడు! కాకపోతే అతను పాములా పొంచివున్న ప్రమాదాన్ని గుర్తించలేకపోయాడు.

నాలుగురోజులు ఆనందంగా గడిచాయి.

4

"ఇప్పుడా రావటం? రాత్రి సగం గడిచిపోయాక" చిరాకుపడింది భానుమతి.

ఆమె కంఠంలో మత్తుజీర వుంది.

జడలో తురిమిన మల్లెలు మెడమీదకి జారుతున్నాయి.

జవాబివ్వలేదు భోజరాజు. బదులుగా ఆమె మీదకి వాలాడు.

కాసేపు గడిచింది.

భోజరాజు భానుమతి మెడని ముద్దుపెట్టుకొంటుండగా అన్నది భానుమతి. "దొంగచాటు వ్యవహారాలు ఎంతోకాలం దాగవుకదూ?"

ఉలిక్కిపడ్డాడు భోజరాజు. ఆ మాట అణుబాంబులా ప్రేలిందతనికి.

చప్పున ఆమె మీదనుండి లేచి, అడిగాడు. "ఈ చుట్టు ప్రక్కలవాళ్ళల్లో ఎవరైనా మనల్ని అనుమానించారా?" అతనిగొంతు వణికింది.

"కాదు!" నవ్వి చెప్పింది భానుమతి.

"మరి....?"

"కాలాన్ని వృధాచెయ్యకు!"

"ముందు ఈ విషయం తేల్చు!" అసహనంతో చిన్నగా అరిచాడు భోజరాజు.

"రాత్రిపూట నిన్ను రప్పించుకోవటంతో ఈ చుట్టు ప్రక్కల వాళ్ళకి అనుమానం రాలేదు. కాని మా ఆయనకి నా మీద అనుమానమేపినట్లు నాకు అనుమానంగా వుంది" అన్నది భానుమతి.

క్షణకాలం ఆలోచనలోపడ్డాడు భోజరాజు. కథ చాలా దూరం వచ్చింది. వ్యవహారం శ్రుతి మించకమునుపే తను తప్పుకోవడం మంచిది!

"అయితే ఇప్పుడేం చెయ్యాలి?" ఆలోచిస్తునే, అడిగాడు భోజరాజు.

"ఏమో. నన్నేం చేసుకొంటావో చేసుకో! నన్ను నేను నీకు వదిలేసుకొన్నానుగా!!" కవ్విస్తున్నట్లుగా పెదవిని మునిపంట నొక్కుకుంది భానుమతి.

ఆ చర్య భోజరాజులో ఏ మాత్రం చలనం తీసుకు రాలేదు.

అతనిలోని భయమింకా తొలగిపోలేదు.

భోజరాజు దగ్గరకి జరిగింది భానుమతి.

గోముగా తన చేతులని అతని మెడచుట్టూ వేసి, ఒకే ఒక్క మాట అంది. "నేనూ నీతోబాటు వచ్చేస్తాను! నా మొగుడి నీడ ఏ మాత్రం పడనిచోటుకి, మన జాడ నా మొగుడు తెలుసుకోలేని చోటుకి పారిపోదాం. చాలా దూరంగా వెళ్ళిపోదాం. నాకు నువ్వుగా, నీకు నేనుగా జీవితాన్ని ఆనందంతో నింపుకొందాం."

ఆమె చేతుల్ని తన మెడమీది నుండి విసురుగా తీసేసాడు భోజరాజు. "నిన్ను పెళ్ళిచేసుకోవటమా? నువ్వు నా కంటె పెద్దదానివి!" కోపంగా చెప్పాడు.

తెల్లబోయింది భానుమతి.

"పెద్దదానినా? ఎంత! అయిదేళ్ళ తేడా కూడా వుండదు. అయినా నీ కోరికకి పనికొచ్చిన నేను పెళ్ళికి పనికిరానా? నేను కామంతో కళ్ళు మూసుకుపోయి, ఏ మగవాడితో

నైనా తిరగటానికి సిద్ధపడలేదు.

నాకు మా ఆయనతో కాపురం చేయటం యిష్టంలేదు. నాకు నచ్చిన తోడుకోసం వెదుక్కుంటుంటే, నువ్వు కన్పించావు. నేన్నిన్ను కేవలం కామించలేదు. ప్రేమించాను కూడా. నా ఆరాధనని గుర్తించు!

నువ్వు బాగా నచ్చావు. నిన్ను పెళ్ళిచేసుకొన్నాక, మళ్ళీ ఎవడితోనైనా తిరుగుతానని అనుమానపడకు. నా మాట నమ్ము! నిన్నే నమ్ముకున్నాను. అన్యాయం చేయటానికి ప్రయత్నించకు. ప్రయత్నిస్తే—?" తీక్షణంగా చూపింది భానుమతి.

అదంతా చిరాగ్గావుంది భోజరాజుకి.

"ఏం చేస్తావేం?" అన్నాడు.

అతని మనసులో ఆలోచనలపాటికి ఆలోచనలు సాగుతున్నాయి.

తనేదో కక్కుర్తిపడ్డాడు తప్ప, భానుమతిని ప్రేమించలేదు! తను భానుమతిని పెళ్ళి చేసుకుంటే అందరి ముందు అభాసుపాలవుతాడు. తల్లిదండ్రులు, బంధువులు అందరూ 'ఛీ'కొడతారు—సెకండ్ హేండ్ పెళ్ళాన్ని చేసుకొన్నందుకు. అంతకుముందే పెళ్ళయ్యిన ఆడదాన్ని తను పెళ్ళి చేసుకోవటానికి సిద్ధంగాలేడు.

పెళ్ళి చేసుకున్నాకైనా, భానుమతి సవ్యంగా ప్రవర్తిస్తుందని నమ్మకమేమిటి? తనకన్నా అందమైనవాడు కన్పడితే, వెళ్ళిపోవచ్చు.

కుక్కతోక వంకరపోతుందంటే ఎవడు నమ్ముతాడు?

"లేదు! నేన్నిన్ను పెళ్ళిచేసుకోను" తల అడ్డంగా

ఆడించి, దృఢంగా చెప్పాడు భోజరాజు.

కాలనాగులా బుసకొట్టింది భానుమతి.

"అనుభవిస్తావు భోజరాజూ!" తీవ్రంగా హెచ్చరించింది.

"నేను అందర్లో అల్లరిపాలైనా సరే, మన వ్యవహారాన్ని వీధికెక్కిస్తాను. నువ్వు నన్ను బలవంతంగా లొంగదీసుకున్నావని చెబుతాను. నా భర్త నిన్నూ, నన్నూ కలిపి నరికి పోగులు పెడతాడు. మర్యాదగా మనం లేచిపోదాం సరేనా?!" దేనికైనా సిద్ధపడ్డ తెగింపు ఆమె కంఠంలో స్పష్టంగా ధ్వనిస్తుంది.

చాలా ఆలస్యంగా పశ్చాత్తాపపడసాగాడు భోజరాజు. కోరి కాలు నీళ్ళల్లో పెట్టాక, పూర్తిగా మునగక తప్పదు!

తను చాలా తెలివిగా వదిలించుకోవాలి భానుమతిని.

"సరే, ఆలోచించి రేపు చెబుతాను" చెప్పి, భానుమతిని దగ్గరకు తీసుకున్నాడు భోజరాజు.

అతని మెదడులో బ్రహ్మాండమైన పథకం సిద్ధం చేయబడుతుంది.

కొద్దిసేపటి తర్వాత అన్నాడు. "రేపొద్దున్న నువ్వు నీ వంటిమీద వాతలు పెట్టుకోవాలి. జుట్టు విరబోసుకొని, దారుణంగా ఏడ్వాలి."

"ఎందుకు?" అర్థంకాలేదు భానుమతికి.

"మనం రెండుమూడు రోజుల్లో యిక్కడ్నుంచి వెళ్ళిపోతున్నాం. నిన్ను స్వర్గంలో విహరింపజేస్తాను.

మనం లేచిపోయినందుకు యిరుగు-పొరుగుకి మనమీద

అసహ్యం కలగకూడదు. సానుభూతి కలగాలి నీ మీద. నువ్వు చేసింది సరైనపనే అన్పించాలి వాళ్ళనోట. అదీ నా ఆలోచన!

నువ్వు రేపు యిరుగు పొరుగుతో మొత్తుకుంటావు. మీ ఆయన నిన్ను కొట్టి, చంపుతున్నాడని. అందరూ నీ మీద జాలిపడ్తారు. అదే మనకి కావల్సింది!" చెప్పాడు భోజ రాజు.

భానుమతి కళ్ళు మిలమిలా మెరిసాయి. భోజరాజు ఆలోచనలోని రెండో వైపు ఆమె వూహించలేక పోయింది.

ఆ మరుసటిరోజు భానుమతి దారుణాతి దారుణంగా తన భర్త తనని హింపిస్తున్నాడని చుట్టుప్రక్కలవాళ్ళతో చెప్పు కుంది.

5

భానుమతిని చంపటానికే నిర్ణయించుకున్నాడు భోజ రాజు.

భానుమతి బ్రతికివుంటే, తన బ్రతుకు బజారుపాలు చేస్తుంది!

నీట్‌గా, తన మీదకి ఎటువంటి అనుమానం రాకుండా భానుమతిని హత్య చెయ్యాలి!

అతనికారోజు మనసు మనసులోలేదు.

మధ్యాహ్నం మూడుగంటలు దాటుతుండగా వెళ్ళి, భానుమతి యింటితలుపులు తట్టాడు భోజరాజు.

ఆ సమయానికి భానుమతి భర్త యింట్లో వుండడని

అతనికి బాగా తెలుసు.

భానుమతి తలుపు తెర్చి, భోజరాజుని చూసి, ఆశ్చర్య పోయింది. "ఏమిటీవేళ వచ్చావు?"

"ముందు లోపలికి రానీ. చెబుతాను" లోపలికివెళ్ళాడు భోజరాజు.

అంతా క్షణాలమీద జరిగిపోవాలి. ఒక్క సెకను కూడా ఆలస్యం చెయ్యకూడదు.

ఆ రోజునుంచి భోజరాజు వరుసగా మూడు రోజులు సెలవుపెట్టాడు.

పావుతక్కువ నాలుగుకి విజయవాడవైపు వెళ్ళే ట్రయి నుంది. ఆ ట్రైన్‌లో విజయవాడ వెళ్ళిపోదల్చుకున్నాడు భోజరాజు.

స్టేషన్ వెయిటింగ్‌రూమ్‌లో సూట్‌కేస్‌వుంచి, బయటికి వచ్చాడు.

"నువ్వు చెప్పినట్లుగానే చేసాను" చెప్పింది భానుమతి.

"సంతోషం. ముందు ఓ కప్పు టీ కలిపియివ్వు" భానుమతితో బాటు వంటగదిలోకి నడుస్తూ. చెప్పాడు.

భానుమతి 'స్టౌ' వెలిగించి, 'టీ' పెట్టింది.

అటు-యిటూ చూసాడు భోజరాజు.

వంటగది మూలగా కిర్సనాయిల్‌డబ్బా కన్పించింది.

మెరుపులా కదిలి, ఆ కిర్సనాయిల్ డబ్బా అందు కుని, అందులోని కిర్సనాయిల్‌ను భానుమతిమీద గుమ్మ రించాడు.

భానుమతి ప్రతిఘటించటానికి అరక్షణం కూడా వ్యవధి యివ్వకుండానే, అగ్గిపుల్లతో ఆమె చీరకొంగు అంటిం

చాడు.

జ్వాలలు పైకెగసాయి.

క్షణకాలంలో శరీరమంతా వ్యాపించేసాయి.

బాధతో విలవిల్లాడుతూ, అరవబోయింది భానుమతి.

చప్పున ఆ వంటగదినుండి బయటపడ్డాడు భోజరాజు.

రెండో గదిలోని మంచంమీద తను ముందుగానే వ్రాసి తీసుకొచ్చిన ఓ వుత్తరాన్ని వదిలిపెట్టాడు.

"నా చావుకి నా భర్త హింసించటం తప్ప. మరేదీ కారణంకాదు. నా అంతట నేనే ఆత్మహత్య చేసుకుంటు న్నాను."

ఆ వుత్తరంలోని విషయాన్ని ప్రొద్దున్న భానుమతి చెప్పిన మాటలద్వారా యిరుగు-పొరుగు నిర్ధారిస్తారు.

ఆ వుత్తరంలోని వ్రాతగూర్చి ఎట్టి పరిస్థితుల్లో అను మానం రాకుండా వుండటానికి, అక్షరాలన్నింటిని కలిపి, గజిబిజిగా వ్రాసాడు.

చనిపోయేముందు హడావుడిగా వ్రాసిన ఆఖరి అక్షరాల్లా వున్నాయవి!

భానుమతి భర్త ముందుగా భానుమతి శవాన్ని వదిలించు కోవటానికి ప్రయత్నిస్తాడు.

పోలీసులవరకూ వ్యవహారం వెళ్ళదు!

భోజరాజు మరో అరగంటలో ఆ వూరి పొలిమేరలను దాటాడు.

6

"హత్య చేసి తప్పించుకోలేవు మిస్టర్ భోజరాజు!" ఇన్స్పెక్టర్ మూర్తి వత్తి పలికాడు

కత్తివేటుకి రక్తపుచుక్క లేనట్లు తెల్లగా పాలిపోయింది భోజరాజు మొహం.

"హత్యా? ఎవర్ని ఎవరు చేసారు?" మాటలు తడబడ్డాయి.

"నటించి ప్రయోజనం లేదు. తగిన సాక్ష్యాధారాలు సంపాదించే నిన్ను అరెస్టు చేయడానికొచ్చాను" చెప్పాడు ఇన్‌స్పెక్టర్ మూర్తి.

తెల్లబోయి చూస్తూనే వున్నాడు భోజరాజు.

తనెంతో పకడ్బందీగా చేసిన నేరం పట్టుపడట మేమిటి?

"ఓహ్, ఎలా పట్టుబడ్డానా అని బాధపడుతున్నావా? భానుమతితో నీకు అక్రమ సంబంధం వుంది. అది బయట పడకూడదనే ఆమెని హత్య చేసావు. నీలో కాముకత ఉద్రేకం, అవివేకం ఎక్కువని నీ గతం చెబుతుంది.

నెల రోజుల క్రితం నువ్వో అమ్మాయిని పాడుచెయ్య బోయావు. అవునా? నీ గురించి వాకబు చేస్తుంటే మధురిమ, వెంకటరత్నం చెప్పారు-నీ స్త్రీలోలత్వం గురించి.

నీ వ్యవహారం ఎవరికి తెలియదనుకున్నావు. కాని భానుమతి భర్తకి లీలగా అనుమాన మేసింది. అతను ప్రయివేట్ డిటెక్టివ్ ప్రహ్లాద్, నమశ్శివాయలని సంప్రదించాడు. వాళ్ళు నిన్ను అనుసరిస్తూనే వున్నారు.

"ఇక పోతే అసలయిన సాక్ష్యం!"

పాలిపోయిన భోజరావు మొహాన్ని చూస్తూ, నవ్వి చెప్పాడు ఇన్‌స్పెక్టర్ మూర్తి. "భానుమతి చనిపోతూ వ్రాసినట్లు ఆఖరి వుత్తరాన్ని సృష్టించావు."

"చేతివ్రాతలోని తేడావల్లా....?" గొణిగాడు భోజరాజు.

"కాదు! భానుమతికి అసలు చదువేరాదు. నిరక్షరాస్యి! భానుమతి భర్తకి ఆ విషయం తెలుసు కాబట్టి, అతను నిజంగా హత్య చేసి వుండినా ఆ పనికి తల్పడేవాడుకాదు. తన మీద తనే అనుమానాన్ని సృష్టించుకొనే మూర్ఖుడు కాదు.

పైగా నువ్వు సృష్టించిన ఆ సాక్ష్యపు కాగితం-మామూలు తెల్లకాగితం కాదు! పత్రికలవాళ్ళు మాత్రమే వుపయోగించే ఒక ప్రత్యేకమైన 'న్యూస్‌ప్రింట్!' నువ్వు సృష్టించిన సాక్ష్యమే, నిన్ను చట్టానికి అప్పగించింది!"

మౌనంగా చేతుల్ని ఇన్‌స్పెక్టర్ పట్టుకున్న సంకెళ్ళ వయిపుకి సాచాడు భోజరాజు. □



చెట్టుప్రక్కనున్న అడవుల్లోకి రాకాను వెతికేందుకు పంపిం చాడు. అతన్ని ఎవ్వరూ చూచినట్లుగానీ, జాడ కనిపెట్టి నట్లుగానీ వర్తమానం రాలేదు.

దాదా ఆలోచిస్తూ కూర్చున్నాడు.

"దాదా! మనం అనవసరంగా కాలం వృధా చేస్తున్నా మేమో?" అన్నాడు మేఘనాధ్.

"అంతకన్నా చేసేందుకు మరేముంది?" ఎదురు ప్రశ్న వేశాడు దాదా!

"రాకాకు ఆ మ్యాప్ దొరికివుంటే దాని సాయంతో అతడు కాంచన శిఖరం చేరుకునే ప్రయత్నంలో వున్నా డేమో?" కాలా తన అనుమానం వ్యక్తం చేశాడు.

"అందులో ఏముందీ అతనికి అర్థం కావాలిగా! పై పెచ్చు, అసలు తాళం మనదగ్గర వుంది. అతను అందాకా వెళ్ళినా, చేసేదేముంది?" అడిగాడు దాదా.

"నా అనుమానం, ఆ ముఖ్యమైన మ్యాప్ చనిపోయిన నాయకుడి శవంతోపాటు భూస్థాపితం చేసివుండాలి. రాకా కోసం వాళ్ళెటూ గాలిస్తున్నారు. రెండు దినాలయినా అతను దొరకలేదు. అనవసరంగా కాలయాపన చేయడం కంటే ఆ ప్రదేశాన్ని త్రవ్వి చూచి, మన అనుమానం తీర్చుకోవడం మంచిదేమో. అక్కడేమీ దొరక్కుంటే, మనమెటూ రాకా జాడకోసం ఎదురుచూడక తప్పదుగా." అన్నాడు కిశోర్.

"ఈ సలహా బాగానే వుంది!" అంది అపర్ణ.

"నాకు అలా చేస్తే బావుంటుందేమో ననిపిస్తూంది. కానీ మనం చాలా జాగ్రత్తగా వుండాలి. తగిన బందో

బస్తు చేసుకోవాలి. మన ప్రయత్నం వాళ్ళకు తెలిపినా, మధ్యలో పట్టుబడినా, రక్తపాతం తప్పనిసరవుతుంది." అన్నాడు దాదా.

"మనం అన్నింటికీ తెగించే వచ్చాం! రోట్లో తల పెట్టాక రోకటి పోటుకు భయపడ్తామా?" అన్నాడు కాలా.

దూరంగా ఎవరో వస్తున్న అలికిడయింది.

అందరూ సర్దుకుని కూర్చున్నారు.

'మామూ' అతని వెంట కొంతమంది సాయుధులైన వ్యక్తులు వచ్చారు.

"రాకా కోసం పంపిన మనుషులు వచ్చారు." అన్నాడు మామూ.

"దొరికాడా?" ఆత్రుతగా అడిగాడు దాదా.

"లేదు! ఏదో పులివాత పడ్డట్లున్నాడు. శవం దొరికింది. మొత్తం క్రుళ్ళిపోయివుందట. ప్రక్కన అతని కత్తి, విల్లమ్ములు, సంచీ దొరికాయి. తెచ్చారు" అంటూ వెనక నిలబడివున్న మనిషికేసి చూశాడు.

గోధుమ రంగులోవున్న సంచీ తెచ్చి నాయకుడి ముందుంచాడు.

అందులోవున్న వస్తువుల్ని ఒక్కొక్కటీ తీసి బయట పెట్టాడు.

దాదా తదేకంగా వాటినే గమనించసాగాడు. అతనికి కావలసిన పటం అందులో లేదు. అన్నీ ఏవేవో పనికిరాని వస్తువు లున్నాయి.

"వీటిలో మీరు అడిగినది వుందేమో చూడండి." అన్నాడు మామూ.

"లేదు!" వెంటనే సమాధానం చెప్పాడు దాదా.

"మరి ఆ వస్తువేమయినట్లు?" తనలో తనే అనుకున్నా పైకి అందరికీ వినబడింది మామూ మాట.

అంతా అచేతనంగా, అవాక్కయి, కూర్చున్నారు. అగమ్యగోచరంగా వుంది. ఎటు వెళ్ళాలో, ఎంత దూరం పోవాలో, అంత పెద్ద కాంచన శిఖరం చుట్టూ ఏ ప్రక్కన వెతకాలో, ఆచూకీ తెలీకుండా. అడుగు ముందుకువేసి ప్రయోజనముండదని అందరికీ తెలుసు.

"మామూ! మీ సహాయానికి మా కృతజ్ఞతలు. మేము బహుశా రేపు వెళ్ళిపోతాం." అన్నాడు దాదా.

"మీ యిష్టం. ఈ సేవకుడు ఎప్పుడూ మీ సేవకు హాజర్!" అంటూ లేచి నిలుచున్నాడు. మామూ వెంట వెళ్ళి, కాలువ దాటించి వచ్చాడు దాదా.

"దాదా! ఏమిటి మన గతి?" అందరూ అయోమయం లోంచి తేరుకుని అడిగారు.

"రాత్రికి ఆ శవాన్ని వెలుపలికి తీద్దాం. ఆ ప్రయత్నం కూడా చేశాక ఏం చెయ్యాలో నిర్ణయించుకుందాం. నిరాశ పడకండి." అన్నాడు దాదా.

'కాలా' నాయకుడు తెచ్చిన 'రాకా' సంచీ, వస్తువులు అన్నీ తీసి భద్రం చెయ్యసాగాడు.

"ఎందుకీ చెత్తంతా! దూరంగా విసిరి పారెయ్!" అన్నాడు మేఘనాథ్.

"సంచీ బాగుంది." అన్నాడు కాలా.

"అయితే వుంచుకో!"

సంచీని బాగా విదలించి, తర్వాత వాడుకోవచ్చునని

లోపలిభాగం వెలుపలికి వచ్చేట్లుగా చేశాడు. దాని రెండు ప్రక్కలా ఏమేమో బొమ్మలు కనుపించాయి. వాట్ని తదేకంగా చూశాడు కాలా. 'అతని కేమీ అర్థం కాలేదు.' అక్కడక్కడా మట్టి, రక్తం, చారలు గట్టివుంది.

"దాదా! ఈ గీతలు చూశారా?" అంటూ సంచీని చూపించాడు.

"గీతలా? ఎక్కడ?" ఆశ్చర్యంగా అంటూ మేఘనాథ్ ప్రక్కకు చేరాడు,

కాలా సంచి చూపించాడు దాదా కూడా దగ్గరగా వచ్చి చూశాడు. అందరూ చుట్టూ చేరారు.

"కాలా! ఆ సంచీని నీళ్ళల్లో బాగా కడిగి తీసుకురా?" అన్నాడు దాదా.

'కాలా' దగ్గరున్న సంచీని తీసుకుని మేఘనాథ్ వెళ్లాడు కాలువ దగ్గరకు. నీళ్ళలోకి దిగి సంచీని బాగా తడిపి చెయ్యిపెట్టి రుద్దసాగాడు. కాలా కూడా నీళ్ళలోకి దిగాడు.

"నా చేతిలోంచి సంచీ ఎందుకు లాక్కున్నావు?" అడిగాడు కాలా. దాన్ని అందుకునేందుకు చెయ్యి ముందుకు పెడుతూ.

"శుభ్రం చేసేందుకు....?" అన్నాడు మేఘనాథ్.

"నాకు చేతకాదా? దాదా నన్నే కడగమన్నాడు. సంచీ ఇలా ఇవ్వు" అంటూ మేఘనాథ్ చేతిలోవున్న సంచీ గుంజుకున్నాడు కాలా. కానీ మేఘనాథ్ పట్టు గట్టిగా వుండటంలో సంచీ కాస్త ముందుకువచ్చినట్లే వచ్చి జారిపోవడంతో, కాళ్ళు పట్టు తప్పి, కాలా వెల్లకిలా నీళ్ళలో పడిపోయాడు. అతని నెత్తికున్న టోపీ దూరంగా

అపరాధ పరిశోధన పోటీ-202

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితంపై వ్రాసి, దానితో రూ. 1-00 విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ రు. 1-00 పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హోం. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 5-5-'85 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు జూలై '85 నెల సంచికలో ప్రచురిస్తాము. *

1. ఇండియా ఇటీవల క్రికెట్ రంగంలో మరోసారి 'ప్రపంచ కప్' గెలుచుకోవటం—? (రెండవసారి, మూడవసారి)
2. పొరుగు దేశాలతో మనకీ బాధ తప్పటంలేదు—? (పోరు, శరణార్థులు)
3. సామాన్యుడికి కాదు కదా, మధ్య తరగతి కుటుంబీకులకు కూడా ఇప్పుడిది గగన కుసుమమైంది—? (సిమెంట్, బంగారం)
4. 'రాజీవ్ గాంధీ బడ్జెట్' ప్రభావంవల్ల ప్రతి వస్తువు ధర (పెరుగుతుంది, నిలకడగా వుంటుంది)
5. ప్రభుత్వ విధానాలు కొన్ని వర్గాలనిలా తయారు చేస్తున్నాయి—? (చైతన్యవంతులుగా, సోమరులుగా)

పోయింది. ఒక మునకవేసి, పైకిలేచి, మళ్ళీ మునిగాడు కాలా, చక్కగా నిలబడే ప్రయత్నం చేస్తూ.

అలా నీళ్ళల్లో పడుతూ లేస్తూవున్న 'కాలాను' చూసి నవ్వసాగాడు మేఘనాధ్.

కాలా ఒకసారి లేచి నిలుచుని రెండుచేతులతో మొఖాని కంటుకున్న నీళ్ళు తుడుచుకుని కళ్ళు తెరిచాడు.

మేఘనాధ్ చేస్తున్నపని ఆపి కాలాను తదేకంగా చూస్తూ విస్తుపోసాగాడు.

"నీళ్ళలోకి తోసిందిగాక, ఎందుకలా వెర్రిచూపులు చూస్తున్నావ్?" అడిగాడు కాలా.

"నీ మొహంచూసి...." అంటూ నీళ్ళు నమిలాడు మేఘనాధ్.

"ఏం! నేను దయ్యంలాగున్నానా?"

"కాదు! వనదేవతలా వున్నావ్. తలపైన టోపీ పోయాక అందమైన నీ బాబ్డ్‌జుట్టు కనిపిస్తోంది. మీసాలు కొట్టుకుపోయాక, అందమైన నీ ఎర్రని పెదవులు కమ్మగా ఊరిస్తూ కనుపిస్తున్నాయి." అన్నాడు మేఘనాధ్.

"ఆఁ!" అంటూ పై పెదిమ తడుముకుని "మీసం పోయిందే!"

"ఎవరునువ్వు! మిత్రురాలివా? శత్రురాలివా?" అడిగాడు మేఘనాధ్.

కాలా వేషంలోనున్న ఆ ఆడమనిషి ఏమి మాట్లాడ లేదు. మౌనంగా నీళ్ళకేసి చూస్తూ నిల్చుండిపోయింది.

"నువ్వు విడిగావెళ్ళి స్నానం చెయ్యడం, అందరికి దూరంగా వెళ్ళి పడుకోవడం, లేనిపోని మగతనాన్ని తెచ్చు

"హోమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, మీకు ప్రతి పత్రికపైన ఒక రూపాయి తగ్గింపు లభిస్తుంది. పైగా వాటిని పంపుటకు అయ్యే ఖర్చులన్నీ మేమే భరిస్తాము.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 5/-లు పంపటమే. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము ఇవ్వబడుతుంది.

3. మీరు సభ్యత్వము తీసుకోగానే మొదటిసారి పంపేకాపీలు, అటుతర్వాత ప్రతి ఏడాది జనవరి నెల కాపీలు వి.పి.ద్వారా పంపబడుతాయి. డిసెంబరు నెల వరకు వచ్చే అన్ని సంచికలకు సెట్టుకు రు. 10/-లు చొప్పున లెక్కకట్టి, ఆ మొత్తానికి ఒకేసారి వి. పి. పంపుతాము. మిగతా నెలల కాపీలు మీకు బుక్ పోస్ట్ లేదా రిజిష్టరు పోస్టులో అందజేయబడుతాయి.

4. ఏ కారణంచేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, ఆ వి.పి. పైకము మొత్తం మీరు వెంటనే **M. O.** చేయాలి. లేనిచో మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది.

5. 'హోమ్ డెలివరీ' వల్ల మీకు కాపీలు గ్యారంటీగా, త్వరితంగా చేరుతాయి. ఇండియాలో మీరు ఏ మారుమూలనున్నా ఖచ్చితంగా అందజేయబడతాయి. ఆ బాధ్యత మాది.

6. మీ చిరునామా మారినప్పుడు, మరియు జనవరి నెలలోను మీ సభ్యత్వము నెంబరు మారే అవకాశం వుంటుంది. కావున మీ పాకెట్ పై మీ పేరుకు ముందు వుండే కొత్త నెంబరును గుర్తించ కోర్తాము.

7. ఏ కారణంగానైనా 25వ తేదీలోపల మీకు పత్రికలు చేరకపోతే, ఆ విషయం మాకు తెలుపండి. వాటి బాధ్యత మేము తీసుకుంటాము. ఉత్తర ప్రత్యుత్తరాలలో మీ నెంబరు వ్రాయటం మాత్రం మరచిపోవద్దు. మీ నెంబరు వ్రాయకున్నా, 25 తేదీలోపల తెలిపినా—అవి పరిశీలనకు తీసుకోబడవు.

ప్రతినెలా V.P. కావాలనేవారికి

సెట్టు రు. 15/లు చొప్పున పంపబడుతుంది.

కుని ప్రదర్శించడం, చూశాక నాకు మొదట్లో అనుమానం మేసింది. కానీ దాదా నిన్ను మంగళ్‌సింగ్ కొడుకుగానే గుర్తించాడు. అందువల్ల నేనూ నిన్ను అనుమానించలేక పోయాను." అన్నాడు మేఘనాధ్.

ఆమె మౌనంగానే వుండిపోయింది.

"నాకు నిజంచెప్తే నీ రహస్యం నాలోనే వుంటుంది. లేకుంటే అందరికీ చెప్పిన నీకు తగినశాస్తి చేయిస్తాను." అన్నాడు మేఘనాధ్.

"నేను నిజంచెప్తాను. కానీ అది నిజమని నువ్వెలా తెలుసుకోగలవు?" అడిగింది ఆమె.

"నన్నంత వెర్రివాణ్ణి అనుకోకు. నువ్వు చెప్పే పద్ధతి లోనే అది నిజమా, అబద్ధమా అని నేను తెలుసుకోగలను చెప్పు!" అన్నాడు మేఘనాధ్.

"నిజమే చెప్తాను. కానీ ఈ ప్రయాణం పూర్తయ్యే దాకా నా గురించి ఎవ్వరికీ చెప్పకూడదు. నా మాటపైన నమ్మకం లేకుంటే, నేను ఇక్కడ్నుంచి వెనక్కి వెళ్ళి పోతాను. నీకుగానీ, మిగిలిన మరెవ్వరికీగానీ, నా వల్ల అప కారం జరగదు." అందామె.

"అలాగే! చెప్పు" అన్నాడు మేఘనాధ్.

"నేను మంగళసింగ్‌కూతుర్ని. మిమ్మల్ని బందీలుగా వుండగా మా స్థావరంలో చూశాను. నువ్వంటే నా కెందుకో ఇష్టం ఏర్పడింది మిమ్మల్ని వదిలిపెట్టించే ప్రయ త్నాలు చేశాను. మా నాన్నకూడా చెప్పాను. కానీ అతను మొండి మనిషి. నా మాట వినలేదు. ఆ తర్వాత జరిగింది నీకు తెలుసు.

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు (1. అట్టమీది బొమ్మ, 2. అట్ట చివరి బొమ్మ) సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని వ్రాసి పంపండి.

ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా పంపవచ్చును. మీ వ్యాఖ్యలు పోస్టు కార్డుపైన మాత్రమే వ్రాయాలి. సప్లిమెంట్‌కు వ్యాఖ్యలను పంపేవారు విడిగా వేరొక కార్డుపై వ్రాసి పంపాలి. 'హోమ్ డెలివరీ' సభ్యులు అయితే తమ నెంబరును విధిగా వ్రాయాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఏడాదిపాటు పత్రికను (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్‌ను) బహుమతిగా పంపుతాము. మీ వ్యాఖ్యలు 5-5-'85 తేదీ లోపల మాకు చేరాలి. ఫలితాలు జూలై '85 నెల సంచికలో ప్రకటిస్తాము.

మార్చి పోటీ ఫలితాలు

(1) మార్చి '85 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

అద్దాల మేడలో దోపిడీ!

అంతరిక్షం పైన గారడీ!!

పంపినవారు: శ్రీమతి వి. సూర్యకుమారి, W/O వి.వి.ఎస్. మూర్తి, AE/2, క్వార్టర్సు, ఎల్.ఎమ్.డి. కాలనీ—505527 (కరీంనగర్ జిల్లా)

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

పిస్తోలు గుండుతో.

పిశాచాన్ని చంపలేవు!!

పంపినవారు: శ్రీ ఆర్. పి. ఆర్. రాజు, 14—ఎన్.జి.ఆర్. బిల్డింగ్స్, గిరిపురం, తిరుపతి—517 501.

ఆ హడావుడిలో నేను మొగవేషం వేసుకుని, గుర్ర మెక్కి తప్పించుకుని వెళ్ళేందుకు బయల్దేరాను. వెనుక నుండి పోలీసులు కాల్పులు జరిపారు. నా గుర్రానికి కాలు దెబ్బ తగిలింది. అయినా అది లెక్కచెయ్యకుండా ముందు కురికింది. చాలాదూరం పోయాను.

గుర్రానికి ఆ గాయంనుంచి రక్తం విపరీతంగా కారి పోవడంతో నీరసపడినట్లుంది. దానిచూపు కూడా తగ్గి పోయింది కాబోలు. ఆ చీకట్లో, తక్కున బావిలోకి దూకింది. నేను నేర్పుగా గుర్రాన్నుంచి విడివడి దూకేశాను. ఆ బావిలో అందిన కొమ్మపట్టుకున్నాను ...."

అంటుండగా ఎదురుగావున్న మేఘనాథ్ "అమ్మా"అని పెద్దగా అరచి బోర్లపడ్డాడు. చేతిలోవున్న సంచి నీళ్ళలోకి పోయింది.

"ఏమయింది?" అడిగిందామె ఆతృతగా.

"కాలిని ఏదో పట్టుకుంది." అంటూ మళ్ళీ పడి పోయాడు.

ఆమె ముందుకు జరిగి, ముక్కుమూసుకొని మునక లేపి కళ్ళుతెరచి చూసింది. పెద్ద మొసలి నోట్లో మేఘనాథ్ కాలు చిక్కివుంది. తక్కున పైకిలేచి "నీ కాలు మొసలి నోట్లోవుంది. భయపడకు" అంటూ బొడ్లోనుంచి కత్తితీసి, వెనకవేపు ఎక్కి, క్రిందికి వంగి కత్తితో చక చక రెండు మూడుసార్లు పొడిచింది. మేఘనాథ్ కూడా కాలును బైటకు లాక్కునేందుకు, వున్న బలాన్నంతా కూడకట్టుకొని లాగాడు.

ఐదారు నిముషాలు ఇద్దరూ పోరాడారు. దాదాపు ఇరవై

శ్రీమహాలక్ష్మీ వారి వెరైటీ నవలలు

మార్చి నెల విడుదలైనవి!

1. రెండు రెళ్ళు ఆరు — మల్లాది వెంకటకృష్ణమూర్తి — 20-00
   (ఆంధ్రజ్యోతి సీరియల్)
2. గుడ్‌బై భూదేవీ గుడ్‌బై — N.R. నంది — 20-00
   (ఆంధ్రజ్యోతి సీరియల్)
3. మల్లెలు - మందారాలు — వసుంధర — 17-00
   (ఆపన సీరియల్ - రక్తపు జేర్లు)
4. అనురాగ తరంగాలు — జి. భవానీ కృష్ణమూర్తి — 12-00
5. శిక్ష — మాదిరెడ్డి సులోచన — 22-00
6. అతివలూ - అందాలూ — B. G. V. నరసింహారావు — 15-00
7. మల్లిక్ కార్టూన్లు — మల్లిక్ — 15-00

పునర్ముద్రణలు

8. నత్తలొస్తున్నాయి జాగ్రత్త — మల్లాది వెంకట కృష్ణమూర్తి — 20-00
9. చంటబ్బాయ్ — ,, ,, — 25-00
10. ప్రేమిస్తే ఏమవుతుంది — ,, ,, — 15-00
11. నాతిచరామి — ,, ,, — 16-00

అడ్వాన్సుతో పాటు నేడే మిా ఆర్డరు పంపండి.

ఫోన్ నెం: 63322

శ్రీ మహాలక్ష్మీ బుక్ ఎంటర్‌ప్రైజెస్

గవర్నరు పేట :: విజయవాడ - 2.

పోట్లు పొడిచింది మొసల్ని. అది నిర్వీర్యమైపోయింది. రక్తం పైకిచిమ్మి నీళ్ళు ఎర్రగా మారాయి. మరో నిముషానికి, మొసలి పైకితేలింది.

మేఘనాధ్ కాలుపైకి తీసి చూసుకున్నాడు. దాని పళ్ళు బాగా లోతుగా దిగివున్నాయి. రక్తం ఇంకా కారుతునే వుంది.

"నీ పేరు నాకు తెలీదు! నా ప్రాణాలు కాపాడావ్!" అన్నాడు మేఘనాధ్ కృతజ్ఞతాపూర్వకంగా.

"మనలో మనకు మన్నింపులు అవసరంలేదు. అదృష్టం మనవేపుంది. అది చాలా ప్రమాదకరమైన మొసలి." అందామె.

"నీ పేరు చెప్పలేదు!"

"మంగళ! కానీ నువ్వు నన్ను 'కాలా' అనే పిలవాలి" అందామె.

"అలాగే!"

"ఆ సంచీ ఏది?" ఖాళీగా వున్న మేఘనాధ్ చేతులు చూసి అడిగింది మంగళ.

"ఈ హడావుడిలో, అది కాస్తా జారిపోయినట్లుంది. పద వెతుకుదాం. అది దొరక్కుంటే దాదా, మిగిలిన అందరూ మనల్ని క్షమించరు" అంటూ ముందుకు దూకాడు. మంగళ కూడా అతన్ని అనుసరించింది

—(ఇంకా వుంది)

Edited and Published by S. DAMODAR REDDY
3-4-554 Narayanaguda, Hyderabad-500 029,
and Printed at Kranti Press, Madras-600 001.